ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

కేన్సర్ కణాల్లోనే పనిచేసే స్మార్ట్‌డ్రగ్

సిపిఎం సీనియర్‌నేత సారంపల్లి కన్నుమూత

3

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

25-8-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 206 పేజీలు: 10+4 వెల: 6.50

# తెలంగాణకే అవమానం

## పర్యటన పూర్తి వివరాలు విదేశాంగ శాఖకు ముందే ఇచ్చాం

## గుజరాత్ సిఎంను అనుమతించి నన్ను అడ్డుకొంటారా?

**ఇంత వివక్ష గుజరాతీ నాయకత్వం కుట్ర**

బిజెపి నేతలు అవాస్తవాలతో తప్పుదోవ పట్టించారు: సచివాలయంలో మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్



సోమవారం సచివాయంలో మీడియాతో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు24:** అమెరికా పర్యటనకు అనుమతిని రాజకీయ కారణాలతో తిరస్కరించిన కేంద్ర ప్రభుత్వ వైఖరిని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రైజింగ్ 2047 దార్శనికతలో భాగంగా రాష్ట్ర అభివృద్ధి కోసం ఒక స్పష్టమైన లక్ష్యంతో తలపెట్టిన ఈ పర్యటనను అడ్డుకోవడమంటే తెలంగాణ పట్ల వివక్ష ప్రదర్శించడమేనని నిరసనను వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి అమెరికా పర్యటనను తిరస్కరించడంపై సోమవారం సాయంత్రం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. 'అమెరికా పర్యటనకు సంబంధించి సమగ్ర వివరాలను కేంద్ర విదేశీ మంత్రిత్వ శాఖకు లిఖిత పూర్వకంగా తెలియజేశాం, ఈ పర్యటనలో రహస్యాలేమీ లేవు. దాపరికం లేదు. రాజకీయ కారణాలతో అనుమతి తిరస్కరిస్తున్నామని చెప్పడం 4 కోట్ల తెలంగాణ ప్రజలను అవమానించడమే. తెలంగాణ ప్రభుత్వం ఈ పరిణామాలను ముక్తకంఠంతో ఖండిస్తుంది. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ నిరసన తెలియజేస్తుంది' అని ఈ సందర్భంగా సిఎం పేర్కొన్నారు. 'తెలంగాణ పట్ల వివక్ష చూపడమే. తెలంగాణ పట్ల చులకన భావం, చిన్నచూపు సరికాదు. రాజకీయ కారణాలతో పర్యటనను తిరస్కరించడమంటే ఏంటి. దేశ ఫెడరల్ స్ఫూర్తికి పూర్తి విరుద్ధం. దీనిని ముక్తకంఠంతో ఖండిస్తున్నాం' అని అన్నారు. ఫెడరల్ వ్యవస్థలో ఇలాంటి ధోరణులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలనుచెడగొడుతుందని వ్యాఖ్యానించారు. కేంద్ర,

>>2

## సెప్టెంబరు 7 నుంచి వర్షాకాల అసెంబ్లీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు24:** శాసనసభ వర్షాకాల సమావేశాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజాప్రతినిధులకు వివరించారు. బ్రిటన్ పర్యటనను విజయవంతంగా ముగించుకుని తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి అందు బాటులో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో సోమవారం సాయంత్రం డాక్టర్ బీఆర్



అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. ప్రజాప్రతినిధులందరూ నియోజకవర్గాల అభివృద్ధిపై ఫోకస్ పెంచాలని ఈ సందర్భంగా సూచించారు. ప్రధానంగా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని

>>2





## క్రమశిక్షణే ముఖ్యం

కొండా సురేఖ అంశం పార్టీ చూస్తుంది..

మంత్రికి చెక్, అటవీశాఖలో డిప్యూటేషన్లు రద్దు

సిఎం రేవంత్‌తో భట్టి, మల్లు రవి భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు24:** మంత్రి కొండా సురేఖకు పార్టీ క్రమశిక్షణా సంఘం షోకాజ్ నోటీసు జారీ చేసిన ఉదంతంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. పార్టీ అంతర్గత వ్యవహారాలపై తాను బహిరంగంగా వ్యాఖ్యానించబోనని, క్రమశిక్షణా సంఘమే దీనిపై తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆయన వెల్లడించారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుగొండలో నిర్వహించిన మంత్రి కొండా సురేఖ పుట్టినరోజు వేడుకలో ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. సీఎం రేవంత్ రెడ్డితో పాటు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని ఉద్దేశించి ఆమె చేసిన విమర్శలు పార్టీలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న టీపీసీసీ క్రమశిక్షణా సంఘం, వివరణ కోరుతూ మంత్రి సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. షోకాజ్ నోటీసుకు మంత్రి కొండా సురేఖ ఇప్పటికే లిఖితపూర్వక సమాధానం సమర్పించారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని, ఆ అంశానికి తనను బాధ్యురాలిని చేయవద్దని వివరణలో పేర్కొన్నట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో, పార్టీ క్రమశిక్షణ విషయంలో ఎవరూ

>>2



కేంద్ర కేబినెట్ ప్రక్షాళనకు ముహూర్తం ఖరారు!
20 మంది మంత్రులపై వేటు లేదా శాఖల్లో మార్పు?

5



మిస్ యూనివర్స్ ఇండియాగా కజియా లిజ్‌మెజో

5




హెచ్‌వన్-బి, ఒపిటిలపై షాకింగ్ ఫీజులు!
అమెరికాకు వెళ్లే కల కలగానే మారుస్తున్న ట్రంప్



## చంచల్‌గూడ జైలుకు కారుమూరి

**ఎపి లిక్కర్ స్కాం కేసు**

సెప్టెంబరు 7 దాకా రిమాండు

**హైదరాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** ఏపీలో వైకాపా హయాంలో వెలుగుచూసిన మద్యం రవాణా కుంభకోణం కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్టు చేసిన వైకాపా

>>2

## భారీ వర్ష సూచన

30 కి.మీ వేగంతో ఈదురుగాలులకు అవకాశం

**హైదరాబాద్, అగస్టు 24, ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తెలంగాణపై ప్రభావం చూపనుండి. ఇది సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకూ ఆవరించింది. రానున్న 24 గంటల్లో ఇది ఒడిశా, పశ్చిమ బెంగాల్ మీదుగా వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇది జార్ఖండ్, మధ్యప్రదేశ్ వైపు కదులుతోంది. ఫలితంగా బంగాళాఖాతంలో గాలుల తీవ్రత క్రమంగా పెరుగుతోందని, తీరానికి వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. ఈ అల్పపీడనానికి తోడు, దానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతుండటం, నైరుతి రుతుపవనాలు పుంజుకోవడంతో వీటి ప్రభావం కారణంగా తెలంగాణలో ఓ మోస్తరు నుండి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతవరణ శాఖ వెల్లడించింది. రాష్ట్రంలో రెండు రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలకు ఛాన్స్ ఉందని తెలిపింది. తొలుత జల్లులతో ప్రారంభమై ఆ తర్వాత ఓ మెస్తరు నుండి భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. రోజంతా మేఘాలు కదులుతాయని, వర్షం పడే సమయంలో గాలి వేగం గంటకు 30 కిలోమీటర్లు వరకూ ఉంటుందని తెలియచేసింది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని కామారెడ్డి, జనగాం, సంగారెడ్డి, సిద్దిపేట్, మెదక్, సిరిసిల్ల, వరంగల్, హన్మకొండ, భువనగిరి, మహబూబాబాద్ జిల్లాల్లో భారీవర్షాలు పడనున్నాయి. ఇక ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, మంచిర్యాల, జగిత్యాల, నాగర్‌కర్నూలు, ములుగు అంతటా ఓ మోస్తరు వర్షాలు కురిసే వీలుందని వెల్లడించింది. కాగా రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. గడచిన 24 గంటల్లో పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురవగా, ప్రధానంగా ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో వర్ష తీవ్రత ఎక్కువగా కనిపించింది. రాష్ట్రంలో నమోదైన వర్షపాతాన్ని పరిశీలిస్తే సంగారెడ్డి జిల్లా నిజాంపేటలో అత్యధికంగా 6.5 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డైంది. కామారెడ్డి జిల్లా పిట్లం, మేడ్చల్ జిల్లా మల్కాజిగిరిలలో



>>2



## 27న గ్రామ, వార్డు సభలు

బిఎల్‌ఒలకు దిశానిర్దేశం చేసిన సిఇఒ సుదర్శన్‌రెడ్డి

సవరణల అనంతరం తుది ఓటర్ల జాబితా విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు24:** ఈనెల 27న రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ,వార్డు సభలు నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. సర్(ఎస్ఐఆర్) ఓటర్ల ముసాయిదా జాబితాను బిఎల్‌ఓలు ఈ సభలలో చదవి వినిపిస్తారు. అర్హులైనా పేరు లేనివారు అవసరమైన ధృవ పత్రాలు,డిక్లరేషన్‌తో పాటు ఫామ్-6 నింపి సమర్పించాలి, జాబితాలో పేరు,అడ్రస్‌లో తప్పులుంటే సరిదిద్దుకునేందుకు ఫామ్-8 పూర్తి చేయాలి. ఈ సవరణల తర్వాత ఎన్నికల సంఘం తుది ఓటర్ జాబితాను విడుదల చేస్తుంది. ఈ మేరకు సోమవారం ముఖ్య ఎన్నికల అధికారి(సీఈవో) సి. సుదర్శన్ రెడ్డి, డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి(అదనపు ముఖ్య ఎన్నికల అధికారి), జి.ఎస్.చారి, (డిప్యూటీ సీఈఓ), అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు (డిఈఓ), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఇఆర్‌ఓ), అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఏఈఆర్‌ఓ)తో రాష్ట్రంలోని అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో గ్రామ/వార్డు సభల నిర్వహణ, సంబంధిత ఎలక్టోరల్ రోల్ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామ,వార్డు సభల ఏర్పాటు,నిర్వహణలో పాటించాల్సిన విషయాలు,అనామలీస్, లాజికల్ డిస్క్రిపన్సీస్ ఉన్న ఓటర్లకు నోటీసుల జారీ, హియరింగ్‌ల నిర్వహణపై పలు సూచనలు చేశారు. గ్రామ/వార్డు సభల్లో ఆబ్‌సెంట్, షిఫ్టెడ్,డెడ్, డుప్లికేట్(ఎస్‌డిడి) ఓటర్ల వివరాలను సంబంధిత బిఎల్‌ఓలు బహిరంగంగా చదివి వినిపించాలి. అలాగే,ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చబడిన ఓటర్ల పేర్లను కూడా సభలో చదివి వినిపించాలి అని చెప్పారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ఏదైనా కారణంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చబడని దరఖాస్తుదారుల వివరాలను గుర్తించి, వాటిని పరిశీలించాలి పేర్కొన్నారు. 01.10.2026 నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తి చేసే అర్హత కలిగిన భారతీయ పౌరులు తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకునేందుకు ఫారమ్-6,డిక్లరేషన్ ఫారమ్, అవసరమైన ఆధార పత్రాలను సమర్పించేలా అవగాహన కల్పించాలి. ఓటర్ల పేర్ల తొలగింపులకు ఫారమ్-7, సవరణలకు ఫారమ్-8, సంబంధిత ఆధార పత్రాలను సమర్పించే విధంగా ప్రజలకు సూచించాలని చెప్పారు. క్లయిమ్స్,అబ్జెక్షన్స్, వెరిఫికేషన్ నిర్దేశించిన కాలంలో, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన అవసరమైన పత్రాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామ/వార్డు సభల్లో చర్చలు నిర్వహించాలని సూచించారు. ఓటర్ల జాబితా,సర్‌కు సంబంధించిన ఇతర ముఖ్యమైన అంశాలను కూడా గ్రామ/వార్డు సభల్లో చర్చించాలని, వాటిని బిఎల్‌ఓలు నోట్ చేసుకోవాలని చెప్పారు. నో-మ్యాపింగ్ కేసులకు, అనామలీస్ ఉన్న ఓటర్లకు నోటీసుల జనరేషన్, జారి ప్రక్రియను వేగవంతం చేయాలి. ప్రతి నోటీసులో హియరింగ్ వెన్యూ, డేట్,

>>2

## అసెంబ్లీ కమిటీలు నిత్యం మానిటరింగ్

కౌన్సిల్ ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

తెలంగాణ గంగా జమున తెహజీబ్‌కు ఒక గొప్ప ప్రతీక: స్పీకర్ ప్రసాద్‌కుమార్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు24:** శాసనమండలి (లెజిస్లేచర్) మైనారిటీల సంక్షేమ కమిటీ, షెడ్యూల్ కులాల సంక్షేమ కమిటీల ప్రారంభ సమావేశం శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో సోమవారం జరిగింది. శాసన పరిషత్ ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ హాజరై ప్రారంభించారు. లెజిస్లేచర్ మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ తోట లక్ష్మీకాంతా రావు, సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, పాయల్ శంకర్, వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ మేడిపల్లి సత్యం,, సభ్యులు వెడ్మ బొజ్జు, కేఆర్ నాగరాజు, కవ్వంపల్లి సత్యనారాయణ, విజయుడు, శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్య హాజరయ్యారు. ఈ సమావేశాలలో శాసన పరిషత్ కార్యదర్శి డా. వి నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది, ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా చేరేలా చూడడంలో కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రభుత్వం

>>2



## 22ఎపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు..

22ఎ దరఖాస్తులు ఫాస్ట్‌ట్రాక్‌లో పరిష్కరించాం,

98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి: మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు24:** రాష్ట్రంలో 22ఏలో లక్షలాది ఎకరాలు చేర్చారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, 2023 డిసెంబర్ 7 నాటికి ఉన్న పరిస్థితి, ప్రస్తుత పరిస్థితి, ఏ కేటగిరీ భూములు ఎంత మేర నిషేధిత జాబితాలో ఉన్నాయో పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచుతున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. 22ఎ పేరిట ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతాన్ని సృష్టిస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయని

>>2

## తాగునీటికే కృష్ణాజలాలు

కెఆర్‌ఎంబి త్రిసభ్య కమిటీ తీర్మానం

సెప్టెంబరు 4న మళ్లీ సమావేశం

నీటి పంపిణీపై ఇంకా తేలని నిర్ణయం




**హైదరాబాద్, ఆగస్టు 24,ప్రభాతవార్త:** ఎల్‌నినోతో ఏర్పడి వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా కృష్ణానదిపై ఉన్న ఉమ్మడి ప్రాజెక్టుల్లోని నీటిని తాగునీటి అవసరాలు తీర్చడం కోసం మాత్రమే ఉపయోగించాలని కెఆర్‌ఎంబి త్రిసభ్య కమిటి సూత్రపాయంగా తీర్మాణం చేసింది. సెప్టెంబర్ 4న నీటిపంపిణీపై సమగ్రంగా చర్చించి విధానపరమైన నిర్ణయం తీసుకొంటారు. హైదరాబాద్ జలసౌధలో సోమవారం జరిగిన కృష్ణానదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ నీటివాటాల పంపిణీ నిర్ణయం తీసుకోకుండానే వాయిదా పడింది. తెలంగాణ నీటిపారుదలశాఖ ఎప్పటిలాగానే ఆంధ్రప్రదేశ్ నీరు అధికంగా వాడుకోంటుందని పేచిపెడుతూ ఫిర్యాదు చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి మాత్రం 47టిఎంపిసిల నీరు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రతినిధి మాత్రం కృష్ణానదిలో ఉన్న నీటిని చెరిసగం పంపిణీ చేయాలని కోరినారు. కెఆర్‌ఎంబి మెంబర్ సెక్రటరీ కాంబోజి సతీశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ ఇఎన్‌సి రమేశ్ బాబు,ఆంధ్ర ఇఎన్‌సి నరసింహమూర్తి పాల్గొన్నారు. ఎల్‌నినో కారణంగా నాగార్జునసాగర్‌లో ఉన్న177.67టిఎంసిలనీరు, శ్రీశైలం జలాశయాల్లో అందుబాటులో ఉన్న167.88 టిఎంసిల నీటి పంపిణీపై చర్చలు జరిపారు. రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు గానూ నీటి విడుదలపై చర్చించేందుకు త్రిసభ్య కమిటీని సమావేశమైనారు.

>>2



సోమవారం మాస్కోలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీఅయిన విదేశాంగ మంత్రి జైశంకర్

## చంచల్‌గూడ జైలుకు కారుమూరి

>> నేత, ఏపీ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు నాంపల్లి సెషన్స్ కోర్టు సోమవారం రిమాండు విధించింది. ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో కారుమూరిని అరెస్టు చేయడం తెలిసిందే. ఏపీలో వైకాపా హయాంలో వెలుగు చూసిన మద్యం రవాణా కుంభకోణంలో కారుమూరి నాగేశ్వరరావుతో పాటు మరికొందరు కలిసి ఒక ముఠాగా ఏర్పడి సర్కారు ఖజానా కు 195.33 కోట్ల రూపాయల మేరకు నష్టం కలిగించారనేది ఈడీ అభియోగం. ఇందులో కారుమూరి నాగేశ్వరరావు 28 కోట్ల రూపాయలను ముడుపులుగా తీసుకున్నారని ఈడీ అధికారులు కోర్టుకు తెలిపారు. మద్యం రవాణాకు సంబంధించి సిగ్మా సప్లయ్ చైన్ సొల్యూషన్స్‌ను ఫ్రంట్ కంపెనీగా వుంచి గోల్‌మాల్‌కు తెరలేపినట్లు ఈడీ ఆరోపించింది. ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం కలిగించడంతో పా టు సర్కారీ ఆదాయాన్ని వీరంతా సొంతానికి వాడుకున్నారని ఈడీ పేర్కొంది. అరెస్టు తరువాత కారుమూరిని ఈడీ అధికారులు నేరుగా బషీర్ బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి తరలించిన అధికారులు ఆదివారం రాత్రి అక్కడే వుంచారు. సోమవారం ఉదయం గాంధీ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. అనంతకం నాంపల్లి సెషన్స్ కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి కారుమూరికి సె ప్టెంబరు ఏడవ తేదీ వరకు రిమాండు విధించారు. దీని తరువాత ఈడీ అధికారులు కారుమూరిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌లో దివ్యాంగుల అదనపు సాయానికి గ్రీన్‌సిగ్నల్

### రాష్ట్ర సర్కార్‌కు హైకోర్టులో ఊరట

**హైదరాబాద్, అగస్టు 24, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వానికి రాష్ట్ర హైకోర్టులో కీలక ఊరట లభించింది. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలవుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ యువతులకు అందిస్తున్న అదనపు ఆర్థికసాయాన్ని కొనసాగించుకునేందుకు హైకోర్టు పచ్చజెండా ఊపింది. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద సాధారణ లబ్దిదారులతో పోలిస్తే దివ్యాంగ యువతులకు 25 శాతం అదనంగా ఆర్థికసాయం అందించేలా గతంలో రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. విచారణ సందర్భంగా ప్రభుత్వం తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన ఉన్నత న్యాయస్థానం, దివ్యాంగులకు ఇచ్చే ఆర్థిక సాయం ప్రక్రియను కొనసాగించేందుకు అనుమతినిచ్చింది. అనంతరం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై దాఖలైన తదుపరి పిటిషన్ల విచారణను హైకోర్టు రెండు వారాల పాటు వాయిదా వేసింది.

## భారీ వర్ష సూచన

>> 5.1 సెంటీమీటర్లు చొప్పున వర్షం కురిసింది. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో 4.7 సెంటీమీటర్లు, పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్, ముత్తారంలలో 4.5 సెంటీమీటర్లు, సంగారెడ్డి జిల్లా కల్హేర్, మెదక్ జిల్లా టేక్మల్‌లలో 4.2 సెంటీమీటర్లు, కామారెడ్డి జిల్లా బిచ్కుందలో 3.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వీటితో పాటు భూపాలపల్లి, ములుగు, భువనగిరి, జగిత్యాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు కురిశాయి.

## క్రమశిక్షణే ముఖ్యం

>> అతీతులు కారని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. బ్రిటన్ పర్యటనను విజయవంతంగా ముగించుకుని తిరిగి వచ్చిన సీఎం రేవంత్, అందుబాటులో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించారు. నాయకులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. కొండా సురేఖ అంశం పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని, ఇకపై ఎవరూ ఆ అంశాన్ని మాట్లాడొద్దని సూచించారు. కమిటీలు తీసుకునే నిర్ణయాలకు పార్టీ నాయకులంతా కట్టుబడి ఉండాలని సూచించారు. ఊహాజనిత అంశాలను ప్రస్తావించవద్దని నేతలకు సిఎం స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయాలను గౌరవించాలని సూచించారు. నీటిపారుదల ప్రాజెక్టులకు భూసేకరణను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. భూసేకరణను నిర్లక్ష్యం చేస్తే ప్రాజెక్టులు ఎప్పటికీ పూర్తికావన్నారు. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ నిధులను వెంటనే మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ప్రతి ఒక్క నాయకుడూ నియోజక వర్గ అభివృద్ధిపై దృష్టిసారించాలని ఆయన ఆదేశించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం అటవిశాఖ మంత్రి కొండా సురేఖకు చెక్ పెట్టింది. ఆమెకు తెలియకుండానే అధికారులు, ఇతర ఉన్నతాధికారులు,సిబ్బంది డిప్యూటేషన్లను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొండా సురేఖ శాఖల్లో ముఖ్యమైన అటవిశాఖలో డిప్యూటేషన్ల రద్దు సంచలనంగా మారింది. డిప్యూటేషన్‌పై ఉన్న అధికారులను పీసీసీఎఫ్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అది కూడా ఆమెకు తెలియకుండానే ఉత్తర్వులు వెలువడడంతో చర్చనీయాంశంగా మారింది. లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కలిశారు. అమెరికా పర్యటనకు కేంద్రం నిరాకరణ, తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. వీటితో పాటు కొండా సుస్మిత, చిన్నారెడ్డిల అంశాలపై మాట్లాడినట్లు తెలిసింది. ఈ ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకున్న ముఖ్యమంత్రికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా చేరుకొని ఘన స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టులోనే క్రమశిక్షణా సంఘం చైర్మన్ మల్లు రవి సిఎంను కలిసి తాజా పరిణామాలపై కొద్దిసేపు మాట్లారు. కాగా, కొండా సరేఖ క్రమశిక్షణ అంశంపై ఓ వైపు సిఎం రేవంత్ చర్చలు చేస్తుండగా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న ప్రత్యేక వనమహోత్సవంపై అధికారులతో మంత్రి కొండా సురేఖ సమీక్ష నిర్వహించడం గమనార్హం.

## 7 నుంచి వర్షాకాల అసెంబ్లీ

>> చెప్పారు. భూసేకరణపై నిర్లక్ష్యం వహిస్తే ప్రాజెక్టులు ఎప్పటికీ పూర్తి కావని, భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, అటవీ అనుమతులకు సంబంధించి నిధులను వెంటనే మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, రామచంద్ర నాయక్, బీర్ల ఐలయ్య, వేముల వీరేశం పాల్గొన్నారు. ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, కడియం కావ్య, రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య హాజరయ్యారు. అలాగే ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, వీర్లపల్లి శంకర్, ప్రేమ్ సాగర్ రావు, నవీన్ యాదవ్, మట్టా రాగమాయి మందుల సామేల్, వేద్మ బొజ్జు, కోరం కనకయ్య, లక్ష్మీకాంతరావు, రాంచంద్రునాయక్, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్, బత్తుల లక్ష్మారెడ్డి, మనోహర్ రెడ్డి, తెల్లం వెంకట్ రావు, నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, మురళి నాయక్, యశస్విని రెడ్డి పాల్గొన్నారు. విదేశీ పర్యటన విజయవంతంగా ముగించుకుని తిరిగి వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు శుభాకాంక్షలు తెలిపారు. కాగా అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజుల నిర్వహించాలనే విషయాన్ని అసెంబ్లీ వ్యవహారాల సలహా కమిటీ(బిఏసి) సమావేశంలో నిర్ణయించను న్నట్లు సమాచారం.

## 27న గ్రామ, వార్డు సభలు

>> టైమ్ వివరాలను స్పష్టంగా, తప్పనిసరిగా పేర్కొనాలని చెప్పారు. అనామలీస్, నో మ్యాపింగ్ సంబంధించిన జాబితాలను బిఎల్‌ఓలు సంబంధిత రాజకీయ పార్టీలకు షేర్ చేయాలి. రాజకీయ పార్టీలతో సమన్వయం కోసం పొలిటికల్ పార్టీ సమావేశాలను ప్రతి వారం తప్ప నిసరిగా నిర్వహించేలా చర్యలు తీసుకోవా లని చెప్పారు.
అనంతరం సీఈవో అన్ని జిల్లాల డిఈవోల తో మాట్లాడుతూ నోటీసుల జనరేషన్, జారి ప్రక్రియ, హియరింగ్‌ల నిర్వహణ, గ్రామ/ వార్డు సభల ఏర్పాట్లు తది తర అంశాలపై సమీక్ష చేశారు. గ్రామ/వార్డు సభలను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించ డం ద్వారా ఓటర్లలో విశ్వాసాన్ని పెంపొం దించి, ఎన్నికల ప్రక్రియపై మరింత విశ్వసనీ యతను తీసుకురావాలని సూచించారు.

## వారం - వర్జ్యం

25-08-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.ద్వాదశి ఉ.6.21
న.ఉత్తరాషాఢ రా.10.49
వ.రా.3.08-తె.4.52
దు1. ఉ.8.24-ఉ.9.14
దు2. రా.11.27-రా.12.17
రాహు మ.3.00-సా.4.30 శుభ లేదు

## వార్తాఫలం

**మేషం :** దూరప్రాంత ప్రయాణాలు, వీసా పాస్పోర్ట్ వంటి అంశాలు కలిసి వస్తాయి. విందు, వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు.

**వృషభం :** ఉన్నత స్థానంలోని వారు మీ సలహాలను, సూచనలను పాటిస్తారు. జరిపే చర్చలు ఫలిస్తాయి. వ్యాపారాలు విస్తరిస్తాయి.

**మిథునం :** గణితానికి సంబంధించిన అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవడం మంచిది. తండ్రి నుండి ధనలాభం.

**కర్కాటకం :** గృహావసరాలకు గాను ధన వ్యయాన్ని అధికంగా చేస్తారు. వీసా పాస్పోర్ట్ వంటి అంశాలు కలిసి వస్తాయి.

**సింహం :** న్యాయబద్ధమైన మీ వాదనలకు సంబంధిత అధికారుల అండదండలు లభిస్తాయి. ధనాన్ని పొదుపు చేస్తారు.

**కన్య :** వ్యక్తిగత పురోభివృద్ధికి ఉపకరించే లిఖితపూర్వక ఒప్పందాన్ని సానుకూల పరచు కోగలుగుతారు. దూర ప్రయాణాలు.

**తుల :** ఉన్నత స్థానంలో ఉన్నవారు సహాయ సహకారాలను అందిస్తారు. నూతన అవకాశాలు కలిసివస్తాయి. వాటిని సద్వినియోగం.

**వృశ్చికం :** మీలో పోటీతత్వం పెంపొందు తుంది. చిన్నచిన్న విషయాలను కూడా నిర్లక్ష్యం చేయరు. తాకట్టులను విడిపిస్తారు.

**ధనుస్సు :** వృత్తి, ఉద్యోగ వ్యక్తిగత వ్యవహారాల తాలూకు బరువు బాధ్యతలు అలసటకు వత్తిడికి గురి చేస్తాయి.

**మకరం :** ప్రజా సంబంధాలు అధికంగా కలిగినటువంటి వ్యాపారస్తులకు అనుకూలంగా ఉంటుంది. గృహనిర్మాణాల ఆలోచనలు.

**కుంభం :** రాజకీయ స్నేహాలు ఉపకరిస్తాయి. తనఖా వస్తువులను విడిపిస్తారు. ఆవేశాన్ని కలిగి ఉంటారు. కుటుంబ ప్రోత్సాహం.

**మీనం :** క్రీడారంగంలోని వారికి అనుకూలంగా ఉంటుంది. మీలో పోటీతత్వం పెంపొందుతుంది. ప్రముఖుల కలయిక.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తెలంగాణకే అవమానం

>> రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సిద్ధాంత వైరుధ్యాలు ఉండొచ్చు. కానీ సత్సంబంధాలు ఉండాలి. తెలంగాణ ముఖ్యమంత్రి అమెరికా పర్యటనను తిరస్కరించడాన్ని వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో లేవనెత్తుతామని చెప్పారు.
పెట్టుబడులను ఆకర్షించడం, టెక్నాలజీ ప్రమోషన్‌లో భాగంగా ఈ ఏడాది నిర్వహించబోయే ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌లో భాగస్వామ్యం కావాలని ఆహ్వానించడానికి అమెరికా పర్యటన తలపెట్టామని వివరించారు. వైబ్రెంట్ గుజరాత్ పేరుతో పెట్టుబడుల కోసం గుజరాత్ సీఎం పర్యటనకు అనుమతించి తెలంగాణ ముఖ్యమంత్రి పర్యటనకు నిరాకరించడమేంటని ప్రశ్నించారు.
తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్య సాధనకు అనుగుణంగా, వికసిత్ భారత్ 2047 ఆలోచనల మేరకు దేశం ఆర్థికంగా వృద్ధిని సాధించాలన్న ఆలోచనతో విద్య, క్రీడలు, ఇతర రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడానికి అమెరికా పర్యటన తలపెట్టామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ వైఖరితో తెలంగాణకు రావలసిన పెట్టుబడులు రాకుండా పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. "ముఖ్యంగా తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించాలని భావించి, ప్రణాళికాబద్ధంగా పెట్టుబడులను ఆకర్షించడానికి ఒక స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళుతున్నాం. ఇందులో భాగంగానే విదేశాంగ మంత్రిత్వ శాఖను సంప్రదించి విదేశీ పర్యటన ఖరారు చేసుకోవడం గతంలోనూ, ఇప్పుడూ జరుగుతోంది. దురదృష్టవశాత్తు ఇంగ్లండ్ దేశానికి అనుమతించి అమెరికాకు తిరస్కరించారు. తిరస్కరించడమే కాకుండా తమ పర్యటనపై అవాస్తవాలతో కూడిన ఆరోపణలు చేస్తూ తప్పుదోవ పట్టించే విధంగా కొందరు మాట్లాడుతున్నారు. పర్యటనకు సంబంధించిన వివరాలు ఇవ్వలేదన్న ఆరోపణలు చేస్తున్నందున, విదేశీ పర్యటనకు సంబంధించి క్లియరెన్స్ కోసం చేసిన దరఖాస్తులో స్పష్టంగా చెప్పాం" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విదేశాంగ మంత్రిత్వ శాఖకు లిఖిత పూర్వకంగా చేసిన దరఖాస్తు అంశాలను చదివి వినిపించారు.
తాను తలపెట్టింది అధికారిక పర్యటన. అధికార పర్యటన సందర్భాల్లో ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు పర్యవేక్షి స్తాయి. ఇందులో దాపరికం ఉండదు. రాయబార కార్యాలయ అధికారులు పర్యటనను పర్యవేక్షి ంచడమే కాకుండా ప్రతి సమావేశంలోనూ పాల్గొంటారు.
ప్రతి సమావేశంలో చర్చించిన అంశాలన్నింటిపైనా రాయబార కార్యాలయాల అధికారులు కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తారు. ఈ విషయాలన్నీ విదేశాంగ మంత్రికి తెలుసు. విదేశాంగ మంత్రి గతంలో విదేశాంగ శాఖలో కార్యదర్శిగా కూడా పనిచేశారు. వారికి అన్ని విషయాలు తెలుసు' అని చెప్పారు.
విద్య, క్రీడలు, పెట్టుబడుల కోసం ఈ పర్యటన తలపెట్టాం. వచ్చే డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించే ఇన్వెస్ట్ మెంట్ సమ్మిట్‌లో పాల్గొనాల్సిందిగా ఆహ్వానం పలకడానికి, ప్రతిష్టాత్మకమైన విద్యాలయాలను హైదరాబాద్ ఆహ్వానించాలని ఈ పర్యటన లక్ష్యం.
అని వివరించారు. ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు, పొటెన్షియల్ పార్ట్‌నర్‌షిప్‌ల కోసం, ముఖ్యంగా విద్య, క్రీడలు, పెట్టుబడులకు సంబంధించిన పర్యటన ఉద్దేశాలను చాలా స్పష్టంగా తెలియజేశాం అని చెప్పారు.
వైబ్రెంట్ గుజరాత్ పేరుతో రోడ్ షోల కోసం గుజరాత్ సీఎంకు అమెరికా, కెనడా దేశాల పర్యటనకు అనుమతించి, విద్య, క్రీడా రంగంలో పెట్టుబడులకు ఆకర్షించడానికి తెలంగాణ ముఖ్యమంత్రి పర్యటనను ఎందుకు తిరస్కరించారని ప్రశ్నించారు. పైగా ఇంగ్లండ్ దేశం వెళ్లిన తర్వాత మధ్యలో తిరస్కరించడమేంటని అడిగారు. లండన్ పర్యటనలో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ లండన్, లండన్ బిజినెస్ స్కూల్ వారితో చర్చలు జరిపాం. సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయి. వారు కొన్ని షార్ట్ టర్మ్ కోర్సులను ప్రారంభించే విషయం పరిశీలిస్తామని, త్వరలో ఒప్పందాలు చేసుకోబోతున్నామని చెప్పారు. అమెరికా, యూకేల్లోని విశ్వవిద్యాలయాల్లో చదువుకోవాలంటే కోట్ల రూపాయలు ఖర్చుచేయాల్సి వస్తోంది. విదేశీ విద్యకు రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందించి ప్రోత్సహి స్తున్నప్పటికీ అది సరిపోవడం లేదు. కాబట్టి ఆ వర్సిటీలను ఇక్కడికి ఆహ్వానించడం ద్వారా ఉత్తమమైన విద్యను అందించడానికి వీలవుతుందని ఆలోచన చేశాం అని చెప్పారు. 2034 నాటికి 1 ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ ఎదగాలన్న లక్ష్యం కోసం పర్యటన పెట్టుకుంటే తిరస్కరించడమంటే ఇది 4 కోట్ల ప్రజలకు జరిగిన అవమానం. ఆక్షేపనీయం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమేనని పేర్కొన్నారు. 'డిసెంబర్‌లో నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌లో పాల్గొనడానికి ఆహ్వానించాలంటే ఆయా సంస్థలు, విద్యాలయాలను నాలుగైదు నెలల ముందే ఆహ్వానాలను అందించాల్సి ఉంటుందని వారికి తగిన సమయం ఇవ్వాల్సి ఉంటుంది. తెలంగాణ లక్ష్యాలను ఆపలేరు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం ఆహ్వానాలను అందించడానికి అధికారులను అమెరికాకు పంపించాం" అని ముఖ్యమంత్రి తెలిపారు. విదేశాల్లో ఉన్నప్పుడే ఈ అంశంపై స్పందిస్తే తనను దేశ ద్రోహి అంటారని, అందుకే భారత్‌కు తిరిగొచ్చిన తర్వాత స్పందిస్తున్నానని పేర్కొన్నారు. 'నా పర్యటనను తిరస్కరించడమే కాకుండా బిజెపి నాయకులు రాజకీయంగా నాపై వ్యక్తిగత ఆరోపణలు చేశారు బీజేపీ నాయకులు విచక్షణ కోల్పోయి ప్రభుత్వంపై, అధికారిక పర్యటనపై తప్పుడు ప్రకటనలు చేశారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ వైఖరిపై రాజకీయ అంశాలను నేను ప్రస్తావించదలచుకోలేదు. ఇది రెండు ప్రభుత్వాలకు సంబంధించిన అంశం అమెరికా పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖకు సమర్పించాం రాజకీయ పరమైన నిర్ణయాలతో పర్యటనను తిరస్కరిస్తున్నామని చెప్పారు ఆ రాజకీయ కారణాలు ఏమిటో ప్రధాని నరేంద్ర మోదీ చెప్పాలి అని పేర్కొన్నారు.
తెలంగాణ అంటే మోదీకి వివక్ష.. చిన్న చూపు..తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునేందుకు గుజరాతీ నాయకత్వం చేస్తున్న కుట్ర అని వ్యాఖ్యానించారు.

## అసెంబ్లీ కమిటీలు నిత్యం మానిటరింగ్

>> అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కమిటీలు నిత్యం మానీటరింగ్ చేస్తూ, ప్రభుత్వానికి సలహాలు సూచనలు అందించాలని చెప్పారు. మైనారిటీల విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, నిజమైన ప్రయోజనాలను అందించేలా చూడాల్సిన బాధ్యత ఈ కమిటీపై ఉన్నదన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటనలతో పాటుగా, అధికారుల ద్వారా తగు సమాచారాన్ని తెప్పించుకుని షెడ్యూల్ కులాలకు సంబంధించిన పథకాల అమలులో లోటుపాట్లను సమీక్షించి ప్రభుత్వానికి తగు సూచనలు చేయాలని చెప్పారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... నేను కూడా 2008 లో షెడ్యూల్ కులాల కమిటీ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహించాను. తెలంగాణ ఎప్పటినుంచో గంగా జమున తెహజీబ్‌కు ఒక గొప్ప ప్రతీకగా నిలుస్తోందని చెప్పారు.. హిందువులు, ముస్లిములు, క్రిష్టియన్లు, ఇతర మైనారిటీ సోదరులు తరతరాలుగా ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసి జీవిస్తూ, పండుగలు, భాషలు, ఆహారం, సంస్కృతులను పంచుకుంటూ, అన్నింటికంటే ముఖ్యంగా ప్రేమ, విశ్వాసాలతో ముందుకు సాగుతున్నారని చెప్పారు. రాష్ట్ర జనాభాలో 18 శాతం ఉన్న షెడ్యూల్ కులాల జనాభా ఉన్నారు. ఈ కమిటీ షెడ్యూల్ కులాల అభ్యున్నతి, సంక్షేమం కొరకు పనిచేస్తూ వారి ప్రాథమిక అవసరాలను గుర్తించి, అందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని చెప్పారు. కమిటీ సభ్యులు తమ అనుభవం, అవగాహనతో అధికారులతో కలిసికట్టుగా పనిచేసి ప్రజాప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాలను సాధించడానికి, మైనారిటీలు, వెనుకబడిన తరగతుల అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు.



శ్రావణ సోమవారం సందర్భంగా హరిద్వార్‌లోని గంగా నదిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

## 22ఎపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు..

>> ఆయన ఆరోపించారు. 22ఎ పేరిట ఇంతవరకు వచ్చిన దరఖాస్తుల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని దీనిపై దుష్ప్రచారాలను నమ్మవద్దని కోరారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటికి నిషేధిత జాబితాలో ఉన్న ఫారెస్ట్, వక్ఫ్, దేవాదాయ, అసైన్డ్, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాల మేరకు నిషేధిత జాబితాలో ఉన్న భూములు, ప్రైవేట్ భూములు తదితర వివరాలను కేటగిరీల వారీగా మొత్తం వివరాలను మీడియాకు విడుదల చేశారు. సోమవారం నాడు సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లక్షలాది ఎకరాలు 22ఎలో పెట్టారని ప్రతిపక్షాలు ఆరోపణలు చేయడం కాదు.. ఎంత ఉంది, ఎందుకు ఉంది, ఎవరి భూమి, ఏ కారణంతో నిషేధిత జాబితాలో పెట్టారనే ప్రతి అంశాన్ని రికార్డులతో చెబుతాం. వాస్తవాలు ప్రజల ముందుకు వస్తే ఎవరు నిజం చెబుతున్నారో ప్రజలే నిర్ణయిస్తారు అన్నారు. ప్రభుత్వ భూములు, ప్రజా ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులు లేదా రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకు మళ్లించకుండా కాపాడటం 22ఏ ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని రెండు రెవెన్యూ గ్రామాల్లో 122 ఎకరాలు, మరోచోట 400కు పైగా ఎకరాలు కలిపి సుమారు 522 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించిన వ్యవహారాలను ఉదాహరణగా ప్రస్తావించారు. ఎన్నికలకు ముందు ఈ భూముల వ్యవహారం అప్పట్లో మీడియాలో కూడా చర్చకు వచ్చిందని, ప్రభుత్వ భూములను భారీ విస్తీర్ణాల్లో ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరించారు. ఇలాంటి భూములను నిషేధిత జాబితాలో పెట్టడం తప్పా? ఎందుకు పెట్టకూడదని ప్రశ్నించారు. సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డి పల్లి రెవెన్యూ గ్రామంలో 1958కు ముందు అసైన్‌మెంట్ జరిగినట్లు చూపిస్తూ, సరైన ప్రభుత్వ రికార్డులు లేకుండానే భూములపై హక్కులు సృష్టించి దారదత్తం చేశారు. హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లో సర్వే నంబర్ 403కు సంబంధించి సుమారు 1,280 ఎకరాల విస్తీర్ణం ఉండగా, అందులో కేవలం రెండు ప్లాట్లు మాత్రమే నిషేధిత జాబితాలో ఉన్నాయని తెలిపారు.గతంలో హైకోర్టు ఆదేశాల మేరకు రికార్డులు అప్‌లోడ్ చేసే సమయంలో మొత్తం సర్వే నంబర్‌ను పేర్కొనడం వల్ల ముఖ్యమంత్రి గారి నివాసంతో పాటు తన నివాసం కూడా పీఓబీలో చేర్చారని దానిని గుర్తించి వెంటనే సరిచేశామని తెలిపారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో సర్వే నంబర్ 172 ప్రభుత్వ భూమి, 173 ప్రైవేట్ భూమి అని, 173 పేరుతో అనుమతులు తీసుకుని 172 ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టిన ఉదాహరణను మంత్రి వివరించారు. 'ప్రైవేట్ సర్వే నంబర్ పేరుతో అనుమతులు తీసుకుని ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేస్తే.. ఆ ప్రభుత్వ భూమిని 22ఏలో పెట్టకూడదా? 173లో కాదు, 172 ప్రభుత్వ భూమిలో పెట్టాం. ప్రభుత్వ భూమిని కాపాడటం మా బాధ్యత అని వివరించారు.మేడ్చల్ జిల్లా పర్వతాపూర్ ప్రాంతంలో ప్రధాన రెవెన్యూ గ్రామం, దానికి అనుబంధ హ్యామ్లెట్‌కు ఒకే తరహా సర్వే నంబర్లు కేటాయించడం వల్ల భూ వివాదాలు తలెత్తాయని మంత్రి చెప్పారు.సర్వే నంబర్లను సక్రమంగా పునర్వ్యవస్థీకరించి, సమగ్ర సర్వే ద్వారా ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు.మహేశ్వరం మండలంలోని 22 ఎకరాల సర్వే నంబర్‌లో రెండు ఎకరాలను భూదాన్ భూమి ఉంటే మొత్తం 22 ఎకరాలకు పాస్‌బుక్ జారీ కావడం, భూదానం చేసిన 2 ఎకరాలను ప్రత్యేకంగా గుర్తించడంలో సమస్య ఏర్పడడంతో మొత్తం 22 ఎకరాలను పీఓబీలో పెట్టామని తెలిపారు.
భూదాన్, అసైన్డ్, ప్రభుత్వ భూముల విషయంలో రికార్డులను కేసుల వారీగా పరిశీలించి, వాస్తవ హక్కుదారులకు న్యాయం చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు నకిలీ జీఓలు, మెమోలు, అధికారుల సంతకాలతో బోగస్ పత్రాలు సృష్టిస్తున్న వ్యవహారాలను గుర్తించామని ఆమేరకు క్రిమినల్ కేసుల నమోదుకు ఆదేశాలిస్తున్నామన్నారు. మేడ్చల్ జిల్లాలో 22-04-2026 తేదీతో జిల్లా కలెక్టర్ సంతకం చేసినట్లు చూపిస్తూ ఒక నకిలీ మెమోను, మరోచోట 02-06-2026 తేదీతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పేరుతో బోగస్ సర్టిఫికెట్‌ను సృష్టించి రిజిస్ట్రేషన్ కోరిన వ్యవహారాలను గుర్తించామని చెప్పారు. సంబంధిత వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు. సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తాగునీటికే కృష్ణాజలాలు

>> పోతిరెడ్డిపాడు నుంచి ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే అత్యధిక నీటిని తరలించుకొని పోయిందని తెలంగాణ ప్రభుత్వం ఆరోపించింది.తాగునీటి కోసం చెరి సగం వాడుకోవాలని తెలంగాణ సమావేశంలో ప్రస్తావించింది. సాగర్, శ్రీశైలం నీటి వాటాలపై చర్చించామనితెలంగాణ ఇఎన్‌సి రమేష్ బాబు తెలిపితే, ఆంధ్రప్రదేశ్ ఇఎన్‌సి అలాంటి ప్రతిపాద ఏదీ ఎవరు చేయలేదని నీటివాటా అంశమే లేదని తెలిపారు. ఎల్‌నినో దృష్ట్యా తాగునీటికే వాడుకోవాలని త్రిసభ్య కమిటీ నిర్ణయం తీసుకుందని అన్నారు. తాగునీటికి 50:50 నిష్పత్తిలో వాడుకోవాలని చెప్పామని, పోతిరెడ్డిపాడు నుంచి ఎక్కువ నీరు వాడుకుంటున్నారని ఫిర్యాదు చేశామని తెలిపారు. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్ట్‌ల నీటి ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా త్రాగునీటి కోసం మాత్రమే నీటిని వాడుకోవాలని త్రిసభ్య కమిటీలో నిర్ణయించారు. తెలంగాణ ప్రభుత్వం 22 టిఎంసిలు ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వడానికిఒప్పుకొందని సెప్టెంబర్ నాలుగో తేదీన చర్చిస్తామనీ ఆంధ్రప్రదేశ్ ఇఎన్‌సి నరసింహామూర్తి మాట్లాడుతూ తెలిపారు. ఎల్ నినో పరిస్థితుల్లో ఉన్ననీటిని తాగునీటి కోసమే ఉపయోగించుకోవాలని నిర్ణయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ ప్రతినిధిగా హాజరైన ఇంజనీర్ ఇన్ చీఫ్ నరసింహ మూర్తి చెప్పారు. రెండు రాష్ట్రాల వాటా అంశం చర్చకు రాలేదని, సెప్టెంబర్ 4 జరిగే సమావేశంలో నిర్ణయంతీసుకొంటామని తెలిపారు. శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నీటి నిల్వలు, రెండు రాష్ట్రాల అవసరాలపై చర్చించినపుడు తెలంగాణ 60టిఎంసిల నీరు తమ తాగునీటి అవసరాల కోసం కేటాయించాలని కోరారు.భవిష్యత్‌లో ప్రవాహాలు వస్తే తదుపరి ఆలోచన చేయాలని ప్రస్తుతం ఉన్ననీటిని తాగునీటి కోసం 50:50 నిష్పత్తిలో వాడుకోవాలని తెలంగాణ ఇఎన్‌సి రమేష్‌బాబు సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ పోతిరెడ్డిపాటు నుంచి ఎక్కువ నీరు వాడుకొందని ఫిర్యాదు చేశామని వివరించారు. ఇప్పటికే పది టిఎంసి నీటిని ఆంధ్రప్రదేశ్ అధికంగా ఈ యేడు తరలించారని చెప్పారు. సెప్టెంబర్ 4వ తేదీన తాగునీటి అవసరాలపై మాత్రమే చర్చ జరుగుతోందని ఆయన తెలిపారు. కెఆర్ఎంబి త్రిసభ్య కమిటీ సమావేశం ఈ నెల 13న జరుపాల్సి ఉండగా,17కు వాయిదా వేశారు. ఆంధ్రప్రదేశ్‌లా అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో 17న జరుగాల్సిన సమావేశం కూడా ఆగస్టు 24కు వాయిదా పడింది. పలనాడు,రాయలసీమ తాగునీటి విడుదల కోసం ఆంధ్రప్రదేశ్ ఈ సమావేశం కోరడంతో శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నీటి నిల్వలు, రెండు రాష్ట్రాల అవసరాలపై చర్చించారు.

## కేంద్రంపై నెపం తగదు

### యుపిఎ హయాంలోను సిఎం పర్యటనలను ఆపారు: రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు24:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు సంబంధించి సరైన సమాచారం ఇవ్వకుండా, తిరస్కరణపై కేంద్ర ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. ఈమేరకు సోమవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. భారతదేశంలో దేశాన్ని, ప్రజలను ఇబ్బంది పెట్టే కొందరు వ్యక్తులను, సంస్థలను కలవడానికి వెళ్తున్నారనే సమాచారంతోనే ఈ నిర్ణయం జరిగిందని పేర్కొన్నారు.గతంలో రేవంత్ రెడ్డి రెండుసార్లు అమెరికా వెళ్లినప్పుడు, లండన్, సింగపూర్ వెళ్లినప్పుడు ఎవరూ ఆపలేదని, అప్పుడు ఆపనివారు ఈ ఒక్కసారే ఎందుకు ఆపారో గుర్తుంచుకోవాలని అన్నారు. 2010 నుంచి 2024 వరకు గతంలో యూపీఏ ప్రభుత్వ హయాంలో కూడా చంద్రబాబు నాయుడు, కేసీఆర్, మాయావతి, తరుణ్ గొగోయ్, అర్జున్ ముండా వంటి నేతల విదేశీ పర్యటనల ప్రతిపాదనల్లో పేపర్లు సరిగ్గా లేనప్పుడు, సరైన కారణాలు నింపనప్పుడు, ఎవరిని కలుస్తున్నారో స్పష్టత ఇవ్వనప్పుడు వారిని ఆపారని గుర్తు చేశారు. ఇది విదేశాంగ శాఖ నియమావళి ప్రకారమే జరుగుతుందని, దేశానికి వ్యతిరేకంగా ఎవరినైనా కలుస్తున్నారా అనే అనుమానం ఉన్నప్పుడు ప్రభుత్వం నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తుందని తెలిపారు. అందువల్ల ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వంపై నెపం వేయడం తీవ్రమైన పొరపాటు అని అన్నారు. గుజరాత్‌తో పోలుస్తూ మాట్లాడటంపై స్పందిస్తూ.. ప్రధాని నరేంద్ర మోదీకి గుజరాత్ అయినా, తెలంగాణ అయినా దేశంలోని ఏ రాష్ట్రమైనా సమానమేనని, సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్‌తోనే కేంద్రం ముందుకెళ్తోందని చెప్పారు. గుజరాత్‌లో పెట్రోల్ ధరలు సుమారు రూ.15 తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈరోజు తెలంగాణ అభివృద్ధి చెందిందంటే అది నరేంద్ర మోదీ కేంద్ర ప్రభుత్వం వల్లేనని స్పష్టం చేశారు.



# సౌదీఅరేబియా సమీపంలో ట్యాంకర్‌కు నిప్పు

## గుర్తుతెలియని క్షిపణి దాడి

**జెడ్డా, ఆగస్టు 24:** సౌదీ అరేబియాలోని ఎర్ర సముద్ర తీరానికి సమీపంలో సోమవారం ఓ చమురు ట్యాంకర్‌ను గుర్తుతెలియని క్షిపణి ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ట్యాంకర్‌లోని సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని బ్రిటన్‌కు చెందిన సముద్ర రవాణా సంస్థ యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ తెలిపింది. మంటల కారణంగా ఎలాంటి పర్యావరణ ముప్పు ఏర్పడినట్లు సమాచారం లేదని పేర్కొంది. సౌదీ అరేబియాలోని యన్బు నగరానికి 63 నాటికల్ మైళ్ల పశ్చిమాన ఈ ఘటన జరిగినట్లు యుకెఎంటివో వెల్లడించింది. యెమెన్‌కు వందల కిలోమీటర్ల దూరంలో ఉత్తరంగా యెన్బు ఉంది. ఇరాన్ మద్దతుతో పనిచేస్తున్న హౌతీల నుంచి ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలకు భద్రతా ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో తాజా ఘటన చోటుచేసుకుంది. ఈ నెల ప్రారంభంలోనూ సౌదీ సంబంధాలున్న ఓ ట్యాంకర్‌పై దాడి చేసినట్లు హౌతీ గ్రూప్ ప్రకటించింది. ఎర్ర సముద్రంలో జరిగిన ఆ దాడిలో కనీసం ఆరుగురు మరణించగా, మరో 10 మంది గాయపడినట్లు సమాచారం. తొలిదాడిలో ముగ్గురు పాకిస్థానీలు, ఒక ఇండోనేషియా వ్యక్తి సహా నలుగురు సిబ్బంది మృతి చెందారు. అనంతరం నౌకలోని వారిని తరలించేందుకు వచ్చిన సహాయక బృందాన్ని లక్ష్యంగా చేసుకుని రెండో క్షిపణి దాడి జరిగిందని యెమెన్ కోస్ట్ గార్డ్ తెలిపింది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్‌లు ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన తర్వాత ఓ నౌకపై హౌతీలు జరిపిన తొలి ప్రాణాంతక దాడి ఇదే. జూలై 29న కూడా హౌతీలు ఓ సౌదీ చమురు ట్యాంకర్‌పై దాడి చేశారు. అంతకుముందు జూలైలో ఎర్ర సముద్రం మీదుగా సౌదీ అరేబియా నుంచి, సౌదీ అరేబియాకు వెళ్లే నౌకా రవాణాను దిగ్బంధిస్తామని హౌతీలు ప్రకటించారు. మరోవైపు, మార్చి నుంచి ఇరాన్ హోర్ముజ్ జలసంధిని ఇరాన్‌దిగ్బంధించడంతో సౌదీ అరేబియా తన చమురు ఎగుమతుల కోసం ఎర్ర సముద్రంలోని నౌకాశ్రయాలపై మరింతగా ఆధారపడాల్సి వస్తోంది. యెమెన్‌లోని ఎర్ర సముద్ర తీరప్రాంతంలో, ముఖ్యంగా బాబ్ అల్ మందబ్ జలసంధి సమీపంలోని ప్రాంతాల్లో హౌతీలకు నియంత్రణ ఉంది. ఎర్ర సముద్రాన్ని హిందూ మహాసముద్రంతో అనుసంధానించే ఈ మార్గం ప్రపంచంలోని అత్యంత రద్దీగా ఉండే సముద్ర రవాణా మార్గాల్లో ఒకటి. ఇక్కడ నౌకా రవాణాకు దీర్ఘకాలిక అంతరాయం ఏర్పడితే ఆసియా మార్కెట్లకు వెళ్లే సరకు రవాణాపై ప్రభావం పడటంతో పాటు, నౌకలు మరింత సుదీర్ఘమైన ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.



లలిత (ఫైల్) చంద్రకళ (ఫైల్) నాగరాజు (ఫైల్)


# అకస్మాత్తుగా అంగన్‌వాడీ టీచర్ మృతి

## అంత్యక్రియలకు వస్తూ ప్రమాదంలో కోడలు, అల్లుడు దుర్మరణం

**లింగాల, ఆగస్టు 24, ప్రభాతవార్త :** విధులు నిర్వర్తించడానికి వస్తూ కూర్చున్న చోటనే కుప్పకూలి మృతి చెందిన అంగన్‌వాడీ టీచర్ లలిత (40) అంత్యక్రియల్లో పాల్గొనడానికి వస్తూ మార్గమధ్యంలోనే రోడ్డు ప్రమాదంలో మృతురాలి అల్లుడు నాగరాజు(35), కోడలు చంద్రకళ (32) మృతి చెందగా కొడుకు శ్రీకాంత్ పరిస్థితి విషమంగా ఉన్నది. మండల పరిధిలోని రాయవరం గ్రామానికి చెందిన లలిత అంగన్‌వాడీ టీచర్‌గా అదే గ్రామంలో విధులు నిర్వర్తిస్తున్నారు. అచ్చంపేటలో ఉంటున్న ఆమె సోమవారం ఉదయం విధులకు హాజర య్యేందుకు రాయవరం రావడానికి బస్టాండ్‌కు చేరుకున్నారు. అయితే అక్కడ కొద్దిసేపటి తర్వాత ఆమెకు కళ్లు తిరగడంతో పక్కనే కూర్చున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కూర్చున్నచోటే ఆమె మృతి చెందినట్లు పేర్కొన్నారు. లలిత మృతి చెందిన విషయం కుటుంబసభ్యులకు తెలియడంతో హైదరాబాద్‌లో ఉంటున్న ఆమె కుమారుడు శ్రీకాంత్, కోడలు చంద్రకళ (32), అల్లుడు నాగరాజు (35) అచ్చంపేటకు బయలుదేరారు. ముగ్గురూ ఒకే బైక్‌పై అచ్చంపేటవైపు వస్తుండగా నల్గొండ జిల్లా డిండి సమీపంలో ప్రమాదం చోటుచేసుకుంది. అచ్చంపేట నుంచి వెళ్తున్న కారు బైక్‌ను బలంగా ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో చంద్రకళ, నాగరాజు మృతి చెందగా శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. లలిత మృతి పట్ల తోటి అంగన్వాడీ టీచర్లు తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేసి, ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# కేన్సర్ కణాల్లోనే పనిచేసే స్మార్ట్ డ్రగ్

## కిమోథెరపీకి ప్రత్యామ్నాయంగా కొత్త ఆశలు




**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** కేన్సర్ కణాల్లోకి ప్రవేశించిన తర్వాత మాత్రమే యాక్టివేట్ అయి, ఆరోగ్యకరమైన కణాలకు హాని కలిగించకుండా పనిచేసే కొత్త స్మార్ట్ కేన్సర్ ఔషధాన్ని భారత శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. సంప్రదాయ కీమోథెరపీలో కేన్సర్ కణాలతోపాటు ఆరోగ్యకరమైన కణాలు కూడా దెబ్బతినడం వల్ల అనేక దుష్ప్రభావాలు ఎదురవుతాయి.

ఈ నేపథ్యంలో సాధా రణ కణజాలాల్లో నిష్క్రియంగా ఉండి, కేవలం కణితి ప్రాంతంలోనే క్రియాశీలమయ్యే చికిత్సల అభివృద్ధికి ఈ పరిశోధన కీలక ముందడుగుగా భావిస్తున్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ ఆధ్వర్యంలోని స్వయం ప్రతిపత్తి సంస్థకు చెందిన డాక్టర్ అసిస్ బాలా, ఐఐటీ గువాహటి పరిశోధకుడు డాక్టర్ కె.పి భబక్ నేతృత్వంలోని సంయుక్త బృందం ఆర్‌కె-251 అనే కొత్త స్మార్ట్ కేన్సర్ డ్రగ్‌ను అభివృద్ధి చేసింది. కేన్సర్ కణాల్లోనే యాక్టివేట్ అయి కేన్సర్ కణాల్లో.. సాధారణ కణాలతో పోలిస్తే రియాక్టివ్ ఆక్సీజెన్ స్పెసీస్ ఆర్వోఎస్ అనే హానికర అణువులు అధిక స్థాయిలో ఉంటాయి.

ఆర్‌కె-251 కేన్సర్ కణంలోకి చేరినప్పుడు అక్కడి అధిక ఆర్వోఎస్ స్థాయి ఔషధాన్ని యాక్టివేట్ చేస్తాయి. దీంతో ఎన్బీడిహెచ్ఇఎక్స్ అనే శక్తివంతమైన యాంటీకేన్సర్ సమ్మేళనం విడుదలవుతుంది. ఈ సమ్మేళనం కేన్సర్ కణాలు జీవించడానికి, చికిత్సను తట్టు కోవడానికి ఉపయోగించుకునే కీలక టార్గెట్ ప్రోటీన్లను అడ్డుకుంటుంది. తద్వారా కేన్సర్ కణాలపై ప్రభావం చూపేలా ఈ ఔషధాన్ని రూపొం దించారు. ప్రాథమిక దశ ప్రయోగాల్లో ఆర్‌కె-251 దూకుడైన ట్రిపుల్ నెగెటివ్ బ్రెస్ట్ కేన్సర్ కణాలపై గణనీయమైన ప్రభావాన్ని చూపించింది.

అదే సమయంలో ఆరోగ్యకరమైన కణాలపై దీని ప్రభావం చాలా తక్కువగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. జీబ్రాఫిష్ పిండాలపై నిర్వహించిన ప్రవర్తనా అధ్యయనంలోనూ ఔషధం వల్ల స్పష్టమైన విషపూరిత లక్షణాలు కనిపించలేదు. అలాగే ఆర్వోఎస్ సమక్షంలో అవసరమైన ఫ్లోరోసెన్స్‌ను ప్రదర్శించింది. ఈ ఫలితాలు ఆర్‌కె-251 మరింత పరిశోధన, భద్రతా ధ్రువీకరణకు అనుకూలంగా ఉండవచ్చనే సూచనలు ఇస్తున్నాయి.

ఈ ఔషధాన్ని మనుషులపై పరీక్షించే దశకు చేరుకోవడానికి ముందు మరిన్ని ప్రయోగాలు, భద్రతా పరీక్షలు అవసరం. ఈ పరిశోధన ఎసిఎస్ జర్నల్ ఆఫ్ మెడికల్ కెమిస్ట్రీలో ప్రచురితమైంది.

# సంగంబండ రైట్ హైకెనాల్ కాల్వకు గండి

## చివరి ఆయకట్టుకు అందని సాగునీరు

## సాగునీటి కోసం రైతుల ఎదురుచూపు

## పట్టించుకోని సంబంధిత అధికారులు

**మాగనూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త :** సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ రైట్ హై లెవెల్ కాల్వకు సోమవారం తెల్లవారుజామున నేరడగం శివారులో గండి పడింది. నీటి ప్రవాహానికి వర్కూర్ శివారులో ఉన్న దాదాపు 30 ఎకరాల పొలంలోకి నీరు చేరి పంటలకు నష్టం కలిగించిందని రైతులు వాపోతున్నారు. కాలువలు అస్తవ్యస్తంగా మారడంతో నీటి ప్రవాహం ముందుకు పోకుండా మధ్యలో ఇలా గండ్లు పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. రైతులు మాట్లాడుతూ రిజర్వాయర్ రైట్ హై లెవెల్ కెనాల్ కాల్వకు గత కొన్ని సంవత్సరాలుగా మరమ్మత్తులు చేయడం లేదని, నామమాత్రంగా పెరిగిన తుంగను అక్కడక్కడ తీసి వదిలేస్తున్నారని అన్నారు. పూర్తిస్థాయిలో కాలువ పూడిక తీయకపోవడంతో పంటలకు సరిపడా సాగు నీరు అధికారులు విడుదల చేసినప్పుడు కాల్వలలో చెత్త చెదారం అడ్డు పడడంతో కాల్వ కోతకు గురై గండ్లు పడుతున్నాయని రైతులు అస హనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాలపై పలుమార్లు సంబంధిత అధికా రుల దృష్టికి తీసుకెళ్లిన ఏ ఒక్కరు పట్టించు కోవడంలేదని కాలువల వెంబడి బండి తోవలు కూడా చేసుకున్న సంఘటనలు ఉన్నాయని ఈ విషయాలపై ఏ ఒక్క అధికారి పట్టించుకోవడంలేదని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా గండిలను సరిచేసి సాగునీరు వృథాగా పారకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కాలువలు పూడికలు తీసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని రైతన్నలు ఆకాంక్షిస్తున్నారు.



కాల్వకు గండి పడడంతో పొలాల్లోకి భారీగా నీరు చేరిన దృశ్యం

# 100 టన్నుల చికెన్ వ్యర్థాలు సీజ్

## ఎపికి తరలిస్తుండగా పట్టుకున్న అధికారులు

**హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా వ్యవహారం మరోసారి తీవ్ర కలకలం రేపింది. నగరంలో ఉన్న కోళ్ల దుకాణాలు, చికెన్ సెంటర్లు, ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి భారీ మొత్తంలో చికెన్ వ్యర్థాలను సేకరించి ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్న చేపల చెరువులకు తరలిస్తున్న ముఠాపై సైబరాబాద్ పోలీసులు, పశువైద్య శాఖ అధికారులు జాయింట్ ఆపరేషన్ చేపట్టి దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో దాదాపు 100 టన్నుల చికెన్ వ్యర్థాలను అధికారులు పట్టుకుని, స్వాధీనం చేసుకున్నారు. అధికారులు, పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కోళ్ల దుకాణాలు, మాంసం ప్రాసెసింగ్ కేంద్రాల నుంచి వెలువడే చికెన్ వ్యర్థాలను కొందరు వ్యక్తులు సేకరిస్తున్నారు. ఆతర్వాత వాటిని లారీల్లో నింపి.. ఆంధ్రప్రదేశ్‌కు తరలించి.. అక్కడ చేపల చెరువుల యజమానులకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. చేపలకు మేతగా ఉపయోగించేందుకు ఈ చికెన్ వ్యర్థాలను తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ చికెన్ వ్యర్థాల అక్రమ రవాణాకు సంబంధించి.. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన సైబరాబాద్ పోలీసులు, వెటర్నరీ అధికారులు నగరంలోని అత్తాపూర్, మియాపూర్, అమీన్‌పూర్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, చింతల్ వంటి ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా లారీల్లో తరలిస్తున్న చికెన్ వ్యర్థాలను గుర్తించి సీజ్ చేసుకున్నారు.

భారీ మొత్తంలో వ్యర్థాలు పట్టుబడటంతో ఈ అక్రమ రవాణా వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ చికెన్ వ్యర్థాలను ప్రధానంగా రాత్రి వేళల్లో ఏపీకి తరలించి.. అక్కడి చేపల చెరువు యజమానులకు అమ్ముతున్నట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. గతంలోనూ ఇలాంటి వ్యవహారంపై కేసులు నమోదైనప్పటికీ.. ఇంకా ఈ చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా కొనసాగుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. గత నెలలోనూ సుమారు 100 టన్నుల చికెన్ వ్యర్థాలను అధికారులు స్వాధీనం చేసుకోగా.. తాజాగా మరోసారి అంతే ఎత్తున సీజ్ చేయడం గమనార్హం. చికెన్ వ్యర్థాలను చేపలకు మేతగా ఉపయోగించడం వల్ల ఆహార భద్రత, ప్రజారోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు తీవ్ర హెచ్చరికలు చేశారు. అపరిశుభ్రమైన వ్యర్థాలను తిని పెరిగిన చేపలను.. ప్రజలు ఆహారంగా తీసుకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు తెలిపారు.

ఈ వ్యవహారంలో బాధ్యులైన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. చికెన్ వ్యర్థాలను అక్రమంగా సేకరించి, రవాణా చేసి, చేపల చెరువులకు విక్రయిస్తున్న నెట్‌వర్క్‌పై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# జీవితాన్ని రైతుల సంక్షేమానికి అంకితం చేసిన నాయకుడు

## సారంపల్లి మల్లారెడ్డి మరణంపై సిఎం సంతాపం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు24:** రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాడిన రైతు నాయకుడు, కమ్యూనిస్టు నేత సారంపల్లి మల్లారెడ్డి మరణించారని తెలిసి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రైతుల హక్కులు, వ్యవసాయ సమస్యల పరిష్కారం కోసం ముందుండి అనేక ఉద్యమాలు నడిపించారని గుర్తుచేశారు. రైతు సంఘం నేతగా, అఖిల భారత కిసాన్‌సభ ఉపాధ్యక్షుడిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొ న్నారు. భూమి హక్కులు, సాగునీరు, వ్యవసాయ రుణాలు, విత్తనాలు వంటి వ్యవసాయ రంగానికి సంబంధించిన విస్తృత అంశాలపై నిరంతరం కృషి చేస్తూ జీవితాన్ని రైతుల సంక్షేమం కోసం అంకితం చేసిన నాయకుడు మల్లారెడ్డి గారని పేర్కొన్నారు. సారంపల్లి మల్లారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మల్లారెడ్డి కుటుంబ సభ్యులు, అభిమా నులకు ముఖ్యమంత్రి సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు.

**రైతాంగ సమస్యలపై రాజీలేని పోరు చేసిన మల్లారెడ్డి: పిసిసి చీఫ్**

**హైదరాబాద్, ఆగస్టు 24,ప్రభాతవార్త:** తెలంగాణ రైతు సంఘం రాష్ట్రఉపాధ్యక్షుడు జాతీయ కిసాన్‌సభ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి వ్యవసాయం సాగునీటి రంగాలపై అపార అనుభవం కలిగి ఉండటమే కాకుండా రైతాంగం రైతుకూలి సమస్యల సాధనకు రాజీలేని పోరాటం చేసిన వ్యక్తి అని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. సారంపల్లి మల్లారెడ్డి మృతి తెలుగురాష్ట్ర రైతాంగంకు తీరని లోటని అన్నారు. ఆయన దేశవ్యాప్తంగా రైతు గొంతుగా వ్యవహరించారని గుర్తుచేసుకొన్నారు. రైతాంగ సమస్యలపై పోరాడిన మల్లారెడ్డి ఆత్మశాంతి చేకూరాలని సంతాప సందేశంలో పేర్కొన్నారు. తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్ రెడ్డి సుంకేట మల్లారెడ్డి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ కార్పోరేటు, సామ్రాజ్యవాదులు రైతాంగానికి చేస్తున్న దోపిడీకి వ్యతిరేకంగా ఐక్య పోరాట నిర్మిం చడమే మల్లారెడ్డికి నిజమైన నివాళులని అన్నారు.

# సారంపల్లి మల్లారెడ్డి కన్నుమూత

## రైతు నాయకుడు, సిపిఎం సీనియర్ నేత

### రైతాంగ హక్కుల కోసం నిర్విరామ పోరాటం జరిపిన నేత

### ఘనంగా నివాళులర్పించిన బివి రాఘవులు, ఇతర ప్రముఖులు



సారంపల్లి మల్లారెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పించిన సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఆగస్టు 24, ప్రభాతవార్త:** అఖిల భారత కిసాన్ సభా ఉపాధ్యక్షుడు, సిపిఎం సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి (90) సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. వయోభారంతోపాటు శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన, గత నాలుగు రోజులుగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆరోగ్యం మరింత క్షీ ణించడంతో వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. సోమవారం తెల్లవారుజామున 3.30 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచినట్లు నిమ్స్ వైద్యులు ధ్రువీకరించారు. జీవితాంతం వ్యవసాయరంగ పరిరక్షణ, రైతాంగ హక్కుల కోసం పోరాడారు. అఖిల భారత కిసాన్ సభా ఉపాధ్యక్షుడిగా దేశవ్యాప్తంగా రైతు ఉద్యమాలను ఏకీకృతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. సిపిఎం పార్టీలో సుదీర్ఘకాలం పనిచేస్తూ, సామాజిక, రాజకీయ పోరాటాల్లో నిత్యం ముందుభాగాన నిలిచారు. కార్మిక, గిరిజన సమస్యలు, రైతుల సమస్యలతోపాటు కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం ఎన్నో ఆందోళన కార్యక్రమాలకు నాయకత్వం వహించారు.

మల్లారెడ్డి మృతి వార్త తెలిసిన వెంటనే సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు, ఆ పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకులు, వివిధ రాజకీయ పక్షాల నేతలు, రైతు సంఘాల ప్రతినిధులు తీవ్రసంతాపం వ్యక్తం చేశారు. ఆయన భౌతికకాయానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. మల్లారెడ్డి మరణం రైతు లోకానికి, నిరుపేద వర్గాల పోరాటాలకు తీరని లోటని నాయకులు కొనియాడారు. ప్రముఖ రైతు నేత, సిపిఎం సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపం ప్రకటించింది. ఆయన మరణం వామపక్ష, రైతు ఉద్యమాలకు తీరని లోటని పార్టీ నేతలు పేర్కొన్నారు. కష్టజీవుల హక్కులు, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం జీవితాంతం పోరాడిన మల్లారెడ్డి సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శివర్గ సభ్యుడిగా, అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ పునర్నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు. నర్సంపేట ప్రాంతంలో భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పేదలు, దళితుల భూముల పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలు నడిపారు. తిమ్మంపేట సర్పంచ్‌గా, సింగిల్ విండో అధ్యక్షుడిగా గ్రామ అభివృద్ధికి విశేష సేవలు అందించారు. ప్రజాపోరాటాలతో పాటు 'సాగునీరు, రైతాంగ అంశాలపై రైతుఉద్యమ చరిత్ర, తెలంగాణలో సాగునీటి వనరులు, భారత రైతాంగ పోరాటాలు' సహా 20కిపైగా విలువైన పుస్తకాలను ఆయన రచించారు.

**రేపు గాంధీ మెడికల్ కాలేజీకి భౌతికకాయం అప్పగింత**

సారంపల్లి మల్లారెడ్డి భౌతికకాయాన్ని మంగళవారం ఉదయం 8 గంటల నుండి హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎం.బి.భవన్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. అనంతరం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి వరకు అంతిమయాత్ర నిర్వహించి, వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం భౌతికకాయాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించనున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ, ప్రజాసంఘాల శ్రేణులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

**తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో సారంపల్లి మల్లారెడ్డి సంతాప సభ**

తెలంగాణ రైతాంగ పోరాటాల్లో చెరగని ముద్ర వేసిన సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగ ఉద్యమాలకు తీరనిలోటని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి తీగల సాగర్ ఆవేదన వ్యక్తం చేశారు.

సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో సారం పల్లి మల్లారెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ మల్లారెడ్డి తన జీవితాంతం పేదలు, రైతులు, కూలీలు, అణగారినవర్గాల హక్కుల కోసమే అంకితం చేశారని కొనియాడారు. రైతు సంఘంలో తాలూకా స్థాయి నుంచి అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడి వరకు వివిధ బాధ్యతల్లో నిరంతరం రైతాంగ సమస్యలపై పోరాడారని గుర్తు చేశారు. ఈ సంతాప సభలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జంగారెడ్డి, కోశాధికారి మూడ్ శోభన్, సహాయ కార్యదర్శి వెంకట్ మావో, బి.ప్రసాద్, బొప్పని పద్మ, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్, ఐతే విజయ్, ఆంజనేయులు, శివ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగం రాలేదని డిప్రెషన్‌లోకి..

## అమెరికాలో హైదరాబాద్ యువకుడి ఆత్మహత్య



**హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త :** అమెరికా (యుఎస్‌ఏ)లో ఉన్నత విద్య పూర్తిచేసి మంచి భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న హైదరా బాదీ యువకుడు సాయిప్రదీప్ జీవితం విషాదాంతమైంది. ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నాలు ఫలించక తీవ్ర మనస్తాపానికి గురై అతడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌లోని దమ్మాయిగూడ శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన సాయిప్రదీప్ 2024లో ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లాడు. టెక్సాస్ రాష్ట్రంలోని శాన్ ఆంటోనియోలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాడు. చదువు పూర్తయిన తర్వాత అక్కడే ఉద్యోగం సాధించి స్థిరపడాలని భావించాడు. అయితే గత నాలుగు నెలలుగా ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నా ఆశించిన ఫలితం దక్కలేదు. వరుసగా అవకాశాలు చేజారడంతో తీవ్ర ఒత్తిడికి లోనైన సాయిప్రదీప్ మానసికంగా కుంగిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ఈనెల 21న శాన్‌ఆంటోనియోలోని తన గదిలో సాయిప్రదీప్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనతో.. విదేశాలకు వెళ్లి ఉన్నత చదువులు పూర్తి చేసిన తర్వాత ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న పలువురు విద్యార్థులు ఎదుర్కొంటున్న ఒత్తిడి మరోసారి చర్చనీయాంశమైంది. చదువు, ఉద్యోగం, ఆర్థిక పరిస్థితులు వంటి అంశాలు యువతపై తీవ్రమానసిక ప్రభావం చూపుతున్న నేపథ్యంలో కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారం ఎంతో అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.



ముత్యాల మహేందర్‌రెడ్డి, పసుపులేటి కార్తిక్‌కుమార్, బత్తిని అరుణ్‌కుమార్‌రెడ్డి

# మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ ముగ్గురు అనుచరులు అరెస్ట్

## కోర్టులో హాజరుపర్చిన పోలీసులు..14 రోజుల రిమాండ్

## సుమంత్‌తోపాటు మిగిలిన వారి కోసం కొనసాగుతున్న గాలింపు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఆగస్టు 24, ప్రభాతవార్త:** రియల్ ఎస్టేట్ వ్యాపారి గొంగిడి హరికృష్ణపై హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. చెంగిచర్లకు చెందిన గొంగిడి హరికృష్ణను గత నెల 30న జూబ్లీహిల్స్‌లోని కార్యాలయంలో మంత్రి కొండాసురేఖ మాజీ ఓఎస్డీ నార్ల సుమంత్‌తోపాటు ప్రశాంత్, అరుణ్‌కుమార్‌రెడ్డి, కార్తిక్, మహేందర్‌రెడ్డి, రాము తదితరులు ఇనుపరాడ్లతో హత్యా యత్నానికి పాల్పడగా ఈ నెల 20న హరికృష్ణ మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి జూబ్లీహిల్స్ ఠాణాకు బదలీ చేశారు. ఈ కేసులో నిందితులను పట్టుకొనేందుకు అదనపు డిసిపి శ్రీకాంత్, ఎసిపి సామల వెంటకరెడ్డి ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. దీనికి తోడు టాస్క్ ఫోర్స్ బృందాలు సైతం రంగంలోకి దిగాయి. ఈ క్రమంలోనే పోలీసులు తొలుతగా సుమంత్ డ్రైవర్ నవీన్‌ను అదుపులోకి తీసుకొన్నారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్న క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా మార్టూర్ వద్ద ముత్యాల మహేందర్‌రెడ్డి, పసుపులేటి కార్తిక్‌కుమార్, బత్తిని అరుణ్‌కుమార్‌రెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకొని నగరానికి తరలించారు. వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం వారికి 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ముగ్గురిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. మరోవైపు పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు సుమంత్‌తో పాటు రాము, ప్రశాంత్ తదితరుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వారిని కూడా వీలైనంత త్వరగా అరెస్ట్ చేస్తామని పోలీసు అధికారి స్పష్టం చేశారు.

**NMDC Limited**
(A Government of India Enterprise)
Khanij Bhavan, 10-3-311/A, Castle Hills, Masab Tank, Hyderabad – 500 028.
Corporate Identity Number (CIN) : L13100TG1958GOI001674

**CONVENING OF 68th ANNUAL GENERAL MEETING THROUGH VC/OAVM**

NOTICE is hereby given that the 68th (Sixty Eighth) Annual General Meeting (AGM) of the members of NMDC Limited will be held on **Monday, 28th September 2026 at 11.30 A.M.** (IST) through Video Conferencing ("VC")/Other Audio Visual Means ("OAVM") without physical presence of members at a common venue, in compliance with applicable provisions of the Companies Act, 2013, Rules made thereunder and SEBI (Listing Obligations & Disclosure Requirements) Regulations, 2015 read with all applicable circulars issued by Ministry of Corporate Affairs (MCA) and SEBI, from time to time, to transact the businesses set out in the Notice of the said AGM.

Members may note that in compliance with the aforementioned circulars, the Notice of 68th AGM and Annual Report for the financial year 2025-26 will be sent **only** by email to all the members of the Company whose email addresses are registered with the Company's Registrar and Transfer Agent ("RTA")/ Depository Participant(s). Further, the said documents will also be made available on the Company's website i.e., **www.nmdc.co.in** and website of the Stock Exchanges i.e. **www.nseindia.com** and **www.bseindia.com.**

The detailed instructions for attending the AGM, remote e-voting for shareholders holding shares in dematerialized mode, physical mode and for those whose email IDs are not registered, will be provided in the Notice of AGM in due course. Shareholders will have an opportunity to join and participate in the 68th AGM through VC/OAVM facility only and cast their vote on the items of business as set forth in the Notice of AGM through remote e-voting prior to AGM and through electronic voting system during the AGM.

Members holding shares in physical mode and who have not registered/updated their e-mail IDs/mobile number/bank details for receiving dividends, are requested to update the same by sending an email at **info@aarthiconsultants.com** with a signed letter mentioning folio no., name of shareholder(s), address, mobile no., bank details, scanned copy of share certificate (front and back), self-attested copy of PAN and address proof etc. Further, Members who are holding shares in demat mode and have not registered/updated their e-Mail ID/mobile numbers/bank details are requested to update the same with their respective Depository Participant.

Notice is also given pursuant to Regulation 42 of SEBI (LODR) Regulations, 2015 that the Company has fixed **Monday, 5th October 2026** as the 'Record Date' for determining entitlement of shareholders to receive final dividend for the financial year 2025-26 @ ₹1/- per equity share, if so approved, at the aforesaid AGM.

**For NMDC Limited**
**Sd/-**
**Aniket Kulshreshtha**
**Company Secretary**

Place: Hyderabad
Date : 24.08.2026

వార్త

యువతను మోసగించడం తేలిక. ఎందుకంటే వారు తొందరగా ఆశలు పెంచుకొని భ్రమల్లో పడిపోతారు.
- అరిస్టాటిల్

# వంటబట్టని 'పట్ట' భద్రత


'చదివిన చదువు ఒకటైతే చేసే ఉద్యోగం వేరు' అనుకుంటూ చాలా కాలంగా నిరుద్యోగులు సద్యోగులుగా మారి కాలం గడిపేసారు. సద్యోగమంటే మంచి ఉద్యోగం. ఏమాత్రం ఉపాధి లభించినా ఎలాగోలా బతికేస్తారులే అని సరిపెట్టుకునే రోజులు పోయాయి. సాధారణ డిగ్రీలుగా పేరుపడిన బిఎ, బికాం, బిఎస్సీ కోర్సులు ప్రస్తుత పరిస్థితుల్లో కాలం చెల్లినవిగానే చెప్పుకోవాలి. అంతకన్నా మంచి విజ్ఞానం లభించే కోర్సులకు ప్రత్యేక రూపకల్పనంటూ ఏమీ లేదు. ఆర్ట్స్, సైన్స్ అని విడి విడిగా ఉండే ఆయా సబ్జెక్టులను అటు చేసి ఇటు చేసి కాంబినేషన్‌లు మార్చి కొత్త కోర్సుల రూపకల్పన జరుగుతోందే తప్ప మరో ప్రయత్నం కానరాదు. పనికి రావని ఉద్యోగ ప్రవేశాల సమయంలోనే తెలియవస్తోంది. ఆ తర్వాత మళ్లీ అనుబంధ కోర్సులు తప్పనిసరి. వాటిపై అవగాహన పెంచుకుంటేనే ఏదో ఓ ఉపాధి దొరుకుతుంది. లేదంటే అంతే. బతుకు బస్టాండ్‌లో వెళ్లదీయాల్సిందే. పూర్వం అయితే 'సత్ర భోజనం మఠం నిద్ర' అనే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడాపరిస్థితి లేదు.కఠోర శ్రమ ద్వారా విద్యావంతులై ఆపై ఉన్నత ఉద్యోగాల్లోకి వెళ్లిన వారు లేకపోలేదు. అలాంటి వారు బహుతక్కువ. అందుకనే విద్యావిధానంలో కోర్సుల్లోనూ మార్పులు రావాల్సిన అవసరం ఉందంటుంటాం. కానీ అసలు సిసలు లోపమెక్కడుందో కనిపెట్టడానికి వేగిరం పూనుకోలేం. సంస్కరణలు చేపట్టలేం. అదే జరిగితే ఉన్నత విద్యావంతులంతా ఉత్తమ ఉద్యోగ పీఠాలు ఎక్కేవారే. దానాదీనా ఇటీవల 'నీతి అయోగ్' వెల్లడి చేసిన రిపోర్టులో 'సాధారణ డిగ్రీలకు ఉపాధి దొరక్క ఉద్యోమూ దక్కదంటూ చేసిన వ్యాఖ్యానాలను బట్టి భారతీయ విద్యావిధానం డొల్లతనం అర్థమవుతోంది. భారతదేశంలో 15 నుంచి 29 ఏళ్ల మధ్య యువత 8.7 కోట్ల మంది నిరుద్యోగులుగా ఉన్నా వారి ఆర్థిక పరిస్థితుల కారణంగా వారు ఏమీ పనిచేయకుండా ఖాళీగానే ఉన్నారని నీతి అయోగ్ స్పష్టం చేసింది. వికసిత్ భారత్ కోసం 'నైపుణ్యాభివృద్ధి పునఃకల్పన 2047' పేరిట నీతి ఆయోగ్ విడుదల చేసిన పుస్తకంలో ఎన్నో ఆసక్తికర అంశాలున్నాయి. 2021లో తన 78వ జాతీయ శాంపిల్ సర్వే ఆధారంగా ఈ నివేదిక రూపుదిద్దుకుంది. దేశంలో 8.5శాతం మంది పట్టభద్రులకే వారి అర్హతకు తగిన ఉపాధి దొరుకుతోంది. మిగిలిన వారికి తగిన ప్రాక్టికల్ నైపుణ్యత లేకపోవడంతో ఉపాధి మృగ్యమౌతోంది. 2014-15 నుంచి ప్రస్తుతం వరకు 7.67 కోట్ల మందికే సరైన శిక్షణ లభించినట్లు తేటతెల్లం చేసింది. చాలా మంది తమకు ఆర్థిక స్తోమతలేక సంప్రదాయ 'డిగ్రీ' కోర్సులు చదివాకతక్కువ వేతనాలకు చిన్నాచితకా ఉద్యోగంలో చేరి కుటుంబాన్ని పోషించుకుంటూ లేక చదువుల లక్ష్యాన్ని మరచిపోతున్నారు. అదీ గత్యంతరం లేక. ఇది నిజమేకావచ్చు. కానీ ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయా?లేవా? అన్నది ప్రశ్న. యువత చదివిన చదువుల్లో పసలేదని వారి అత్తెసరు చదువులకు వాళ్లే బాధ్యులని చెప్పడమే అసలు బాగోలేదు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకున్న వారెవరూ వారి చదువులను పక్కన బెట్టడంలేదు. భవిష్యత్తుకోసం ఆరాటపడుతూనే ఉన్నారు. కానీ వాళ్ల చదువులే వాళ్లకు శాపంగా ఉన్నాయనే ధోరణిలో నివేదికల విశ్లేషణలు సమంజసం కాదు. ప్రధానంగా విద్య నేర్చుకున్న వారందరికీ ఉపాధి లభించకపోవడానికి కారణాన్ని ఆ నివేదికలో విశ్లేషిస్తూ కళాశాలల్లో బోధించే సిలబస్‌కు,పరిశ్రమల వాస్తవ అవసరాలకు మధ్య ఏమాత్రం పొంతన ఉండటం లేదన్నది నీతి ఆయోగ్ ఉవాచ.చాలా విద్యాసంస్థల్లో పాఠ్యప్రణాళికలు కాలం చెల్లినవిగా ఉండి నేటి పారిశ్రామికావసరాలకు తగినట్టుగా లేవన్నదినివేదిక సారాంశం. ఇదంతా ఇలా ఉంటే ఉద్యోగవకాశాలు పరిమితంగా ఉన్నందున కూడా నిరుద్యోగుల్లో పోటీ వలన సంక్షోభానికి కారణమని నీతి ఆయోగ్ చెబుతోంది. వారి నివేదికలో ఒక ఉదాహరణను జోడిస్తూ ఇటీవల కేవలం 55 వేల ప్రభుత్వ పోస్టుల కోసం ఏకంగా 1.86 కోట్ల దరఖాస్తులు రావడం నిరుద్యోగ సమస్య తీవ్రతను తెలియచేస్తోంది. ఇలా వృత్తి ఉద్యోగాలేమీ లేకుండా ఖాళీగా ఉన్నవారిని 'నీట్' కేటగిరిగా విభజించింది. ఈకేటగిరీలో ఉన్న 88 శాతం మంది గృహసంబంధిత 'ఇంటిపనుల్లో' నిమగ్నమై ఉన్నారని పేర్కొంది. అంటే వారెవరికీ మంచి ఉద్యోగాల శిక్షణ ఏమీలేనందున ఖాళీగా ఉన్నారని చెబుతూనే వాళ్లకు శిక్షణనిచ్చే అవకాశాలను ప్రధానంగా చర్చించింది. దేశంలోని వర్క్‌ఫోర్స్‌ను పాఠశాల విద్యార్థులో, ఉన్నత విద్య, ఫార్మల్, ఇన్‌ఫార్మల్ వర్కర్లు, 'నీట్' యువత మహిళలు అనే ఐదు విభాగాలుగా విభజించి నైపుణ్య శిక్షణ ఇవ్వాల్సిన ఆవశ్యకతను తెలియచేస్తోంది. ప్రభుత్వమే వారికి ఆర్థిక సహాయం చేయాలని సూచిస్తోంది. ఆయా రాష్ట్రాలు తమ ప్రాంతానికి అవసరమైన స్కిల్స్, నేర్పే దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలని స్పష్టం చేసింది. మార్కెట్ డిమాండ్‌కు తగినట్లుగా నేటి పట్టభద్రులు తమ నైపుణ్యాలను పెంచుకుంటేనే పేద, మధ్య తరగతి విద్యార్థులకు కాలేజీ ఫీజులు భరించడమే కష్టమౌతున్న తరుణంలో కొత్తగా కోర్సులు నేర్చుకోవడం వారి తలకుమించిన భారమౌతోంది. ఈ నేపథ్యమేవారిని ప్రభుత్వ ఉద్యోగాల కోసం వెంపర్లాడే పరిస్థితి తెస్తోంది. అవేమీ కానరాక కేవలం కాగితం 'పట్టా'లతో తృప్తి పొందుతున్నారు. ఆ తర్వాత 'పని'కి రాకుండాపోతున్నారు. ఈ దేశ యువశక్తిని సక్రమంగా వినియోగించే దిశగాఆలోచనచేసి 'పట్టా' లిచ్చే కర్మాగారాలస్థానే 'స్కిల్డ్' శిక్షణనిచ్చి ప్రభుత్వమే వారికిఉద్యో గాలివ్వడం వల్ల యువతలో నైరాశ్యం తొలగుతుంది. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 8.23 లక్షలకుపైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ఇటీవలనే సమాచారం బయట కొచ్చింది. వీటిని భర్తీ చేస్తే కొంతమందికైనా కొలువులు దొరకుతాయి కదా!

యుద్ధ వినాశన కాలంలో, ఆ మారణహోమం సమయంలో ఏ అమెరికా పౌరుడు భోగభాగ్యాలను సంపాదిస్తూ మత్తెక్కి ఉండకూడదని విశ్వసిస్తాడు.



రూజ్‌వెల్ట్

రాకుమారులు యుద్ధం గురించి మాత్రమే అధ్యయనం చేయాలి. వారికి శాంతి ఓ ఆటవిడుపు. మరో యుద్ధానికి సంసిద్ధత అవడానికి అవకాశం.



మాకియవెల్లి

## ప్రజావాక్కు

### ప్రణాళిక అత్యవసరం

భారత్ వేగంగా పట్టణీకరణ చెందుతున్న వేళ, నగరాభివృద్ధిని కేవలం ఎత్తైనభవనాలు,ఎక్స్‌ప్రెస్‌వేలు, మెట్రో రైళ్లతో కొలవడం సరిపోదు.స్వచ్ఛమైన గాలి, తాగునీరు, సురక్షిత రహదారులు, సమర్థవంతమైన ప్రజా రవాణా, వరదలేని వీధులు,అందుబాటులో ఉండే గృహాలు కూడా నగర ప్రగతికి కీలక ప్రమాణాలే. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం భారత పట్టణ జనాభా 2050 నాటికి సుమారు95కోట్లకు చేరవచ్చు.దీనికిఅనుగుణంగా మౌలిక సదుపాయాల ప్రణాళిక అత్యవసరం.వాతావరణ మార్పులతో పట్టణ వరదలు,తీవ్రఉష్ణోగ్రతలు, కాలుష్యం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. కాబట్టి చెరువులు, కాలువలు, పచ్చనిప్రాంతాలను రక్షిస్తూ వర్షపునీటి నిర్వహణను బలోపేతం చేయాలి. 2025 తొలి అర్ధభాగంలో పరిశీలించిన 239 నగరాల్లో 122 నగరాలు జాతీయ పీఎం 2.5 ప్రమాణాన్ని మించినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి.ఇది పట్టణ ప్రణాళికలో పర్యావరణానికి మరింత ప్రాధాన్యం అవసరమని స్పష్టం చేస్తోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### బోధనలో నైతిక విలువలు భాగమవ్వాలి

భర్తృహరి, భాస్కర, సుమతీ,వేమన, శ్రీ కాళహస్తి శతకాలందు సమాజంలో ఎలా నడుచుకోవాలి, పెద్దలను ఎలా గౌరవించాలి, మంచి వారి సావాసంవల్ల కలిగే ప్రయోజనాలు, చెడు వారి దూరాలు,కష్టాల్లో కూడా ధర్మం తప్పకుండా ఉండటం,ఎప్పుడూ నిజంమాట్లాడటం, నమ్మకంగాఉండటం,ఇతరుల అభిప్రాయాలను హక్కులను, వ్యక్తిత్వాన్ని గౌరవించడం,తోటివారి కష్టాలను అర్థంచేసుకుని సహాయం చేయడం, మనం చేసే పనులకు నిర్ణయాలకు మనమే బాధ్యులమని గుర్తించడం. ఇవి సమాజంలో శాంతిని,వ్యక్తుల మధ్యపరస్పరనమ్మకాన్ని పెంచుతాయి. మంచి వ్యక్తిత్వాన్ని నిర్మిస్తాయి.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

### విద్యార్థులు నడవడికను అలవర్చుకోవాలి

నేటి యువత చిన్న చిన్న విషయాలను సైతం జీవితంలో పెద్ద విజయాలుగా భావిస్తున్నారు.వారికి నచ్చింది సంపాదించడంలో ఎంతవరకైనా బరి తెగిస్తూ తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తూ ప్రాణాలు తీసుకుంటున్నయువత భారీగా పెరిగిపోయింది. కుటుంబ నేపథ్యం తెలుసుకుని భవిష్యత్ జీవితంపట్ల అవగాహనతో ముందుకెళ్లాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### పథకాలతో పెరుగుతున్న అవినీతి

నేడు మన దేశంలో ఆధునిక సాంకేతిక విజ్ఞానం పెరుగుతుంటే అవినీతి, అక్రమాలు తగ్గకపోగా శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్న సామెత వలె ఇంకా పెరుగుతున్నాయి. ఈ మధ్య మన రాష్ట్రంలో అవినీతి అనూహ్యంగా పెరగటానికి మరోకారణం అనుచిత జనాకర్షక పథకాలు. కొందరు స్థితి పరులు వాటిని ఆశిస్తుంటే, వారికి అనుచితలబ్ధి కల్పిస్తున్నం దుకు సదరు ఉద్యోగులు డిమాండ్ చేస్తుంటే, కష్టపడకుండ వచ్చే డబ్బేనని లబ్ధిదారులు ఉదారంగా ఇస్తున్న కారణంవల్ల అవినీతి బాగా పెరిగిపోయింది. కనుక ఇక ముందు ఎవరైనా ప్రభుత్వోద్యోగంలో చేరేముందు గానీ, పార్లమెంటు,శాసన సభ్యులు,న్యాయ శాఖల్లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టే ముందు గానీవారూ, వారికుటుంబీకుల ఆస్తుల వివరాలను బహిరంగంగా తెలపాలని కేంద్రప్రభుత్వం ఒక చట్టం తేవాలి.అప్పటి,ఇప్పటి ఆస్తులకి పొంతనలేని భారీతేడాఉంటే, ఆ అక్రమఆస్తులను అవినీతినిరోధకశాఖతక్షణం జప్తుచేయాలి.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### తొండ ముదిరితే ఊసరవెల్లి

మందులు డాక్టరుగారి చీటి ప్రకారం ఇవ్వడం మందులు అమ్ముకునే దుకాణదారుల పని. తొండ ముదిరి ఊసరవెల్లిగా రంగులు మారుస్తుంది. మందులమ్ముకునే దుకాణాలు మందులు తయారుచేసి అమ్ముతున్నారు. ఆస్పత్రులు నడుపుతున్నారు. ప్రభుత్వం ఎంత మొత్తుకున్నా జనం చౌకయిన జనరిక్ మందులు వాడరు. ఏలనంటే డాక్టర్లు వారు మార్కెట్ చేయదలచిన మందులు రాసానతరు. జనాన్ని చైతన్యపరిచే ఉద్యమాలు ఈ దిశగా రావాలి.

- వి.ఆర్.ఆర్.ఎ. రాజు, హైదరాబాద్

### ధరలను తగ్గించాలి

ప్రస్తుత బ్లాక్ మార్కెట్ కారణంగా సిలిండర్ల అమ్మకాలు తగ్గడంతో సరఫరా గొలుసు సాధారణ స్థితికి వచ్చింది. అయితే, హోటల్స్‌లోదొరికే టిఫిన్, భోజనం,కాఫీ, టీ,ధరలు మాత్రం తగ్గలేదు. హోటల్ యజమానులు ధరలు తగ్గించకపోవటంతో వినియోగదారులు చాలా నిరాశ చెందుతున్నారు. సిలిండర్ ధరను యాభై లేదా వంద రూపాయలు పెంచినవెంటనే, ఒక రకమైన టిఫిన్, భోజనం, టీ, కాఫీ ధరలను అమాంతం పది రూపాయలు పెంచారు. సిలిండర్ ధరల తగ్గింపు హోటళ్లకు ప్రయోజనకరమైనప్పటికీ, ఇది వినియోగదారులకు చాలా భారంగా మారింది. ధరలను వెంటనే తగ్గించాలి.

-డి. వెంకటరెడ్డి, బెంగుళూరు

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# సంస్కరణలే కాదు, నిత్యం నిఘా ముఖ్యం!

*ఈ మధ్యన నేరాలకు అలవాటుపడ్డవారికి సైబర్ క్రయిం తేలిక అనిపిస్తుంది! అలాంటి నేర ప్రవృత్తి ఉన్న వారికి సహకారం అందించి, తెలివితేటలతో, చేతికి మట్టి అంటకుండా డబ్బు సంపాదించే వారిసంఖ్య ఎక్కువయింది! వీరి మీద నిఘా మరింత అవసరం! రాష్ట్రాల పరిధులను దాటి జైళ్ళల్లో స్నేహాలు పెంచుకొనే అనుభవజ్ఞులైన నేరస్థుల మీద జైలు అథార్టీలు, పోలీసులు ఎక్కువ నిఘా ఉంచక తప్పదు! గొలుసులు తెంపుకొని పోయేవారు, కార్లు, స్కూటర్లు దొంగిలించే వారు, మాయమాటలు చెప్పి సొమ్ము అపహరించే వారు ఇలాంటి వారికై పోలీసులు అప్రమత్తంగా వుండక తప్పదు! ఇలాంటి వారే జైలులో నేరాలు నేర్పరితనంలో నిష్ణాతులైన పాత నేరస్థుల దగ్గర శిక్షణ పొంది బయటకు వస్తారు! వారిని నిరంతరం నేరాలు చేయ కుండా అదుపులో వుంచుకోవటానికి పోలీసులు ఒక కన్నేసి వుండకతప్పదు! నేరాలు, నిఘా,నేరస్థులూ, పోలీసులూ, జైలులోపల, బయట, ఆనేర ప్రపంచమే మరో లోకం లాంటిది!*



రావులపాటి సీతారాంరావు

పోలీసుల సంస్కరణల గురించి చాలా చర్చలు దేశంలో జరిగాయి! ప్రస్తుతం మేధావులు, మీడియా ఫోకస్ పెట్టాల్సింది, జైళ్ళలో సంస్కరణల గురించి! ఈమధ్యన విచ్చలవిడిగా పెరుగుతున్న నేరాల వెనక ఏం జరుగుతున్నది అని శోధిస్తే జైళ్ల ల్లో వున్న నిందితులు, నేరస్థులే 'క్రయిం' అనే అగ్నికి ఆజ్యం పోస్తున్నట్లుగా అనేక ఉదంతాలు సోదాహరణలతో సహా బయటకు రావటం దీర్ఘంగా, లోతుగా ఆలోచించాల్సిన అంశంగా కనపడుతున్నది! సంస్కరించబడాల్సిన నేరస్థులు జైళ్ళల్లో వృత్తి నైపుణ్యాలకు పదును పెట్టుకుంటున్నారన్న వార్త విభ్రాంతి కలగజేయటమే కాదు ఆధునిక జీవన శైలికి అలవాటుపడినవారికి కలవరపాటు కలిగిస్తున్నది! అంతా బాగుంది, సాంకేతికంగా అభివృద్ధి పథంలో పయనిస్తున్నాం సంస్కరణలు అన్ని శాఖలలో చేపట్టాం అని చంకలు గుద్దుకుంటున్న ప్రభుత్వాలూ, సంబంధిత అధికారులూ, ఒక్క క్షణం ప్రసిద్ధి గాంచిన జైళ్ళ వైపు దృష్టి మరల్చి లోతుపాతులలోకి వెళ్తే నేర సంబంధిత నైపుణ్య చరిత్రలో దేశం ఎంతగా కూరుకొనిపోయి వుందో ఇట్టే అర్థమవుతుంది! కానీ ఆ విషయం మీద దృష్టి పెట్టే అధ్యయనపరులూ, అనుభవజ్ఞులు కనుమరుగవటంతో ఈ విషయం నివురు గప్పిన నిప్పులా వుంది! జైళ్ళల్లో కొత్తగా నేరాలు ఆపాదించబడిన వారు, కొద్దిపాటి శిక్షలు పడినవారూ, పశ్చాత్తాపంతో కృంగిపోతూ, జైలు గోడలు దాటగానే బుద్ధిగా వుండాలనే మానసిక దృక్పథంతో సహజంగానే వుంటారు! నేరస్థులుగా ముద్రించబడటం అలాంటి వారిని కృంగదీస్తుంది! కొత్తగా జైలు గోడలు మధ్య అడుగు పెట్టిన వారికోసమే సంస్కరణలు విజ్ఞులు తలపోసారు! ఓపెన్ ఎయిర్ జైళ్ళు అందుకోసమే నిర్మించారు! జైలులో కృంగిపోతూ, నిరంతరం చేసిన తప్పును గురించి ఆలోచించకుండా, బయటనే ఆకాశం, ప్రకృతి, చెట్లూ, చేమలు చూస్తూ జైలు జీవితం మరిచిపోయేలా చేసే ప్రయత్నమే ఓపెన్ ఎయిర్ జైళ్ళ ప్రయోగం! సేద్యం చేయటం, పంటలు పండించటంతో పాటు చదువు కోవటం, పరీక్షలురాయటం, డిగ్రీలు సంపాదించుకొని బయటకు వచ్చి నేర ప్రవృత్తిని పూర్తిగా వదిలేసి నేర రహిత జీవితాన్ని గడిపేందుకు అవకాశాలు కల్పించాలనే ఆలోచన చాలా గొప్పది! కానీ ఎంత వరకు ప్రభుత్వాలు ఈ విషయంలో సఫలీకృతులవుతున్నారనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది! సైబర్ క్రయిం వచ్చింతర్వాత ఈ నేరాల తర్ఫీదు జైళ్ళల్లోనే లభ్యపడుతున్నదనే విషయం గూడా ఈమధ్య వెలుగులోకి వస్తున్నది! 'హేబిట్యుయల్ అఫెండర్స్' పేరుతో (హెచ్.ఓస్) (పోలీసు పరిభాషలో) నిరంతరం నేరాలు చేసేవాళ్లను రికార్డుల కెక్కిస్తారు! డోషియర్ క్రిమినల్స్ (డి.సి) లాంటి గుర్తింపుతో క్రయిం రికార్డ్ బ్యూరోలలో జిల్లాలలో, రాష్ట్ర పరిధులను, దేశ పరిధులను అతిక్రమించి చేసే వారిని జాబితాల్లో నమోదు కాబడుతాయి! నేషనల్ క్రయిం రికార్డ్ బ్యూరోలో వారి చరిత్ర నిక్షిప్తపర్చ బడివుంటుంది! ఈ రికార్డులకు తోడు కొత్తగా సైబర్ క్రైం నేరస్థుల జాబితా గూడా ప్రత్యేకంగా చేర్చబడింది! హేబిట్యుయల్ అఫెండర్స్ జైళ్ళల్లో కొత్తవారిని చేరదీసి, మాయమాటలతో లొంగదీసుకొని జైళ్ళ బయటకు వెళ్ళగానే ఏవిధంగా లింక్లు ఏర్పరుచుకొని నేరాలు చేయాలనే 'జ్ఞానాన్ని' వారు ప్రసాదిస్తున్నారు! కొత్తవారు



అవిధంగా బయటకు వచ్చింతర్వాత గూడా మరిన్నినేరాలు, మరింత అనుభవంతో చేయటానికి సాహసిస్తున్నారు. జైళ్ళల్లో నిఘా బయటకు రాగానే ఏర్పరిచే పోలీసుల నిఘాతో బాటు, జైళ్ళల్లో వుండే నేరస్థుల్లో గూడా కొందరు పోలీసులకు ఇన్ఫార్మెంట్సుగా మారి అవసరమైన 'క్లూస్' యిచ్చే సహకారం గూడా అందిస్తున్నమాట ప్రక్కనపెడితే ఏవిధంగా జైళ్ళల్లో మరింత కట్టుదిట్టంగా ఇలాంటి నేరప్రక్రియను ఆపు చేయాలనే అంశం మీద దృష్టి పెట్టాల్సిన అవసరం ఏర్పడింది! ఈ మధ్యన తెలంగాణా పోలీసుల దృష్టికి నేరస్థుల జైలు లింకులు కొన్ని కేసుల ద్వారా బయటకు వచ్చాయి.! ఒక నేరస్థుడు, జైలు నుంచి బయటకు రాగానే, అమాయకుడైన కారు డ్రైవర్ను పెద్ద రెంట్‌ను చెల్లించి, ఆ కారుడ్రైవర్ వాష్ రూంకు వెళ్ళినప్పుడు ఆ కారుతో ఉడాయించిన సంగతి, మరో కారును అతను దొంగిలించినప్పుడు బయట పడింది! సిద్దిపేట పోలీసులు ఈ కేసులను పరిష్కరించటంతో జైళ్ళల్లో నేరస్థుల లింక్లు బాగా బయటకు వచ్చాయి! సుదర్శన్ అనే ఈ నేరస్థుడికి జైలులో వున్న ఒరిస్సా నేరస్థుడితో స్నేహం ఏర్పడిన తర్వాత విడుదల అయిన సుదర్శన్ ఒరిస్సాకు వెళ్ళి అక్కడ నేరస్థులతో సంబంధాలు ఏర్పరుచుకొని వివిధ రకాల నేరాలకు పాల్పడిన విషయం పోలీసుల దర్యాప్తులో తేలింది! నేరస్థుడితో జైలులో ఏర్పడిన సంబంధాలు, జైలు బయటకు వచ్చే నేరస్థుడికి బాగా ఉపయోగపడ్డాయి! కొత్తగా పెళ్ళయిన పిల్ల మంగళ సూత్రం చైన్ స్నాచర్లు తెంపుకొని పోవటంతో ఆ పిల్ల తల్లిదండ్రులు, సెంటిమెంట్ దృష్టిలో పెట్టుకొని బాధపడ్తుంటే అనుభవజ్ఞుడైన పోలీసు ఆఫీసర్ 'మీ అమ్మాయి మంగళసూత్రం తప్పక దొరుకుతుంది' అని హామీ యిచ్చి ఆ సాయంత్రానికల్లా ఆ మంగళ సూత్రం చెక్కు చెదరకుండా తీసుకొని వచ్చి ఇవ్వగానే పిల్ల తల్లిదండ్రులు ఆ ఆఫీసర్ను దేవుడిగా భావించారు! పోలీసు ఆఫీసర్కు క్రితం రోజు రాత్రి జైలు నుంచి బయటకు వచ్చిన నేరస్థుడు మరో నేరస్థుడు ఇలాంటి దొంగతనాలలో ఆరితేరిన వాడని చెప్పిన సంగతి జ్ఞప్తికి తెచ్చుకొని తనకు ఆచూకీ ఇచ్చిన నేరస్థుడి సహకారంతో మంగళ సూత్రం దొంగిలించిన నేరస్థుడిని పట్టుకోగలిగాడు. జైలు నుంచి బయటకు వచ్చే నేరస్థుల మీద నిరంతర నిఘా అవసరం! అనుభవజ్ఞులైన క్రయిం పర్యవేక్షించే పోలీసులు చేసే పని అదే! అయితే నిఘా, ఇన్ఫార్మెంట్సును డెవలప్ చేసే విధానాలు, బయట మంచిగా బ్రతుకుదామని వచ్చే నేరస్థులను టార్గెట్ చేయగూడదు!. నిజానికి బయటకు వచ్చే నేరస్థుల్లో చాలామంది బుద్ధిగా బయట బ్రతుకుదామని వచ్చేవారే ఎక్కువ మంది! వారికి ఉపాధి కల్పించే అవకాశాన్ని అధికారులూ ప్రభుత్వమూ, సంస్కరణల్లో ఒక భాగంగా తీసుకోక తప్పదు! ఈమధ్యన నేరాలకు అలవాటుపడ్డవారికి సైబర్ క్రయిం తేలిక అనిపిస్తుంది! అలాంటి నేర ప్రవృత్తి వున్న వారికి సహకారం అందించి, తెలివితేటలతో, చేతికి మట్టి అంటకుండా డబ్బు సంపాదించే వారి సంఖ్య ఎక్కువయింది! వీరి మీద నిఘా మరింత అవసరం! రాష్ట్రాల పరిధులను దాటి జైళ్ళల్లో స్నేహాలు పెంచుకొనే అనుభవజ్ఞులైన నేరస్థుల మీద జైలు అథార్టీలు, పోలీసులు ఎక్కువ నిఘా ఉంచక తప్పదు! గొలుసులు తెంపుకొని పోయేవారు, కార్లు, స్కూటర్లు దొంగిలించే వారు, మాయ మాటలు చెప్పి సొమ్ము అపహరించే వారు ఇలాంటి వారికై పోలీసులు అప్రమత్తంగా వుండక తప్పదు! ఇలాంటి వారే జైలులో నేరాలు నేర్పరితనంలో నిష్ణాతులైన పాత నేరస్థుల దగ్గర శిక్షణ పొంది బయటకు వస్తారు! వారిని నిరంతరం నేరాలు చేయకుండా అదుపులో వుంచుకోవటానికి పోలీసులు ఒక కన్నేసి వుండక తప్పదు! నేరాలు, నిఘా, నేరస్థులూ, పోలీసులూ, జైలు లోపల, బయట, ఆ నేర ప్రపంచమే మరో లోకం లాంటిది! ●

# కృత్రిమ మేధతో మారుతున్న ఉపాధి ప్రపంచం..

డాక్టర్ మోటె చిరంజీవి

కృత్రిమ మేధ (ఏఐ) విస్తరణతో ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాల భవిష్యత్తుపై చర్చ మొదలైంది. నిన్నటి వరకు మనిషి గంటల తరబడి చేసిన పనిని నేడు ఏఐ కొన్ని నిమిషాల్లో పూర్తి చేస్తోంది. కంటెంట్ రచన నుంచి సాఫ్ట్‌వేర్ కోడింగ్ వరకు, కస్టమర్ సేవల నుంచి డేటా విశ్లేషణ వరకు అనేక రంగాల్లో ఏఐవినియోగం వేగంగా పెరుగుతోంది. దీంతో ఉద్యోగాలు పోతాయన్న ఆందోళన సహజమే. అయితే అసలు ముప్పు సాంకేతికతలో కాదు.దానికి అనుగుణంగా మన నైపుణ్యాలను మార్చుకోకపోవడంలో ఉంది. ఏఐ కొన్నిరకాల పునరావృత పనులను సులభంగా నిర్వహించగలదు. ఒకప్పుడు ఒక పనికి పలువురు ఉద్యోగులు అవసరమైతే.. ఇప్పుడు సాంకేతికత సహాయంతో అదే పనిని తక్కువ మంది పూర్తి చేయగలుగుతున్నారు. సంస్థలకు ఇది వ్యయ నియంత్రణ, వేగం, ఉత్పాదకతను పెంచే మార్గంగా కనిపిస్తోంది. ఫలితంగా సంప్రదాయ ఉద్యోగాల్లో మార్పులు తప్పనిసరిగా వస్తున్నాయి.అయితే ఏఐ మనిషిని పూర్తిగా భర్తీ చేస్తుందనే భయం అంతగా వాస్తవికం కాదు.యంత్రానికి సృజనాత్మక ఆలోచన, మానవీయ అనుభూతి, పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకునే సామర్థ్యం పరిమితమే.ఏఐ ఇచ్చిన సమాచారాన్ని పరిశీలించి, సరైనదేదో నిర్ణయించి, దానికి మానవీయవిలువను జోడించేది మనిషే. ఏఐ వేగంగా విస్తరిస్తుండటంతో ప్రపంచ ఉపాధి రంగం పెనుమార్పులకు లోనవుతోంది. మనిషి గంటల తరబడి చేసే పనులను ఏఐఆధారిత సాధనాలు నిమిషాల్లో పూర్తి చేస్తున్నాయి. కంటెంట్ తయారీ, సాఫ్ట్‌వేర్, కస్టమర్ సేవలు, డేటా విశ్లేషణ, అకౌంటింగ్, మార్కెటింగ్ వంటిరంగాల్లో దీని వినియోగంపెరుగుతోంది. దీంతో ఉద్యోగ భద్రతపై ఆందోళన కూడా పెరుగుతోంది. అయితే ఏఐ వల్ల ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా ఎంత మందిఉద్యోగాలు కోల్పోయారన్నదానికి ఖచ్చితమైన గణాంకం లేదు. కంపెనీలు ఉద్యోగ కోతలకు ఏఐతో పాటు పునర్వ్యవస్థీకరణ, ఆర్థిక పరిస్థితులు, ఆటోమేషన్ వంటి పలు కారణాలను చూపుతున్నాయి. అమెరికాలో ఉద్యోగ కోతలను నమోదు చేసే సంస్థ మాత్రం 2023 నుంచి ఏఐను ప్రత్యేక కారణంగా నమోదు చేస్తోంది.ఆ సంస్థ తాజా గణాంకాల ప్రకారం 2023 నుంచి 2025 చివరి వరకు అమెరికాలో 71,825ఉద్యోగ కోతలప్రకటనలకుఏఐ కారణంగా పేర్కొన్నారు.ఇందులో 2025లోనే 54,836 ఉద్యోగ కోతలు ఏఐతో అనుసంధానించబడ్డాయి. అంటే కేవలం రెండేళ్ల వ్యవధిలోనే ఏఐ ప్రభావం గణనీయంగా పెరిగిందని ఈ గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచ ఆర్థిక వేదిక అంచనాలు మరింత ఆసక్తికరంగా ఉన్నాయి.2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక, ఆర్థిక,జనాభా, పర్యావరణ మార్పుల ప్రభావంతో 9.2కోట్ల ఉద్యోగాలుకనుమరుగయ్యే అవకాశం ఉండగా, 17కోట్ల కొత్త ఉద్యోగాలు ఏర్పడవచ్చని అంచనా వేసింది. అంటే మొత్తంగా 7.8 కోట్ల ఉద్యోగాల నికర పెరుగుదల ఉండొచ్చని పేర్కొంది. అందువల్ల సమస్యఉద్యోగాలు పూర్తిగా అంతరించిపోవడమేకాదు. ఉద్యోగాల స్వరూపం మారడం.పాత నైపుణ్యాలకు డిమాండ్ తగ్గుతూ, ఏఐ, బిగ్‌డేటా, సైబర్ సెక్యూరిటీ, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సృజనాత్మక ఆలోచన, కమ్యూనికేషన్, సమస్య పరిష్కారం వంటి మానవ నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది.కాబట్టి ఏఐని ఉద్యోగాల శత్రువుగా చూడటం కంటే.. దానిని ఉపయోగించగల నైపుణ్యాన్ని పెంచుకోవడమే పరిష్కారం. ●

# సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సామాన్యులకు చేరేదెన్నడు?

ఐ.ప్రసాదరావు

సుమారు 200 సంవత్సరాల బ్రిటిష్ సామ్రాజ్య పతనం కోసం 90 సంవత్సరాల సుదీర్ఘ స్వాతంత్ర్య పోరాటం చేసి ఎందరో మహానుభావులు, స్వాతంత్ర్య సమర యోధులు తమ జీవితాలను త్యాగం చేసిన ఫలితంగా 1947 ఆగస్టు 15వ తేదీన దేశానికి స్వాతంత్ర్యం సాధించుకుని నేటికి 79 సంవత్సరాలు పూర్తి చేసుకుని 80వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు ఘనంగా జరుపుకున్నాం. మన స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన ఆశయాలు లక్ష్యాలు స్వాతంత్య ఫలాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సామాన్యులకు అందుతున్నాయా అంటే నిస్సందేహంగా అందరికీ సమానంగా అందడంలేదు అనేది నిర్వివాదాంశం.అయితే పాలకులు త్వరలో భారత్ మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది అంటూ, 500ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతుంది అని, దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ముందుకు సాగుతోంది అని చెప్పడం విడ్డూరంగా ఉంది. అయితే 1947 నాటికి నేటికి కొన్నిరంగాల్లో అభివృద్ధి చెందిన మాట వాస్తవమే. అక్షరాస్యత యనభై శాతం సాధించాం. ఐ.టి,ఫార్మా, రక్షణ, ఉత్పత్తిలో ముందంజలో ఉన్నాము. కొంతమేరకు మౌలిక వసతులు అభివృద్ధి పరచుట జరిగింది.అంతరిక్షంలో విజయ విహారం చేస్తున్నాం. అయినప్పటికీ నేటికీ 145కోట్ల మంది భారత జనాభాలో సుమారు ఎనభై శాతం ప్రజలు ప్రభుత్వాలు అందించే ఉచిత పథకాలు, సంక్షేమ పథకాలు మీదే ఆధారపడి జీవిస్తున్నారు అని గణాంకాలు చెబుతున్నాయి. ఇటీవల సుప్రీంకోర్టు, వివిధ రాష్ట్రాల హైకోర్టులుకూడా ఈ పథకాలు పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కోకొల్లలుగా దేశంలో ప్రభుత్వ పథకాలపై ఆధారపడి బ్రతుకుతున్న ప్రజలను చూసి ఆశ్చర్యపోయారు. అసలు ప్రభుత్వాలురాజ్యాంగ నిర్మాతలు ఆశించిన విధంగా అందరికీ విద్య, వైద్యం,ఆర్థిక సామాజిక న్యాయం అందిస్తున్నాయా? ప్రభుత్వ ఆధీనంలో ఉండవలసిన అనేక అంశాలు, శాఖలు ప్రైవేటీకరణ కార్పొరేటీకరణ చేస్తూ ప్రజాసంక్షేమం నుంచి ప్రభుత్వాలు పక్కకు జరుగుతూ, బడా పారిశ్రామిక వేత్తలకు, కార్పొరేట్ ప్రపంచానికి రాయితీలు ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా వారి సంపదే దేశాభివృద్ధికి సూచిక అంటూ సంబురం పడిపోతున్నారు. దేశంలో సుమారు అరవై శాతం సంపద కేవలం ఒక శాతం ధనికుల వద్ద పోగుపడటం సమంజసమేనా? పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి ఉపయోగించవలసిన ప్రజాధనాన్ని 'రైటాఫ్'లద్వారా బడా పారిశ్రామిక వేత్తలకు ధారాదత్తం చేస్తూ, ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేయడం ప్రజాస్వామ్య పాలనా?ఈ డెభై తొమ్మిది సంవత్సరాల కాలంలో వివిధ పార్టీలు, ప్రభుత్వాలు అటు కేంద్రంలో, ఇటు వివిధ రాష్ట్రాల్లోపాలన కొనసాగించాయి. కేవలం ఆయా పార్టీల మనుగడకోసం,అధికారం సుస్థిరం చేసుకోవడం కోసమే ఓటుబ్యాంకు రాజకీయాలు చేసారు తప్పా దేశాభివృద్ధికి ముఖ్యంగా పేద మధ్య తరగతి ప్రజల జీవితాలు ఆర్థికంగా సామాజికంగా మెరుగుపరచడానికి, ముఖ్యంగా యువత విద్యార్థుల్లో ఆకాంక్షలను నెరవేర్చుడానికి, విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి, వ్యవసాయ పారిశ్రామిక రంగాలను బలోపేతం చేయడానికి ఏ మాత్రం ఇటీవల కాలంలో చిత్తశుద్ధితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయటలేదు అనేవాస్తవాన్ని మరువరాదు.అందుచేతనే ఇటీవల కాలంలో రైతులు, శ్రామికులు, ముఖ్యంగా



యువత జెన్‌జెడ్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా దేశం అభివృద్ధి చెందితే వలసలు వెళ్ళడం ఉండవు. ఏ రంగం నుంచి నిరసనలు వ్యక్తం కావుకదా!. ప్రభుత్వాలు చెబుతున్న అభివృద్ధి మాటల్లో ఏమాత్రం వాస్తవం లేదని వివిధరంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో మన దేశ ర్యాంకులు చూస్తే అర్థమవుతుంది. ముఖ్యంగా డాలర్‌తో రూపాయి మారకం విలువ రోజు రోజుకు పతనం అవుతోంది. దాదాపు 96 వద్ద అటుఇటుగా కొనసాగుతోంది అంటే మన ఆర్థికవ్యవస్థ ఎంత బలహీన పడిందో అర్థం అవుతుంది. ప్రపంచ స్థాయిలో మన దేశం ఆకలి సూచిలో హంగర్ ఇండెక్స్‌లో 102వ ర్యాంకు, పౌర స్వేచ్ఛలో 110వ ర్యాంకు, ఆరోగ్య సూచికలో 45, విద్యా సూచికలో 101, అవినీతిలో 91, పత్రికా స్వేచ్ఛలో 157, ప్రజాస్వామ్య సూచిలో 104, మానవ అభివృద్ధిసూచికలో (హెచ్ డి ఐ) 130లో ర్యాంకు, తలసరి ఆదాయంలో149వ ర్యాంకు, జెండర్ గ్యాప్‌లో 148వ ర్యాంకు,శాంతి విషయంలో 127, సంతోష సూచిలో 116వ స్థానంలో ఉన్నట్లు వివిధ అంతర్జాతీయ నివేదికలు చెబుతున్నాయి. ఇక ఎంత సంపాదించినా కనీసం తినడానికి తిండి లేక ప్రజలు అలమటిస్తున్నారు. దీనికి కారణం అధిక ధరలు దేశంలో నేడు ద్రవ్యోల్బణం 4.38శాతం పైనే కదలాడుతుంది.ఇక ప్రపంచ దేశాల్లో కన్నా అతి తక్కువ తలసరి ఆదాయం సగటున 2.35 లక్షల రూపాయలు సంవత్సరం ఆదాయంతో చాలా మంది బ్రతుకుతున్న పరిస్థితి. జూన్ 2026గణాంకాలు ప్రకారం దేశంలో నిరుద్యోగం 5.5శాతం పైబడి ఉంది. సరి కదా అరకొరగా అప్పుడు అప్పుడు ఎన్నికల్లో ఓట్లు సంపాదించుకోవడం కోసం జాబ్ క్యాలెండర్ అని చెబుతూ చేపట్టే పోటి పరీక్షలు దాదాపు అన్ని అవినీతి, పారదర్శకలేమితో జరుగుతున్న సందర్భంలో నేడు దేశంలో జన్‌జీ యువత నిరసన వ్యక్తం చేస్తున్నారు.ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వాలు జవాబుదారీతనం లేకుండా నియంతృత్వ ఆధిపత్య ధోరణితో నిరసనలు అణిచివేసేందుకు ప్రయత్నాలు చేయడం జరుగుతుంది. ఇదేనా మన స్వాతంత్ర్య సమర యోధులు, రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన ఆశయాలు. ఇకనైనా పాలకులు మారాలి. నేడు మనదేశంలో ప్రతీ సంవత్సరం 100 కోట్ల రూపాయలు పైబడి సంపాదించే అపార కుబేరులు బిలియనీర్ల సంఖ్య 576మంది అని గ్రహించాలి. అదే సమయంలో పేదవాడు మరీ పేదవాడుగా మారుతున్న పరిస్థితి. అనేకమంది రైతులు,ఉద్యోగాలు రాక నిరుద్యోగులు ప్రతీ సంవత్సరం ఆత్మహత్య చేసుకుంటున్నారు.అదే సమయంలో ప్రతీఒక్కరి నెత్తిమీద దాదాపు 1.5లక్షల రూపాయలు ప్రభుత్వ రుణం ఉందనే విషయాన్ని మరువరాదు. అభివృద్ధి పేరుతో కార్పొరేట్ వ్యక్తులు తీసుకున్న రుణాలు చెల్లించకపోవడంతో 'రైటాఫ్' పేరుతో ఈ పది సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం పది లక్షల కోట్ల రూపాయలు రద్దు చేసింది. అదే పేదవాడు, నిరుద్యోగి సామాన్య ప్రజలుఒక్క రూపాయి బాకీ ఉన్నా ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్న పరిస్థితి.అనర్హులకు కూడా ఉచిత పథకాలు, సంక్షేమ పథకాలు అమలు చేయడం శోచనీయం. ప్రతీ విషయంలో రాజకీయ జోక్యంపెరుగుతుంది. ఇకనైనా పాలకులు ప్రభుత్వాలు ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రశ్నిస్తే వారి ఆకాంక్షలను, ఆక్రందనలు పరిశీలించి పరిష్కారానికి కృషిచేయాలి. నైతికతతో, జవాబుదారీతనం ఉండటం ముఖ్యం. రాజ్యాంగ బద్ధమైన సంస్థలను స్వతంత్ర ప్రతిపత్తిగా పనిచేసే విధంగా చూడాలి. వ్యవసాయ పారిశ్రామిక రంగాలను బలోపేతం చేయాలి. నోటి మాటలతో స్వదేశీ అని కాకుండా, అందరూ స్వదేశీ వస్తువులు వాడేవిధంగా ప్రోత్సాహించాలి. ఎగుమతులు పెరగాలి. దిగుమతులు తగ్గాలి. విద్యా రంగంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెంచాలి.రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్‌కు, నైపుణ్యాభివృద్ధి పెద్దపీట వేయడం ద్వారా అభివృద్ధి చెందుతుంది. సమన్యాయం, సామాజిక న్యాయం ఆధారంగా ప్రభుత్వాలు పనిచేయాలి. ●

# ప్రజారక్షకుల భద్రత మన బాధ్యత



## నిరసన తెలిపే హక్కు హింసగా మారకూడదు..
## పోలీసులపై భౌతిక దాడులు ప్రజాస్వామ్య విరుద్ధమే
### ప్రజల భద్రత కోసం పోలీసులు చేసే త్యాగాలను గుర్తించాలి

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** ఏ ప్రజాస్వామ్య వ్యవస్థ సజావుగా పనిచేయాలన్నా నిరసన తెలిపే హక్కు, భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ, వ్యవస్థలో జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసే హక్కు అత్యంత కీలకం. పౌరులకు తమ సమస్యలను గళమెత్తి చెప్పే, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే, మార్పు కోసం డిమాండ్ చేసే ప్రాథమిక స్వేచ్ఛ ఉంది. అయితే, చట్టబద్ధమైన పౌర నిరసన హింస, విధ్వంసం, చట్టవ్యతిరేక చర్యలు, ప్రజా శాంతి భద్రతలను కాపాడే పోలీసులపై ప్రత్యక్ష దాడులుగా మారినప్పుడు పరిస్థితి తీవ్రంగా మారుతుంది. ఢిల్లీలో ఇటీవల ఉద్రిక్తతలుతీవ్రరూపం దాల్చి, రాళ్లు రువ్వడం, బారికేడ్లను ధ్వంసం చేయడం వంటి ఘటనల్లో 100 మందికి పైగా పోలీసు సిబ్బంది గాయపడటం తీవ్రంగా పరిగణించాల్సిన అంశం. ఇది కేవలం నిరసన కాదు. చట్టబద్ధమైన సమాజ వ్యవస్థను కాపాడేందుకు విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ సిబ్బందిపై జరిగిన హింసాత్మక దాడిగా చూడాల్సి ఉంటుంది. యూనిఫాం వెనుక ఉన్న మానవీయ కోణంపోలీసు వ్యవస్థను కేవలం ప్రభుత్వ ప్రతినిధులుగా లేదా నిరసనకారులకు అడ్డుగా నిలిచే వ్యక్తులుగా చూడటం సరికాదు. హెల్మెట్లు, రక్షణ కవచాలు ధరించి విధులు నిర్వహించే ప్రతి పోలీసు వెనుక ఒక మనిషి ఉంటాడు. వారు తల్లులు, తండ్రులు, కుమారులు, కుమార్తెలు. ప్రతిరోజూ తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తూ, తమ కుటుంబాల వద్దకు సురక్షితంగా తిరిగి వెళ్లాలని కోరుకునే వారే. కొన్ని వారాలుగా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ భద్రతా సిబ్బంది ఎంతో సహనం, వృత్తి నైపుణ్యం, సంయమనంతో వ్యవహరించారు. దూషణలు, ఎగతాళి, నినాదాలు ఎదురైనా శాంతి భద్రతలను కాపాడే తమ బాధ్యతను నిర్వర్తించారు. అయితే పోలీసులపై భౌతిక దాడులకు దిగడం మాత్రం ప్రజాస్వామ్య నిరసనకు సంబంధించిన అన్ని హద్దులను దాటడమే. న్యాయం కోసం పోరాడుతున్నామనే పేరుతో అల్లకల్లోలాన్ని సమర్థించే ప్రమాదకర ధోరణి ఇటీవలి కాలంలో కనిపిస్తోంది. అయితే వ్యవస్థలో జవాబుదారీతనం కోరుతూ అదే సమయంలో ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం, పోలీసులపై దాడులు చేయడం, రోడ్లపై పూర్తిస్థాయి అరాచక పరిస్థితులు సృష్టించడం ద్వారా నిజమైన మార్పు సాధ్యం కాదు. సమాజం ఒక సామాజిక ఒప్పందంపై ఆధారపడి ఉంటుంది. ప్రజలు సామూహిక ప్రయోజనం కోసం రూపొందించిన చట్టాలను పాటించాలి. ప్రభుత్వం ప్రజలను రక్షిస్తూ న్యాయాన్ని అమలు చేయాలి. గుంపులు బారికేడ్లను కూల్చి పోలీసు బలగాలపై దాడి చేసినప్పుడు ఈ సామాజిక ఒప్పందాన్నే దెబ్బతీసినట్టవుతుంది.

**భిన్నాభిప్రాయాలకు గౌరవం అవసరం:**
జవాబుదారీతనం పారదర్శకత, చర్చ, చట్టపరమైన వ్యవస్థల ద్వారా సాధించాలి. భౌతిక బెదిరింపులు, గుంపుల ఆధిపత్యం ద్వారా కాదు. చట్టబద్ధ వ్యవస్థను ధ్వంసం చేస్తూనే ప్రభుత్వ సంస్థల నుంచి జవాబుదారీతనం కోరడం పరస్పర విరుద్ధమైన చర్య. జవాబుదారీతనం సాధించాలంటే ముందుగా చట్టబద్ధమైన వ్యవస్థ, క్రమశిక్షణ అవసరం. రాజధాని భద్రతను కాపాడటం పోలీసుల బాధ్యనిరసనలు పద్ధతి ప్రకారం నిర్వహించే కార్యక్రమాల నుంచి పోలీసు బలగాలపై ప్రణాళికాబద్ధమైన దాడులుగా మారినప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోతుంది. అది ఇక సాధారణ నిరసన కాదు. ప్రజల భద్రత, జాతీయ భద్రత, చట్టబద్ధ పాలనకు ప్రత్యక్ష ముప్పుగా పరిణమిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో నగర భద్రతను, ప్రభుత్వ మౌలిక వసతులను, అమాయక ప్రజలను కాపాడాల్సిన చట్టపరమైన, నైతిక బాధ్యత పోలీసు వ్యవస్థపై ఉంటుంది. పోలీసులు ఘర్షణను కోరుకోరు. ప్రజా భద్రతకు స్పష్టమైన ముప్పు ఏర్పడినప్పుడు స్పందించాల్సిన బాధ్యత వారిపై ఉంటుంది అదుపు తప్పిన హింస, అల్లకల్లోలం నుంచి సామాన్య ప్రజలను కాపాడటం పోలీసుల ప్రాథమిక బాధ్యత. బారికేడ్లను రక్షించడం, హింసకు పాల్పడుతున్న వారిని అడ్డుకోవడం ద్వారా స్థానికంగా మొదలైన అల్లర్లు విస్తృత విధ్వంసానికి దారితీయకుండా నిరోధించవచ్చు.

**చట్టబద్ధ పాలన పరిరక్షణ:**
పోలీసులపై ఎలాంటి శిక్ష లేకుండా హింసకు పాల్పడేందుకు అనుమతిస్తే, చట్టం కంటే బలప్రయోగమే పైచేయి అనే ప్రమాదకర సందేశం వెళ్తుంది. ఇది చట్టంపై ఆధారపడే ప్రతి పౌరుడి భద్రతకు ముప్పుగా మారుతుంది. పోలీసు, భద్రతా సిబ్బందికి మన మద్దతు అవసరంభద్రతా బలగాలపై హింసను సాధారణ చర్యగా అంగీకరించడాన్ని సమాజం స్పష్టంగా తిరస్కరించాలి. ప్రభుత్వ విధానాలను విమర్శించడం, నిర్ణయాలను ప్రశ్నించడం ప్రతి పౌరుడి హక్కు. అయితే చట్టాన్ని అమలు చేసే బాధ్యతలో ఉన్న పోలీసు సిబ్బందిపై భౌతికంగా దాడి చేయడంమాత్రం నేరం. సమాజంగా మనం పోలీసు, భద్రతా సిబ్బందికి అండగానిలవాలి. ఉద్రిక్త పరిస్థితుల్లో వారు ప్రదర్శించిన సంయమనాన్ని గౌరవించాలి. ప్రజల భద్రత కోసం వారు చేస్తున్న త్యాగాలను గుర్తించాలి. శాంతిభద్రత లను కాపాడే తమ విధులను ఎలాంటి అనవసర హింసా భయం లేకుండా నిర్వర్తించే పరిస్థితిని కల్పించాలి. పరస్పర గౌరవం, చట్టబద్ధత, శాంతియుత నిరసనల ద్వారానే నిజమైన పురోగతి, న్యాయం, సంస్కరణ సాధ్యమవుతాయి. ప్రజలను రక్షించే వారిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజానిదే.



## కేంద్ర కేబినెట్ ప్రక్షాళనకు ముహూర్తం ఖరారు!
### 20 మంది మంత్రులపై వేటు లేదా శాఖల్లో మార్పు?

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందే కేంద్ర కేబినెట్ ప్రక్షాళన చేసేందుకు సిద్ధమైన ప్రధాని మోడీ వివిధ కారణాలతో అది కాస్తా వాయిదా వేసుకున్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా జాతీయ స్థాయిలో ఒక్కసారిగా పెనుమార్పులు సంభవించాయి. అదే సమయంలో వీటి ప్రభావం త్వరలో జరిగే మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై పడేలా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ముందుగా బిజెపి జాతీయ కార్యవర్గంలో మార్పులు చేర్పులు చేసిన మోడీ ఇప్పుడు తన కేబినెట్ ప్రక్షాళనకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ముహుర్తం కూడా ఖరారైనట్లు తెలుస్తోంది. దేశంలో మారిన పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యతల్ని మార్చుకోవడంతో పాటు తిరిగి జనంలో విశ్వాసం పెంచుకోవడానికి ప్రధాని మోడీ ప్రయత్నిస్తున్నట్లు ఢిల్లీ వర్గాల సమాచారం. ముఖ్యంగా రాబోయే రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు వీలుగా కేబినెట్లో మార్పులు చేసుకోవాలని మోడీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఈసారి కేబినెట్ మార్పులు కచ్చితంగా జాతీయ స్థాయిలో కీలక సంకేతాలు ఇచ్చే విధంగా ఉంటాయని చెప్తున్నారు. ఇప్పటికే కేబినెట్ ప్రక్షాళనకు రంగం సిద్దంచేసుకున్న ప్రధాని మోడీ అందులో భాగంగానే ఇద్దరు మంత్రులకు రాజ్యసభ కొనసాగింపు ఇవ్వలేదు, అలాగే మరో ముగ్గురిని ఎన్నికలు జరిగేరాష్ట్రాలకు ఇన్‌ఛార్జ్‌లుగా పంపారు. ఇప్పుడు కేబినెట్లో మిగిలిన మంత్రుల్లోనూ పలువురికి ఉద్వాసన పలికేందుకు సిద్దమవుతున్నట్లు తెలుస్తోంది. మరికొందరు శాఖల మార్పు తప్పనిసరిఅవుతోంది. ఇందులో ప్రధానంగా వినిపిస్తున్న పేరు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్. ఆమెను వేరే శాఖకు పంపి, ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌ను ఆర్థికమంత్రిగా నియమించే అవకాశముంది. అలాగే రెగ్యులర్ విద్యాశాఖ మంత్రిని కూడా నియమించే అవకాశం ఉంది. పలు కీలక శాఖల్లోనూ మార్పులు ఉంటాయని తెలుస్తోంది. ఇలా చూస్తే మొత్తం మీద 20 మంది మంత్రుల వరకూ వేటు లేదా శాఖలమార్పు ముప్పు ఎదుర్కొంటున్నట్లు ఢిల్లీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. ఇందులో భాగంగా పలువురు జూనియర్ మంత్రులపై వేటుపడొచ్చని చెప్తున్నారు. లేదా వేరే శాఖలకూ పంపే అవకాశం ఉంది. అలాగే ఎన్నికలు జరిగే యూపీ, గుజరాత్, పంజాబ్ నుంచి కొత్త మంత్రులు కేబినెట్లోకి రాబోతున్నారు.

## మిస్ యూనివర్స్ ఇండియాగా కజియా లిజ్‌మెజో



**జైపూర్, ఆగస్టు 24:** కేరళకు చెందిన 19 యేళ్ల కజియా లిజ్ మెజో మిస్ యూనివర్స్ ఇండియా 2026 కిరీటం దక్కించుకుంది. జైపూర్‌లోని జీ స్టూడియోస్‌లో జరిగిన గ్రాండ్ ఫినాలేలో ఆమె విజేతగా నిలిచింది. దేశవ్యాప్తంగా పోటీపడిన 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి టైటిల్ సొంతం చేసుకుంది. మిస్ యూనివర్స్ ఇండియా 2025 విజేత మానికా విశ్వకర్మ ఆమెకు కిరీటం అలంకరించారు. దీంతో నవంబర్‌లో ప్యూర్టోరికోలో జరిగే 75వ మిస్ యూనివర్స్ పోటీలో భారత్ తరఫున కజియా ప్రాతినిధ్యం వహించనుంది. కిరీటం దక్కిన అనంతరం కజియా ఆనందం వ్యక్తం చేసింది. ఈ కిరీటం కోసం మూడేళ్లకు పైగా కష్టపడ్డానని తెలిపింది. తన సొంత రాష్ట్రం కేరళకు ఈ విజయాన్ని తీసుకెళ్లడం ఎంతో గర్వంగా ఉందని చెప్పింది. 19 ఏళ్ల వయసులో ఇంత పెద్ద వేదికపై నిలవడానికి ఎంతో ధైర్యం అవసరమైందని కజియా పేర్కొంది. తనపై తనకు నమ్మకం పెంచుకోవడం అతిపెద్ద సవాలుగా భావించానని తెలిపింది. భారత్‌కు మిస్ యూనివర్స్ కిరీటం తీసుకురావడమే తన తొలి లక్ష్యమని కజియా చెప్పింది. తాను చేసే ప్రతి పనిలో భారత్, కేరళకు ప్రాతినిధ్యం వహించాలనుకుంటున్నట్లు తెలిపింది. విజేతను ఎంపిక చేసిన జడ్జింగ్ ప్యానెల్‌లో మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్, ఉర్వశి రౌతేలా, రియా సింఘా, పర్యావరణవేత్త ప్రగ్యా కపూర్ ఉన్నారు. సెలీనా జైట్లీ కూడా జడ్జిగా వ్యవహరించారు. వైష్ణవి గణేశ్ తొలి రన్నరప్‌గా నిలిచింది. ఆమెకు మిస్ ఇంటర్నేషనల్ ఇండియా 2026 టైటిల్ దక్కింది. అనుశ్రీ సాతవ్లేకర్ రెండో రన్నరప్‌గా నిలిచింది. తేజస్విని శ్రీవాస్తవ మూడో రన్నరప్, అనుభా వశిష్ఠ్ చౌదరి నాలుగో రన్నరప్‌గా నిలిచారు.



## విద్యార్థినులతో కలిసి ప్రిన్సిపల్ జలకాలాటలు
### సస్పెండ్‌చేసిన సెకండరీ విద్యాశాఖ

**ఆల్వార్, ఆగస్టు 24:** విద్యార్థినులతో కలిసి నీళ్లలో అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్‌పై అధికారులు వేటు వేశారు. విద్యార్థినులతో ఆయన జలకాలాటలు ఆడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌కావడంతో, విద్యాశాఖ అతడిని సస్పెండ్ చేసింది. ఈ ఘటన రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లాలో చోటుచేసుకుంది. అల్వార్ జిల్లాలోని ఒక ప్రభుత్వ సీనియర్ సెకండరీ పాఠశాల ప్రిన్సిపాల్ లాల్‌చంద్ మీనా, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సుమారు 200 మంది విద్యార్థులను పిక్నిక్‌కు తీసుకెళ్లారు. వీరిలో 11, 12వ తరగతి చదువుతున్న బాలికలు కూడా ఉన్నారు. పాఠశాలకు సమీపంలోని ఓ డ్యామ్ వద్దకు వెళ్లిన వీరంతా నీటిలో ఆడుకున్నారు. ఈ క్రమంలో ప్రిన్సిపాల్ లాల్‌చంద్ మీనా కూడా విద్యార్థులతో కలిసి నీళ్లలోకి దిగారు. విద్యార్థినుల ముందే దుస్తులులేకుండా నీటిలో ఈదినట్టుగా ఉన్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో విస్తృతంగా వ్యాపించింది. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి విద్యార్థినుల పట్ల ప్రిన్సిపాల్ ప్రవర్తించిన తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వీడియో ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వారు వెంటనే స్పందించారు. ప్రభుత్వ ఉద్యోగి ప్రవర్తనా నియమావళిని మీనా ఉల్లంఘించారని నిర్ధారించారు. ఈ మేరకు బికనీర్ సెకండరీ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రిన్సిపాల్ లాల్‌చంద్ మీనాపై శాఖాపరమైన విచారణకు కూడా ఆదేశించింది. ప్రస్తుతం ఈ ఘటనపై విచారణ కొనసాగుతోంది.

## యేడాదికి మూడు ఉచిత ఎల్పీజీ సిలిండర్లు
### ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం



**చెన్నై, ఆగస్టు 24:** తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ సోమవారం పలు సంక్షేమ పథకాలను ప్రకటించారు. యేడాదికి మూడు ఉచిత ఎల్పిజి సిలిండర్లు అందించే పథకంతో పాటు ట్రాన్స్ జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. అన్నపూర్ణి సూపర్ సిక్స్ పేరుతో గ్యాస్ సిలిండర్ల పథకం అమల్లోకి రానుంది. 2027 సంక్రాంతి నుంచి దీనిని ప్రారంభించనున్నారు. యేటా రూ.2.5 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. అర్హులైన కుటుంబాలు కొనుగోలు చేసే మూడు గ్యాస్ సిలిండర్ల ఖర్చును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఈ పథకానికి ఏటా సుమారు రూ.4వేల కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులతో గ్యాస్ కొరత, ధరల పెరుగుదల కుటుంబాలపై అదనపు భారాన్ని మోపాయని విజయ్ తెలిపారు. మహిళల ఉచిత బస్సుప్రయాణ పథకం పరిధిని ప్రభుత్వం విస్తరించింది. ఇకపై సాధారణ బస్సులతో పాటు ఎక్స్‌ప్రెస్, ఎల్ఎస్ఎస్, డీలక్స్ బస్సుల్లోనూ మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. జిల్లాల మధ్య నడిచే బస్సుల్లోనూ ఈ సదు పాయం కల్పించ నున్నారు. వెట్రి పయనం పేరుతో అక్టోబర్ 2 నుంచి ఈవిస్తరణ అమల్లోకి వస్తుంది. ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు విజయ్ ప్రకటించారు. చెన్నై సమీపంలోని పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టుపై విజయ్ మరో సారి తనవ్యతిరేకతను స్పష్టంచేశారు. ప్రాజెక్టుతో ప్రభావిత మయ్యే కుటుంబాల పక్షాన నిలుస్తామని చెప్పారు. ప్రత్యామ్నాయ ప్రాంతాలను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాలను గుర్తించినట్లుతెలిపారు. ప్రస్తుత మీనంబాక్కం, చెన్నై విమానాశ్రయంలోని కొత్త టెర్మినల్5 నిర్మించనున్నట్లు కూడా ప్రకటించారు.

## హెచ్‌వన్-బి, ఒపిటిలపై షాకింగ్ ఫీజులు!
### అమెరికాకు వెళ్లే కల కలగానే మారుస్తున్న ట్రంప్




**వాషింగ్టన్, ఆగస్టు 24:** అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడయ్యాక భారతీయులకు ఏదో విధంగా నిత్యం షాకులు తగులుతూనే ఉన్నాయి. ఇదే క్రమంలో తాజాగా భారతీయులకు మరో షాక్ ఇచ్చేందుకు ట్రంప్ సర్కార్ సిద్దమవుతోంది. ఇందులో భాగంగా హెచ్1బీ వర్క్ వీసా, ఎఫ్1 ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లపై కొత్త ఫీజుల్ని ప్రవేశపెట్టేందుకు అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రతిపాదనలు ప్రస్తుతం వైట్ హౌస్ బడ్జెట్ విభాగం పరిశీలనలో ఉన్నాయి. అమెరికా తాజా నిర్ణయం వల్ల అక్కడికి వెళ్లాలనుకునే లక్షలాది మంది భారతీయులపై ఆర్థిక భారం భారీగా పెరిగే అవకాశం ఉంది. అమెరికాలో 2024 ఆర్థిక సంవత్సరంలో మంజూరైన హెచ్1బీ వీసాలలో దాదాపు 71 శాతం భారతీయులకే దక్కాయి. ఈ నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం తీసుకోబోయే ఫీజుల పెంపు నిర్ణయం నేరుగా మన ఐటీ నిపుణులపై తీవ్ర ప్రభావం చూపనుంది. న్యూయార్క్‌కు చెందిన ప్రముఖ ఇమ్మిగ్రేషన్ లా సంస్థ ఫ్రాగోమెన్ ప్రకారం, ఇప్పటికే ఈ ప్రతిపాదనల ముసాయిదా యూఎస్ బడ్జెట్ విభాగానికి చేరింది. గతంలో ట్రంప్ ప్రభుత్వం హెచ్1బీ వీసా పిటిషన్లపై ఏకంగా లక్ష డాలర్ల ఫీజు విధించాలని ప్రయత్నించగా, కోర్టు దాన్ని తిరస్కరించింది. దాంతో ఇప్పుడు హోంల్యాండ్ సెక్యూరిటీ మరో ప్రత్యామ్నాయ మార్గంలో ఫీజులు పెంచేందుకు చట్టపరమైన సన్నాహాలు చేస్తోంది.

మరోవైపు విద్యార్థుల విషయానికి వస్తే, ఉన్నత విద్య పూర్తి చేసిన తర్వాత ఉద్యోగం చేసుకునేందుకు ఉపయోగపడే ఎఫ్1 ఓపీటీ దరఖాస్తులపై కూడా ఈ పెరిగిన ఫీజుల ప్రభావం పడనుంది. ఈ ఫీజుల్ని కూడా భారీగాపెంచవచ్చని సమాచారం. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఒపిటి దరఖాస్తుకు 470 డాలర్లు, పేపర్ రూపంలో అయితే 520 డాలర్లు చెల్లించాల్సి ఉంది. సాధారణంగా హెచ్1బీ వీసా రుసుములను కంపెనీలే భరిస్తాయి. కానీ ఓపీటీ ఫీజులను విద్యార్థులే స్వయంగా చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుఖర్చులు భారీగా పెరిగితే భారతీయ విద్యార్థుల ఉన్నత చదువులపై, ఆ తర్వాతి ఉపాధి అవకాశాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. అమెరికాలో స్థిరపడేందుకు చాలా కాలంగా ఉన్న ఎఫ్1 నుండి హెచ్1బీ మార్గం మరింత వ్యయభరితంగా మారనుంది. తుది నోటిఫికేషన్ వచ్చే వరకు ఫీజు ఎంత పెరుగుతుందనే దానిపై పూర్తి స్పష్టత రాదు.

## భర్తను హత్యచేసి, పొట్టనుచీల్చి పేగులు సంచిలోకి
### ఇంటియజమాని చూడటంతో ఆత్మహత్యాయత్నం




**కురుక్షేత్ర, ఆగస్టు 24:** హర్యానాలోని కురుక్షేత్రలో అత్యంత దారుణమైన, ఒళ్లు గగుర్పొడిచే ఘటన వెలుగులోకి వచ్చింది. భర్తను కిరాతకంగా హత్య చేసిన ఓ మహిళ, అతని శరీరాన్ని ఛిద్రం చేసింది. ఈ క్రమంలో ఇంటి యజమానికి అడ్డంగా దొరికిపోవడంతో భయంతో టెర్రస్‌పై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసుల వివరాల ప్రకారం, పీహోవా రోడ్డులోని రాజ్ ప్యాలెస్ సమీపంలో రాజేశ్, విమలా దేవి దంపతులు ఓ అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజేశ్ స్థానికంగా ఓ వాటర్ ట్రేడింగ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో వీరిద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది.

వారి ఇంట్లోంచి పెద్దగా అరుపులు వినిపించడంతో ఇంటి యజమాని రింకూ వారిని చూసేందుకు టెర్రస్‌పైకి వెళ్లాడు. అక్కడ కనిపించిన దృశ్యం చూసి రింకూ షాక్‌కు గురయ్యాడు. రాజేశ్ రక్తపు మడుగులో పడి ఉండగా, అతని పొట్ట భాగం చీల్చి ఉంది. బయటకు వచ్చిన పేగులను విమల ఓ సంచిలో పెడుతుండటం అతను గమనించాడు. ఇంతలో తనను ఇంటి యజమాని చూశాడని గ్రహించిన విమల, కంగారుతో టెర్రస్‌పై నుంచి కిందికి దూకేసింది. గాయపడిన ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. పోస్టుమార్టం నివేదికలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. రాజేశ్ పొట్టపై సుమారు 35 సెంటీమీటర్ల పొడవున కోసి ఉంది.

అతని శరీరం నుంచి కాలేయంలో కొంత భాగం, కుడివైపు కిడ్నీ మాయమైనట్టు వైద్యులు గుర్తించారు. ఘటనా స్థలంలో మూడు వేర్వేరు పరిమాణాల్లో ఉన్న కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విమల క్షుద్రపూజలు, చేతబడి వంటివి చేస్తుండేదని, ఈ విషయమై దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవని ఇంటి యజమాని పోలీసులకు తెలిపాడు. కొన్నేళ్ల క్రితం వివాహం చేసుకున్న ఈ దంపతులకు పిల్లలు లేరు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విమల కోలుకుని వాంగ్మూలం ఇస్తేనే ఈ హత్య వెనుక ఉన్న పూర్తి వివరాలు, అసలు కారణాలు తెలిసే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

## వచ్చేనెల 28 నుంచి మూడురోజులు బ్యాంకు ఉద్యోగుల సమ్మె




**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మరోసారి సమ్మె గంటలు మోగనున్నాయి. తమ ప్రధాన డిమాండ్లను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ) విఫలమయ్యాయని ఆరోపిస్తూ బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక అయిన యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. వారానికి ఐదు రోజుల పనిదినాలు, పనితీరు ఆధారిత ప్రోత్సాహకం (పిఎల్ఐ) విధానంలో మార్పులు వంటి కీలక అంశాలపై ఉద్యోగ సంఘాలు పట్టుబడుతున్నాయి. ఈ మేరకు దశలవారీ ఆందోళనల షెడ్యూల్‌ను ప్రకటించాయి. యుఎఫ్‌బియూ ప్రకటించిన వివరాల ప్రకారం, సెప్టెంబర్ 11న ఒక రోజు దేశవ్యాప్త సమ్మె, సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల సమ్మె నిర్వహించనున్నారు. అప్పటికీ ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే, అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని యూనియన్లు స్పష్టం చేశాయి. ఈ సమ్మెల కారణంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల సేవలకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉంది. 2024 మార్చి 8న జరిగిన 12వ ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా, వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయడానికి ఐబీఏ అంగీకరించింది.

దీనికి బదులుగా సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజుకు 40 నిమిషాలు అదనంగా పనిచేయడానికి ఉద్యోగులు అంగీకరించారు. ఐబీఏ ఈ ప్రతిపాదనను ప్రభుత్వ ఆమోదం కోసం పంపినప్పటికీ, రెండేళ్లు దాటినా ఇప్పటికీ ఆమోదముద్ర పడలేదు. ఈ జాప్యంపై ఉద్యోగ సంఘాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ ఇటీవల సవరించిన పీఎల్ఐ విధానం తీవ్ర వివక్షాపూరితంగా ఉందని యూనియన్లు ఆరోపిస్తున్నాయి. కొత్త విధానం ప్రకారం, స్కేల్4, ఆపై స్థాయి అధికారులకు వారి వ్యక్తిగత పనితీరు ఆధారంగా గరిష్ఠంగా 365 రోజుల బేసిక్ పే వరకు ప్రోత్సాహకం లభిస్తుంది. అదే సమయంలో, స్కేల్3 వరకు ఉన్న అధికారులు, ఇతర సిబ్బందికి కేవలం 15 రోజుల బేసిక్ పే, డిఎ మాత్రమే అందుతుంది. ఇది ఐబిఏతో చేసుకున్న ఒప్పందానికి విరుద్ధమని యూఎఫ్‌బీయూ వాదిస్తోంది.

# సంక్షిప్త వార్తలు

## ట్రంప్ తనయుడికి ఇరాన్ టివిలో బెదరింపులు



**టెహ్రాన్, ఆగస్టు 24:** ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమారుడిపై టెహ్రాన్ ప్రత్యక్ష బెదరింపులకు పాల్పడింది. ట్రంప్ చిన్న కుమారుడు బారెన్ ట్రంప్‌ను హత్య చేస్తామని బెదరిస్తూ.. ఇరాన్ ప్రభుత్వ అనుబంధ మీడియా ఛానల్ ఓ విడియోను ప్రసారం చేసింది. అతడి తలపై 10 మిలియన్ డాలర్ల రివార్డును ప్రకటించింది. ఈ విడియోలో బారెన్ ఏ సమయంలో ఎక్కడ ఉంటారు? అతడిని లక్ష్యం చేసుకొనేందుకు సరైనచోటు ఏది? అనే విషయాలను గ్రాఫిక్స్‌లో చూపించింది. అంతేకాకుండా అతడి కదలికలపై నిఘా, ఆన్‌లైన్ కార్యకలాపాలు, చుట్టూ ఉండే వ్యక్తుల గురించి తెలియజేసింది.

## రష్యా 3లక్షల మంది సైనికులను సిద్ధం చేస్తోంది: జెలెన్‌స్కీ

**కీవ్, ఆగస్టు 24:** ఉక్రెయిన్-రష్యా మధ్య ఘర్షణ ఇటీవల మరింత తీవ్రమవుతోంది. ఈ క్రమంలోనే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమపై దాడులు మరింత పెంచేందుకు రష్యా సన్నాహాలు చేస్తోందని అన్నారు. దాదాపు 3 లక్షల మంది సైనికులను కొత్తగా సమీకరించేందుకు ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. డొనెట్స్క్ ప్రాంతాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవడమే మాస్కో ప్రధాన లక్ష్యమని, ఇందులో భాగంగానే కొత్తగా సమీకరించే బలగాలను అక్కడ మోహరించే అవకాశం ఉందని చెప్పారు. సెప్టెంబరులో రష్యా పార్లమెంటరీ ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ ప్రక్రియ మొదలయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు.

## బిచ్చగత్తె ఇంట్లో రూ.8.40 లక్షల నగదు

**మాండ్య, ఆగస్టు 24:** కర్ణాటకలో ఆశ్చర్యకర ఘటన వెలుగులోకి వచ్చింది. జీవితమంతా భిక్షాటన చేస్తూ గడిపిన 68 యేళ్ల మహిళ ఇంట్లో రూ.8.40 లక్షల నగదు బయటపడింది. 30కి పైగా బస్తాల్లో నోట్లను, నాణేలను దాచిపెట్టినట్లు గుర్తించారు. అయితే ఆ డబ్బు ఆమెకు ఉపయోగపడకుండానే కన్నుమూశారు. మాండ్యకు చెందిన హూర్ వృద్ధాప్య సంబంధ అనారోగ్యంతో నిన్న మృతి చెందారు. ఆమె మరణించిన తర్వాత స్థానికులు ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా బస్తాల్లో పెద్ద మొత్తంలో నగదు కనిపించింది. రూ.10, రూ.20, రూ.50 నోట్లు భారీగా ఉన్నాయి. వేల సంఖ్యలో నాణేలు కూడా బయటపడ్డాయి.

## పరందూర్ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు వెనక్కి

**చెన్నై, ఆగస్టు 24:** తమిళనాడు రాజధాని చెన్నై సమీపంలో గతంలో ప్రతిపాదించిన విమానాశ్రయ ప్రాజెక్ట్ ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న టివికె, ప్రతిపక్ష డిఎంకె మధ్య తీవ్ర రాజకీయ వివాదానికి దారితీసింది. చెన్నైకి సుమారు 70 కిలో మీటర్ల దూరంలో ఉన్న పరందూర్ ప్రాంతంలో సారవంతమైన వ్యవసాయ భూములు, పర్యావరణ వ్యవస్థలు దెబ్బతింటాయని ఆందోళన చేపడుతున్న రైతులకు మొదటి నుంచీ మద్దతుగా నిలిచిన ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తాజాగా ఆ ప్రాజెక్ట్‌ను పూర్తిగా విరమిస్తున్నట్లు ప్రకటిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు.

## నెదర్లాండ్స్‌లో ఊబర్‌కు రూ.9245 కోట్ల జరిమానా

**ఆమ్‌స్టర్‌డామ్, ఆగస్టు 24:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిర్ణయంతో ఉద్యోగం కోల్పోవాల్సి వస్తే ఈ ప్రశ్న ఇప్పుడు యూరప్‌లో తీవ్రచర్చకు దారితీస్తోంది. డ్రైవర్ల ఖాతాలను నిలిపివేయడంలో ఆటోమేటెడ్ వ్యవస్థలను ఉపయోగించినందుకు ఊబర్‌కు భారీ జరిమానా పడింది. నెదర్లాండ్స్ డేటా ప్రొటెక్షన్ అథారిటీ ఊబర్‌పై 825 మిలియన్ యూరోల జరిమానా విధించింది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.9,245 కోట్లకు సమానం.

## వెంటిలేటర్ పేలి ముగ్గురు శిశువులు మృతి

**అమ్రావతి, ఆగస్టు 24:** మహారాష్ట్రలో ఘోర విషాదం చోటుచేసుకుంది. అమ్రావతిలోని జిల్లా మహిళా ఆసుపత్రిలో సోమవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. వెంటిలేటర్ పేలిన ఘటనలో నవజాత శిశువుల ఐసియులో చికిత్స పొందుతున్న ముగ్గురు పసికందులు దట్టమైన పొగకు ఊపిరాడక మృతి చెందారు. మరో ఆరుగురు శిశువులను రక్షించి, స్థానిక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

# అంతర్జాతీయ న్యాయ సేవలకు హైదరాబాద్ వేదిక

### ఎఐ ఆధారిత కేంద్రం ద్వారా వివిధ దేశాల న్యాయనిపుణుల సేవలకు అవకాశం

### సాంకేతిక ఆధారిత ప్రొఫెషనల్ సేవలకు హైదరాబాద్ అంతర్జాతీయ హబ్ : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** భారత్‌లోని వ్యక్తులు, వ్యాపార సంస్థలు, ప్రవాస భారతీయులు, పెట్టుబడిదారులు వివిధ దేశాల్లో న్యాయ సేవలు అందిస్తున్న న్యాయవాదులు, న్యాయ నిపుణులతో అనుసంధానం కావడానికి అంతర్జాతీయ ఎఐ ఆధారిత కవేటి కేంద్రం వేదికగా పనిచేయనుందనీ పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

అంతర్జాతీయ న్యాయ నైపుణ్యాన్ని కృత్రిమ మేధ సాంకేతికతతో అనుసంధానం చేస్తూ, వివిధ దేశాలకు సంబంధించిన న్యాయ సేవలను మరింత సులభంగా అందు బాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కవేటి ఇంటర్నేషనల్ ఏఐ ఫర్మ్ హైదరాబాద్ కార్యాలయాన్ని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, అంతర్జాతీయ న్యాయ నిపుణులు హైదరాబాద్‌కు వచ్చిన సందర్భాల్లో ప్రత్యక్ష సంప్రదింపులు, న్యాయ వ్యూహాలకు సంబంధించిన సమావేశాలు నిర్వహించే అవకాశాన్ని కూడా కల్పించనున్నారు.

అంతర్జాతీయ న్యాయ సేవలకు సంబంధించిన వినూత్న సంస్థ హైదరాబాద్‌లో కార్యకలాపాలు ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వృత్తిపరమైన సేవ లతో సహా అనేక రంగాల్లో కృత్రిమ మేధ వినియోగం వేగంగా విస్తరిస్తోందని, ఇది అపారమైన అవకాశాలను సృష్టి స్తూనే కొత్త సవాళ్లను కూడా ముందుకు తెస్తోం దన్నారు. అందువల్ల ఏఐ వినియోగంలో బాధ్యత, నైతిక విలువలు, పారదర్శ కత అత్యంత కీలకమని పేర్కొన్నారు.

బలమైన ఐటీ, సాంకేతిక వ్యవస్థ, అత్యున్నత నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచ దేశాలతో మెరుగైన అనుసంధానం హైదరాబాద్‌కు ప్రత్యేక బలాలని మంత్రి చెప్పారు. ఈ అనుకూలతలతో ఏఐ ఆధారిత ప్రొఫెషనల్, న్యాయ సేవలకు హైదరాబాద్ ఒక ప్రధాన అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగే సామర్థం కలిగి ఉందని పేర్కొన్నారు. తెలంగాణను అంతర్జాతీయ నైపుణ్యంతో అనుసంధానించే ఇటువంటి కార్యక్రమాలు రాష్ట్రానికి ప్రపంచస్థాయిలో మరింత గుర్తింపు తీసుకొస్తాయని అన్నారు. న్యూయార్క్‌లోని కవేటి లా ఫర్మ్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ అటార్నీ డాక్టర్ శ్రీనివాస్ రావు కవేటి, కవేటి ఇంటర్నేషనల్ ఏఐ ఫర్మ్‌ను హైదరాబాద్‌కు తీసుకు రావడాన్ని మంత్రి అభినందించారు.

తెలంగాణకు చెందిన డాక్టర్ కవేటికి భారత్‌తో పాటు అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా, కెనడా, యూఏఈ దేశాలకు సంబంధించిన అంతర్జాతీయ న్యాయ వ్యవహారాల్లో 35 సంవత్సరాలకు పైగా అనుభవం ఉందనీ కొనియాడారు.

సాంకేతిక పరిజ్ఞానం అంతి మంగా ప్రజలకు ఎదురయ్యే అడ్డంకులను తగ్గించడానికి, సేవల్లో సామర్థ్యాన్ని పెంచడానికి, ప్రత్యేక నైపుణ్యంతో కూడిన సేవలను మరింత విస్తృత వర్గాలకు చేరువ చేయడానికి ఉపయోగపడాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచస్థాయి ప్రొఫెషనల్ నెట్‌వర్క్‌లతో అనుసంధానించే ఇటువంటి సంస్థలు తెలంగాణను ఆవిష్కరణలు, విజ్ఞాన ఆధారిత సేవలకు అంతర్జాతీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దడంలో దోహదపడ తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# దేశ బొగ్గు గనుల ప్రమాదాల్లో రాష్ట్రంలోనే 70 శాతం ఘటనలు

### పార్లమెంట్‌లో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నివేదిక

**హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** 2025లో భారతదేశంలోని బొగ్గు గనుల ప్రమాదాలలో దాదాపు 70 శాతం తెలంగాణలోనే నమోదయ్యాయని పార్లమెంటులో విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. ఈ వివరాలు తెలంగాణ గనుల రంగంలో భద్రతా చర్యలపై ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి. 2025లో దేశంలోని తొమ్మిది బొగ్గు నిక్షేప రాష్ట్రాల్లోని బొగ్గు గనులలో నమోదైన 119 తీవ్రమైన ప్రమాదాలలో, ఒక్క తెలంగాణలోనే 80 ప్రమాదాలు నమోదయ్యాయి. 2023 నుండి 2025 వరకు కలిగిన కాలంలో జరిగిన సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. దేశవ్యాప్తంగా నివేదించబడిన 355 తీవ్రమైన బొగ్గు గని ప్రమాదాలలో 233, అంటే మొత్తం ప్రమాదాలలో దాదాపు మూడింట రెండు వంతులు, రాష్ట్రంలోనే నమోదయ్యాయి.

ఈ ప్రమాదాలలో 235 మంది కార్మికులు గాయపడ్డారు. గనుల మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, కార్మికులు పూర్తిగా దృష్టి లేదా వినికిడి కోల్పోవడం, ఎముకల విరుగుడుతో సహా శాశ్వత శారీరక వైకల్యం వంటి గాయాలకు గురయ్యారు. అలాగే ఎత్తు నుంచి పడిపోవడం, గాలిలో ఎగిరే వస్తువులు, పేలుడు పదార్థాల తాకిడి, కొండచరియలు విరిగిపడటం, తాళ్లు, గొలుసులు, సస్పెన్షన్ గేర్లు విఫల మవడం, ఇంకా డంపర్లు, డ్రిల్లింగ్ యంత్రాలు, విద్యుత్ కేబుళ్లకు సంబం ధించిన సంఘటనలు వంటి పలు అంశాలను ఈ ప్రమాదాలకు కారణాలుగా పేర్కొన్నారు. అదే కాలంలో, రాష్ట్రంలో ఘోరమైన ప్రమాదాలు కూడా గణనీయంగా నమోదయ్యాయి. 2023లో ఆరు ప్రమాదాల్లో ఆరుగురు మరణించగా, ఆ తర్వాత 2024లో ఎనిమిది, 2025లో ముగ్గురు మరణించారు. 2023 నుండి 2025 మధ్య దేశవ్యాప్తంగా బొగ్గు గనులలో నమోదైన 141 మరణాలలో 17 తెలంగాణలో సంభవించాయి.

# 27 నాటి ఓటరు గ్రామసభలు అత్యంత కీలకం

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

### దేశంలో ఎక్కడ లేనంతగా ఓట్ల తొలగింపు తెలంగాణలోనే జరుగుతోంది: మీనాక్షినటరాజన్

**హైదరాబాద్, ఆగస్టు 24,ప్రభాతవార్త:** ఓటర్ గ్రామ సభలు ఈ నెల 27న జరుగుతున్నాయననీ ఇది చాలా కీలకమైన ఘట్టం ఇందులో అర్హులై ఓటర్ల జాబితాలో లేనివారిని తిరిగి చేర్చడానికి సహజంగా ఉన్న అనుకూల అంశాలను ఉపయోగించుకోవాలని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం సర్‌పై జరిగిన జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతూ ఎక్కడ కూడా చిన్న నిరక్ష్యంగా కూడా ఉండొద్దని హెచ్చరించారు. గతంలో బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో జరిగిన సర్ కారణంగా అనేక మంది అర్హులు ఓటుల వేయలేకపోవడం వల్ల జరిగిన పరిణామాలను చూశామని తెలిపారు. మనం జాగ్రత్తగా లేకపోతే ఇక్కడ కూడా అనేక మంది వయోజనులు ఓటుహక్కు కోల్పోతే ప్రజాస్వామిక వ్యవస్థనే నష్టపోతుందని అప్రమత్తం చేశారు. అనామాలిస్, ఆన్ మ్యాపుడ్, ఆన్ డిజలైటయిడ్ ఓట్ల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రతి అర్హత కలిగిన ఓటును పరిశీలించి జాబితాలోకి వచ్చేలా చేయాలనీ, ఒక్క ఓటు కూడా నష్టపోవొద్దు అని అన్నారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జ్‌లు చాలా కీలకంగా పని చేయాలనీ కోరారు. డిసిసి అధ్యక్షులు పూర్తి స్థాయిలో ఈ పని అయ్యే వరకు ఎలాంటి అలసత్వం లేకుండా పనిలో నిమగ్నం కావాలనీ తెలిపారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్ మాట్లడుతూ దేశంలో ఎక్కడ లేనిఓట్లు తెలంగాణలోనే తొలగించబడు తున్నాయని ఆరోపించారు కాంగ్రెస్ ఓట్లను తొలగించే కుట్ర జరుగుతుందని ఆవేదన చెందారు. ఈ విషయంలో పూర్తి స్థాయిలో పని చేయాలనీ కోరారు,.బిఎల్‌ఏ తమ వద్ద సమగ్రమైన డేటాతో గ్రామ సభలలో పాల్గొని ప్రతి ఓటును పరిశీలించాలి మండల కమిటీలను ఈ నెలాఖరులోగా వేయాలి.సహకార సంఘాల కమిటీలను కూడా ప్రతిపాదనలు పూర్తి చేయాలనీతెలిపారు . ప్రజాస్వామిక వ్యవస్థపైనే బిజెపి కుట్ర చేస్తుందనీ ఆరోపించారు. ఎన్నికల కమిషన్ ను అడ్డు పెట్టుకొని రాజకీయాలు చేస్తుందనీ అన్నారు.ఇక్కడ మనం 2 శాతం ఓట్లతోనే గెలుచాము. కానీ ఇప్పుడు లక్షల ఓట్లను మాయం చేస్తున్నారు. ఇది చాలా ప్రమాదకరమైన అంశం ప్రతి ఒక్కరు సీరియస్ గా పని చేయాలి.. ఒక్క ఓటు కూడా నష్టపోవొద్దు. ఇంకా సమావేశంలో ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్, సర్ కో ఆర్డినేటర్ గంప వేణుగోపాల్, టిపిసిసి ఎన్నికల కమిషన్ ఛైర్మన్ రాజేష్ తదితరులు మాట్లాడారు..

# కొంపల్లిలో శ్రీనివాస్‌రావు ద్వాదశ దినకర్మ

### హాజరైన మాజీ సిఎం కెసిఆర్



జోగినిపల్లి శ్రీనివాస్‌రావు ద్వాదశ దినకర్మకు హాజరైన కెసిఆర్

**హైదరాబాద్ (కొంపల్లి), ఆగస్టు 24, ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని కొంపల్లిలో మాజీ ముఖ్య మంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ తన బావ మరిది జోగినిపల్లి శ్రీనివాస్ రావు ద్వాదశ దినకర్మ కార్యక్రమానికి కుటుంబ సమేతంగా హాజరై బావమరిది కుటుంబ సభ్యులను పరా మర్శించి ఓదార్చారు. శ్రీనివాస్‌రావు మృతికి సంతాపం వ్యక్తం చేసిన కెసిఆర్, ఆయన కుటుంబసభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. కుటుంబసభ్యుల బాధను పంచుకుంటూ వారికి అం డగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమా నికి కుటుంబసభ్యులు, బంధువులు, కార్యకర్తలు, సన్నిహితులు హాజరై శ్రీనివాస్‌రావుకు నివాళులర్పించారు.

### బిజెపి లడాయి అంటూ నీట్ వైఫల్యంతో

# బడాయికి పోవడం తగదు

### ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్, ఆగస్టు 24,ప్రభాతవార్త:** ఫీజు బకాయి బిజెపి లడాయి అంటు నీట్ పరీక్ష నిర్వహణలో వైఫల్యం చెందిన ఆ పార్టీ బడాయికి పోతోందనీ ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం సిఎల్‌పిలో ఆయన విలేఖరులో మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్ మెంట్ పైన రామచందర్ రావు నిరాహార దీక్ష చేస్తానని హడావుడి చేస్తున్నాడనీ ఆరోపించారు.. గత ప్రభుత్వం 8 వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెట్టిందనీఆవేదన చెందారు.. బిజెపి నాయకులు గత పదేళ్లలో ఎందుకు నిరాహారదీక్షలు చేయలేదు..? అని అడిగారుఎందుకు కెసిఆర్ పైన పోరాటాలు చేయలేదు.. కెసిఆర్ పెట్టిన బకాయిల గురించి ఎందుకు మాట్లాడటం లేదనీ అడిగారు.

మా ప్రభుత్వాన్నే ఎందుకు బదనాం చేస్తున్నా రని నిలదీశారు. ఫీజు రీయింబర్స్ పైన మా ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు పోతోందపీ.. ప్రతి యేడాది ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం 2300 కోట్ల రూపాయల అవసరం ఉందనీతెలిపారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ బల్మూరివెంకట్ మాట్లాడుతూ అసలు విద్యార్థుల గురించి మాట్లాడే నైతిక హక్కు, అర్హత బిజెపికి ఉందా..?అని ప్రశ్నించారు.నీట్ పేపర్ లీక్ అయి అనేక మంది విద్యార్థులు చనిపోతే అప్పుడు మీ లడాయి ఎక్కడికి పోయింది..? అని అడిగారు. దేశంలో న్యాయం కోసం జనజీ లడాయి చేస్తుంటే లాఠీచార్జ్ చేయించింది మీరు కాదా? అని ఆవేదన చెందారు.

# కులగణనతోనే బిసిలకు న్యాయం

### కేంద్రం కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎంపి వి.హనుమంతరావు దీక్ష



ధర్నాలో నినాదాలు చేస్తున్న బిసి నేతలు

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 24, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా జనగణనలో కులగణన జరిగితేనే బీసీలకు న్యాయం జరుగుతుందని మాజీ ఎంపీ వి.హనుమంతరావుతోపాటు పలువురు వక్తలు స్పష్టం చేశారు. సోమవారం బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు తెలంగాణ తొలి స్పీకర్, శాసన మండలి సభాపక్షనేత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, మాజీ డీజీపీ పూర్ణచందం రావు, బీసీ మేధావుల ఫోరం ఛైర్మన్ టి.చిరంజీవులు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాలగోని బాలరాజ్‌గౌడ్, బీసీ జాక్ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్, వైస్ ఛైర్మన్ గుజ్జ కృష్ణ తదితరులు హాజరై మద్దతు తెలిపారు. ఈ దీక్షనుద్దేశించి హనుమంతరావు మాట్లాడుతూ కేంద్రం జనగణనలో కులగణన చేపట్టటంలో ఎస్సీ ఎస్టీల పేరిట ప్రత్యేక కాలం కేటాయించారని, బీసీలకు మాత్రం ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. బీసీలకు న్యాయం జరిగేవరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి, బీసీ కులగణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకువస్తానని స్పష్టం చేశారు. మధుసూదనాచారి మాట్లాడుతూ గత 80 సంవత్సరాలుగా బీసీలు అగ్రవర్ణాల పాలనలో మోసపోతున్నారని, బీసీల ఓట్లు దండుకుంటూ బీసీలకు అన్ని రంగాలలో అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టే విషయంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ దేశంలో జంతువులకు, చెట్లకు సహితం లెక్కలు ఉంటాయి కానీ బీసీలకు మాత్రం లెక్కలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. దీక్షా కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోల జనార్ధన్, యువజన అధ్య క్షులు శ్యాంకురుమ, పొలిటికల్ ఫ్రంట్ వైస్ ఛైర్మన్ దుర్గయ్యగౌడ్, కన్వీనర్ బైరి శేఖర్, గొర్రెల మేకల అభివృద్ధి సంస్థ కార్పోరేషన్ ఛైర్మన్ సరిత, వడ్డెర కార్పోరేషన్ ఛైర్మన్ గుంజా రేణుక, వివిధ సంఘాల నేతలు, కుల సంఘాల నేతలు, బీసీలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# సన్న వరి బోనస్ కోసం సెప్టెంబరు 10లోపు నమోదు

### బిల్లుల కోసం రైతుల అవస్థలు

**హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం సన్న వడ్లకు సంబంధించి క్వింటాకు రూ.500 బోనస్ పథకంలో కీలక మార్పులు తీసుకొచ్చింది. అక్రమాలను అరికట్టి నిజమైన లబ్ధిదారులకు మేలు చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది. అయితే కొత్తగా విధించిన నిబంధనలు క్షేత్రస్థాయిలో రైతులకు తీవ్ర అయోమయాన్ని, ఆందోళనను కలిగిస్తున్నాయి. రైతులు తాము విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణాలకు వెళ్లి ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, కొనుగోలు బిల్లు సమర్పించి సెప్టెంబర్ 10వ తేదీలోగా తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు ఆదేశించారు.

దీంతో నెల రోజుల కిందటే విత్తనాలు కొనుగోలు చేసినందున ఇప్పుడు పాత బిల్లులు దొరకక, దుకాణాల చుట్టూ తిరగలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలాచోట్ల వ్యాపారుల వద్ద రికార్డులు లేకపోవడంతో వాగ్వాదాలు జరుగుతున్నాయి. మరోవైపు మార్కెట్లో లభించే ఇతర రకాల సన్న వరిని సాగు చేసిన రైతులు తమకు బోనస్ వర్తించకపోవడంపై నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సొంతంగా విత్తనాలు ఉత్పత్తి చేసుకుని సాగు చేసిన రైతులు కూడా ఏ దుకాణంలో నమోదు చేసుకోవాలో తెలియక గందరగోళానికి గురయ్యారు.

అయితే సొంత విత్తనాలు వాడిన రైతులు దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, స్థానిక వ్యవసాయ అధికారులకు సొంత డిక్లరేషన్ రాసి ఇస్తే సరిపోతుందని ఆ శాఖ రాష్ట్ర అధికారులు చెబుతున్నారు. అయితే సెప్టెంబర్ 10 లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. మరోపక్క ఈ బోనస్ సొమ్ము అందాలంటే ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్దేశించిన 7 రకాల సన్న వరి విత్తనాలను మాత్రమే సాగు చేసి ఉండాలి.

అందులో ఆర్‌ఎస్‌ఆర్ 15048 (తెలంగాణ సోనా), కేఎన్‌ఎం 1638 (కూనారం వరి2), జైశ్రీరామ్, కేఎన్‌ఎం 7715, బీపీటీ 5204 (సాంబమసూరు), హెచ్‌ఎంటీ సోనా, డబ్ల్యూజీఎల్44 (సిద్ధి) రకాలను మాత్రమే సాగు చేయాల్సి ఉంటుంది.



### ఒసాకా-తెలంగాణ మధ్య నైపుణ్యాభివృద్ధిపై

# అవగాహనకు ప్రతిపాదన

### జపాన్‌లో ఉద్యోగాలకు శిక్షణ.. మరింత విస్తరించేందుకు కసరత్తు

### ఒసాకా వైస్‌గవర్నర్ యమగుచి, బృందంతో మంత్రి వివేక్‌వెంకటస్వామి భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** జపాన్ సాంకేతికత, నైపుణ్యాలను తెలంగాణ యువతకు అందించడంతోపాటు రాష్ట్ర యువతకు జపాన్‌లో మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఒసాకాతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని శక్తి (కార్మిక, ఉపాధి, శిక్షణ ఫ్యాక్టరీలు) గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. జపాన్ పర్యటనలో భాగంగా ఒసాకా వైస్ గవర్నర్ యమగుచి, ఆయన బృందంతో మంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ-ఒసాకా మధ్య నైపుణ్యాభివృద్ధి, జపనీస్ భాషా శిక్షణ, ఉపాధి అవకాశాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందించే అంశాలపై చర్చించారు.తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, రాష్ట్ర ప్రభుత్వ సంస్థ టామ్‌కామ్ ద్వారా జపాన్‌లో ఉద్యోగాలు చేయాలనుకునే యువతకు ఇప్పటికే జపనీస్ భాషలో శిక్షణ అందిస్తున్నామని మంత్రి వివరించారు. ఈ శిక్షణను మరింత విస్తృతం చేయడంతోపాటు జపాన్ పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక, వృత్తి నైపుణ్యాలను కూడా అందించాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణలో పెద్ద సంఖ్యలో ఇంజినీరింగ్ పట్టభద్రులు ఉన్నారని మంత్రి తెలిపారు. వారి విద్యార్హతలకు జపాన్ పరిశ్రమల అవసరాలను జోడించి శిక్షణ అందిస్తే ఇరు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. నైపుణ్య శిక్షణ, జపనీస్ భాష, పరిశ్రమల అవసరాలపై పరస్పర సహకారంతో తెలంగాణ యువతకు జపాన్‌లో మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు.హైదరాబాద్‌లోని జపాన్ డెస్క్ ద్వారా వీసా ప్రక్రియ, విద్యార్థులు-యువతకు అవసరమైన సమాచారం, ఇరు దేశాల మధ్య సమన్వయం జరుగుతోందని మంత్రి తెలిపారు. ఈ వ్యవస్థను మరింత సమర్థంగా వినియోగించుకుని తెలంగాణ-జపాన్ మధ్య విద్య, నైపుణ్యం, ఉపాధి రంగాల్లో సంబంధాలను బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. తెలంగాణ-ఒసాకా మధ్య స్నేహ సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లడంతోపాటు నైపుణ్యాభివృద్ధి రంగంలో పరస్పర అవగాహన, సహకారాన్ని పెంచుకోవాలని మంత్రి ప్రతిపా దించారు. జపాన్‌లోని నైపుణ్య శిక్షణ విధానాలు, పరిశ్రమ-విద్యాసంస్థల అనుసంధానం వంటి అంశాల నుంచి తెలంగాణ యువతకు ప్రయోజనం కలిగేలా కార్యక్రమాలు చేపట్టేందుకు కలిసి పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఒసాకా ప్రతినిధులతో పాటు శక్తి శాఖ కార్యదర్శి హరిచందన, టామ్‌కామ్ జిఎం నాగభారతి తదితరులు పాల్గొన్నారు.

# సిఎంఆర్ కోసం పారదర్శక బాధ్యతావ్యవస్థ ఏర్పాటు చేయాలి

### కస్టమ్‌మిల్డ్ రైస్ అవినీతికి మిల్లర్లు అధికారులు సమష్టి బాధ్యతలు

### రాష్ట్ర రైస్‌మిల్లింగ్ భవిష్యత్‌పై రౌండ్‌టేబుల్ సమావేశం

**హైదరాబాద్, ఆగస్టు 24,ప్రభాతవార్త:** వరిధాన్యం సేకరణలో సగటు నాణ్యత ప్రమాణలు పాటిస్తూ పారదర్శక బాధ్యతాయుతమైన వ్యవస్థ సిఎంఆర్ కోసం ఏర్పాటు చేసుకోవాలని కస్టమ్ మిల్డ్ రైస్ అవినీతికి మిల్లర్లు అధికా రులను కూడా సమష్టి బాధ్యులుగా చేయాలని తెలంగాణ రైసుమిల్లు అసోసియేషన్ ప్రతినిధి పాడి గణపతిరెడ్డి తెలిపారు. సోమవారం తెలంగాణ రైస్‌మిల్లింగ్ భవిష్యత్ రౌండ్‌టేబిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జమ్ముకాశ్మీర్ మాజీ డిజిపి ఎస్‌గోపాల్‌రెడ్డి, భారతవైమానిక దళం కెప్టెన్ సురేష్‌రెడ్డి రిటైర్డు ఐఎఫ్‌ఎస్ పికెఝా, హైకోర్టు అడ్వకేట్లు కే వేణుమాధవర్, పి.దేవేందర్, సాయికృష్ణ, సామాజిక రాజకీయ వ్యాఖ్యాత సయ్యద్ రఫీ ఆధ్వర్యంలోరౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రౌండ్‌టేబుల్ సమావేశం తీసుకొన్న 15 కీలక నిర్ణయాలను పాడి గణపతిరెడ్డి విలేఖరులకు వివరిస్తూ రైస్ మిల్లర్ల సమస్యలు, సిఎంఆర్ ధాన్యం సేకరణ వాటి నిల్వల ఖాతాల పరిష్కా రానికి సంబం ధించిన ఫిర్యా దులను స్వీకరించి, కాలపరి మితిలో పరిష్కరించే ప్రత్యేక సంస్థాగత వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం అభిప్రాయ డ్డదని తెలి పారు. ప్రతి సీజన్‌లో ప్రతి వరి రకానికి శాస్త్రీయ టెస్ట్ మిల్లింగ్ నిర్వహించి, వాస్తవ రికవరీ ఆధారంగా మిల్లింగ్ నిష్పత్తిని నిర్ణయించాలని శాస్త్రీయ ఆధారం లేని ఏకరీతి వంద క్వింటాళ్ళ ధాన్యంకు 65 నుంచి 68 కిలోలు బియ్యం ఇవ్వాలనే నిష్పత్తులను బలవంతంగా అమలు చేయకూడదనీ అన్నారు. ప్రభుత్వం ముఖ్యంగా సివిల్‌సప్లయ్‌శాఖ కార్పోరేషన్, ఎఫ్‌సిఐ సంస్థల కారణంగా బియ్యం తరలింపులో జాప్యం జరిగితే, ఆ జాప్యంతో ఏర్పడే నిల్వ, అద్దె, డెమరేజ్, హ్యాండ్లింగ్ తదితర డాక్యుమెంటెడ్ ఖర్చులను ప్రభుత్వం భరించాలనీ మిల్లరు తీర్మానించారు.

ప్రస్తుత మిల్లింగ్ ఛార్జీలను తక్షణమే పునఃసమీక్షించి, కార్మిక, విద్యుత్, యంత్రాల నిర్వహణ, నిల్వ, రవాణా, ద్రవ్యో ల్బణం, వర్కింగ్ క్యాపిటల్ తదితర వాస్తవ వ్యయాలకు అనుగుణంగా సవరించి, పొరుగు రాష్ట్రాల్లో అమలులో ఉన్న రేట్లను కూడా పరిగణనలోకి తీసుకోవాలనీ తెలిపారు. రైస్ మిల్లర్లు ఎవరైన ఉద్దేశ పూర్వకంగా మోసం, స్టాక్ మళ్లింపు వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలనీ అంతేకాకుండా దానికి పాత్రధారులైన ప్రభుత్వ అధికారులను కూడా బాధ్యులుగా చేయాలనీ నిజమైన పరిపాలనా లేదా కార్యకలాప సమస్యలను ఎదుర్కొంటున్న మిల్లర్లకు మాత్రమే పరిమితం చేయకూడదని తెలిపారు.



### క్లాస్ రూమ్స్ నుండి పొలాల్లోకి వ్యవసాయ్య వర్సిటీ వినూత్న ప్రయోగం

# రైతుల దత్తత.. అన్నదాతలకు విద్యార్థుల అండ

**హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** తరగతి గదులకే పరిమితం కాకుండా నేరుగా బురద పొలాల్లోకి దిగారు వ్యవసాయ విద్యార్థులు. పుస్తకాల్లో చదివిన థియరీ పాఠాలను క్షేత్రస్థాయిలో ఆచరణలో పెడుతూ అన్నదాతలకు అండగా నిలుస్తున్నారు. పొలంలో దిగి రైతుల కష్టనష్టాలను స్వయంగా తెలుసుకుంటూనే, లాభదాయక సాగుకు బాటలు వేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో అగ్రికల్చర్ విద్యార్థులు చేస్తున్న ఈ వినూత్న ప్రయోగం ఇప్పుడు సర్వత్రా ఆసక్తి రేకెత్తిస్తోంది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన సుమారు 50 మంది విద్యార్థులు ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చందుర్తి, కోనరావుపేట, బోయినపల్లి మండలాల్లోని దాదాపు 11 గ్రామాల్లో వీరు విస్తృతంగా క్షేత్ర పర్యటనలు చేస్తున్నారు. రైతులను నేరుగా దత్తత తీసుకుని ఐదు నెలల సుదీర్ఘ కాలం పాటు వారితో మమేకమై పల్లెల్లోనే పనిచేస్తున్నారు. అగ్రికల్చర్ బీఎస్సీ నాలుగో సంవత్సరం చదువుతున్న వీరంతా గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా పల్లెలకు చేరుకున్నారు. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ ఆర్. సాయికుమార్ పర్యవేక్షణలో విద్యార్థులు ప్రతిరోజూ ఉదయాన్నే పొలాలకు వెళ్తున్నారు. అక్కడ రైతులు అనుసరిస్తున్న పంటల సాగు విధానాలను నిశితంగా పరిశీలిస్తూ, తెగుళ్లు, పురుగుల ఉధృతితో పాటు మొక్కల్లో పోషక లోపాలను శాస్త్రీయంగా గుర్తిస్తున్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కేవలం వరిపైనే ఆధారపడటాన్ని తగ్గించాలన్నది ఈ క్షేత్రస్థాయి కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. వర్షాభావ పరిస్థితులను తట్టుకుని తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల సాగుపై అన్నదాతలకు పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తున్నారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ పామ్, మొక్కజొన్న, పత్తి, నువ్వులు, కందులు లాంటి వాణిజ్య పంటలను పరిస్థితులకు అనుగుణంగా ఎంచుకోవాలని రైతులకు సూచిస్తున్నారు. పంట మార్పిడిపై విద్యార్థులు చేస్తున్న అవగాహనకు కొంతమంది రైతుల నుంచి స్పందన కూడా వస్తోంది. తడగొండలో ఇప్పటికే 30 మందికి పైగా రైతులు ఆయిల్పామ్ సాగుపై సానుకూలంగా స్పందించినట్లు విద్యార్థులు తెలిపారు. గ్రామానికి చెందిన రైతు ఆయిలాపురం వెంకటరమణ మాట్లాడుతూ వ్యవసాయ విద్యార్థులు, రైతు విజ్ఞాన కేంద్రం ద్వారా పంటల సాగు, దిగుబడి పెంపు,ప్రత్యామ్నాయ పంటలపై గత కొంతకాలంగా ఉపయోగకరమైన సమాచారం అందుతోందని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో ఒకే పంటపై ఆధారపడటం వల్ల ఎదురయ్యే నష్టాలను విద్యార్థులు వివరిస్తున్నారు. నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో రైతులు మళ్లీ వరి వైపే మొగ్గు చూపుతుండటంతో విద్యార్థులు సరికొత్త వ్యూహం అనుసరిస్తున్నారు. కేవలం పంట మార్పిడి చేయమని ఉపన్యాసాలు ఇవ్వకుండా, ఆర్థిక లావాదేవీలపై స్పష్టమైన లెక్కలు కట్టి వివరిస్తున్నారు.

ఒక నిర్ణీత పంట వేస్తే పెట్టుబడి ఎంత అవుతోంది, దిగుబడి ఎలా వస్తుంది, ఖర్చులు పోను చేతికి నికర లాభం ఎంత మిగులుతుందనే వాస్తవాలను రైతుల కళ్లముందు ఉంచుతున్నారు. బోయినపల్లి మండలం తడగొండ గ్రామంలో వ్యవసాయ విద్యార్థినులు సాయిచందన, నివేదిత, కిరణ్, వర్షిణి, నిరంజన చేపట్టిన ఫీల్డ్ సర్వేలో పలు ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. ఆ గ్రామంలోని మొత్తం 1,998 ఎకరాల సాగుభూమిలో ఏకంగా 75 శాతం విస్తీర్ణంలో వరే సాగవుతున్నట్లు వీరు తమ సర్వేలో గుర్తించారు. మిగిలిన విస్తీర్ణంలో సాగవుతున్న పత్తిలో విల్టింగ్ లక్షణాలు, త్రిప్స్, ఆఫిడ్స్, జాసిడ్స్ లాంటి ప్రమాదకర పురుగుల ఉధృతిని గమనించి తగిన నివారణా చర్యలు సూచించారు.

అగ్రికల్చర్ విద్యార్థులు చూపిస్తున్న చొరవకు సాధారణ రైతుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. తడగొండ గ్రామంలో ఇప్పటికే 30 మందికి పైగా రైతులు ఆయిల్ పామ్ సాగు చేయడానికి సానుకూలంగా ఆసక్తి కనబరిచారు. కేవలం సలహాలు ఇవ్వడానికే పరిమితం కాకుండా విద్యార్థులు పొలాల్లో పలు ప్రయోగాలు కూడా చేసి చూపిస్తున్నారు. ఐదు లీటర్ల బకెట్ నీటిలో క్లీన్ రైస్ పౌడర్ కలిపి, ఆ ద్రావణాన్ని 95 లీటర్ల నీటిలో కలిపి వరి నారు వేర్లను 20 నిమిషాల పాటు అందులో ముంచాలి. ఇలా చేసిన తర్వాత నాట్లు వేస్తే నారుకు అద్భుతమైన రోగనిరోధక శక్తి వస్తుందని విద్యార్థులు ఆచరణాత్మకంగా నేర్పించడంతో రైతులు సైతం ఆ పద్ధతులను పాటిస్తున్నారు.

# నాటిన ప్రతి మొక్కను అపురూపంగా రక్షించాలి

## వన మహోత్సవంపై కలెక్టర్లతో మంత్రి కొండా సురేఖ జూమ్ సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు24:** నాటిన ప్రతి మొక్కను భవిష్యత్ తరాలకు ప్రాణవాయువును అందించే జీవనదాతగా భావించి, పొత్తిళ్లలో పెట్టుకుని కాపాడుకున్నంత అపురూపంగా వాటిని సంరక్షి ంచాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు.
ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సెప్టెంబర్ చివరి నాటికి ఎలాగైనా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని పూర్తిచేసేలా పకడ్బందీ కార్యాచరణను చేపట్టాలని వారికి నిర్దేశించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం (ఆగస్టు 25న) నిర్వహించనున్న ప్రత్యేక వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారుల (డిఎఫ్ఓలు)తో సోమవారం మంత్రి కొండా సురేఖ సన్నాహక సమావేశం నిర్వహించారు.
జూబ్లిహిల్స్ లోని తన నివాసం నుంచి జూమ్ వేదిక ద్వారా సమావేశంలో పాల్గొని, ప్రత్యేక వనమహోత్సవం కార్యక్రమం సందర్భంగా జిల్లాల వారీగా చేపట్టిన ఏర్పాట్లు, పురోగతిపై సమీక్షి ంచారు. అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీం, పిసిసిఎఫ్(హెచ్ఓఎఫ్ఎఫ్) వినయ్ కుమార్, పిసిసిఎఫ్ రత్నాకర్ జౌహరి(డెవలప్ మెంట్), సిసిఎఫ్ ప్రియాంక వర్గీస్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ కమిషనర్ శ్రీలక్షి ్మ, సిఎఫ్ ప్రదీప్ షెట్టి, హైదరాబాద్ డిఎఫ్ఓ శ్రీనివాస్ తదితరులు అరణ్య భవన్ నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు.
వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు జిల్లాల కలెక్టర్లతో మంత్రి నేరుగా మాట్లాడారు. ప్రత్యేక వనమహోత్సవం నిర్వహణకు చేసిన ఏర్పాట్లను, గ్రామం, మండలం, జిల్లాల వారీగా చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్లు, డిఎఫ్ఓలు మంత్రికి వివరించారు.
నాటిన మొక్కల సంరక్షణకు చేపడుతున్న చర్యలు, మొక్కలు నాటేందుకు కొత్తగా గుర్తించిన ప్రాంతాలు, జియో ట్యాగింగ్, వర్షపు నీటి సంరక్షణ, నేల తేమను పెంచడానికి ఉద్దేశించిన కందకాలు తీయడం, రాతికట్టల నిర్మాణం, చెక్ డ్యాముల ఏర్పాటు తదితర అంశాలపై కలెక్టర్లు, డిఎఫ్ఓలు మంత్రికి వివరాలు వెల్లడించారు. 2026 వనమహోత్సవ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 16.06 కోట్ల మొక్కలను నాటాలని లక్ష ్యంగా పెట్టుకోగా, 23 ఆగస్టు 2026 నాటికి 9.06 కోట్ల మొక్కలను నాటినట్లు అటవీ ఉన్నతాధికారులు మంత్రి సురేఖ గారికి స్పష్టం చేశారు.



# బ్రిక్స్ సమావేశం కోసం భారత్‌కు వస్తున్న జిన్‌పింగ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** ఢిల్లీలో సెప్టెంబర్‌లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలలో పాల్గొనేందుకు భారత్‌కు వస్తున్న జిన్‌పింగ్ తనవెంట మెగా ప్రతినిధి బృందాన్ని కూడా తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశాలకు సభ్య దేశాలను భారత్ ఆహ్వానించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌సైతం రాబోతున్నారు. అయితే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వస్తున్నారా లేదా అన్నది ఇప్పటి దాకా తేలలేదు. తాజాగా భారీ బృందంతో భారత్‌కు వస్తున్నట్లుగా రాయిటర్స్ తెలిపింది. డోక్లాం ఘర్షణ తర్వాత దాదాపు ఏడేళ్ల తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రాబోతున్నారు. దీంతో బ్రిక్స్ సమావేశాలు అంత ర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకోనున్నాయి. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో జరగనున్నాయి. జిన్‌పింగ్ వచ్చే నెలలో బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఢిల్లీకి వస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ పర్యటన ముఖ్యమైనదని భారత్‌చైనా మధ్య మెరుగు పడుతున్న సంబంధాలకు సంకేతమని రాయిటర్స్ పేర్కొంది. జిన్‌పింగ్ హాజరు ఎంత ముఖ్యమైనదంటే బ్రిక్స్ సదస్సు కంటే ఆయన గురించే ఎక్కువగా చర్చ జరిగే అవకాశం ఉంది. ఇరు దేశాలు ఇటీవల కొన్ని చర్చలు జరిపాయి. ఈ సమయంలో అజిత్ దోవల్ కూడా చైనాలోనే ఉన్నారు. పలు ముఖ్యమైన చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ఈగల్‌లో ఇంటి దొంగలు

### నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న

### డ్రగ్స్‌ను స్మగ్లర్లకు విక్రయించిన ఇద్దరు కానిస్టేబుళ్లు?

### కొనసాగుతున్న విచారణ.. విధులకు దూరంగా జవాన్లు

**హైదరాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడికి విశేషంగా కృషి చేస్తున్న ఈగల్ పోలీసు విభాగంలో ఇంటి దొంగల హల్‌చల్ సంచలనం రేపింది. ఒక డెకాయ్ ఆపరేషన్‌లో పట్టుకున్న కోట్లాది రూపాయల విలువచేసే సింథటిక్ డ్రగ్స్‌లో 50 లక్షల రూపాయల విలువ చేసే డ్రగ్స్‌ను ఇద్దరు కానిస్టేబుళ్లు స్మగ్లర్ల పరం చేసినట్లు హైదరాబాద్ నార్కోటిక్ వింగ్ తేల్చినట్లు తెలిసింది. ఒక కేసులో పట్టుబడ్డ స్మగ్లర్‌ను విచారిస్తున్న క్రమంలో ఈగల్ పోలీసుల గోల్‌మాల్ వ్యవహారం రట్టయినట్లు తెలిసింది. సింథటిక్ డ్రగ్స్ ఫ్యాక్టరీలో పట్టుబడ్డ కోట్ల రూపాయల సింథటిక్ డ్రగ్స్‌లో కొంత భాగాన్ని ఇద్దరు కానిస్టేబుళ్లు వేరే ముఠాకు చెందిన స్మగ్లర్లకు ఇచ్చినట్లు పోలీసుల విచారణలో తేలిందని సమాచారం. ఈ కేసులో ఇద్దరు కానిస్టేబుళ్లను విధులకు దూరంగా వుంచిన పోలీసులు ఈ గోల్‌మాల్‌లో ఇంకా ఎవరైనా వున్నారా...? అనే కోణంలో విచా రిస్తున్నారు. దీనిపై ఒకటి రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెలుగుచూసే వీలుంది.

## నేడు గాంధీభవన్‌లో బిపి మండల్ జయంతి

**హైదరాబాద్,ఆగస్టు 24,ప్రభాతవార్త :** గాంధీ భవన్‌లో మంగళవారం ఉదయం 10:00 గంటలకు బి.పి. మండల్ ప్రసాద్ యాదవ్ 108 వ జయంతి టిపిసిసి ఒబిసి డిపార్టుమెంట్ నిర్వహిస్తున్నారు. పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయగలనీ టిపిసిసి ఒబిసి సెల్ కోరింది. ఒబిసి హక్కులు, ఆత్మగౌరవం సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న ప్రతి వెనుకబడిన తరగతి పౌరులు తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పత్రికా ప్రకటనలో కోరారు.

## 72 మంది న్యాయవాదుల ఛాంబర్ల కూల్చివేతపై విచారణకు సుప్రీం ఓకే



**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** లక్నో జిల్లా కోర్టు సమీపంలోని ప్రభుత్వ భూమిని ఆక్ర మించి నిర్మించారనే ఆరోప ణలు ఎదుర్కొంటున్న న్యాయవాదుల ఛాంబర్ల కూల్చివేతకు సంబంధించి అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారణకు జాబితా చేసేందుకు సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ అంశాన్ని పరిశీలించింది. కూల్చివేతకు సంబంధించి ఇప్పటికే నోటీసులు జారీ అయ్యాయని, ఆగస్టు 30న కూల్చివేత చర్యలు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై సీజేఐ సూర్యకాంత్ స్పందిస్తూ, ఈ అంశంపై అలహాబాద్ హైకోర్టును ఎందుకు ఆశ్రయించలేదని న్యాయవాదిని ప్రశ్నించారు. అయితే కూల్చివేతకు ఆదేశాలు ఇచ్చింది కూడా హైకోర్టేనని న్యాయవాది సమాధానమిచ్చారు."అవి అనధికారికంగా నిర్మించిన ఛాంబర్లే అయి ఉండాలి" అని సీజేఐ వ్యాఖ్యానించారు. అయితే న్యాయవాది స్పందిస్తూ సదరు ఛాంబర్లు సుమారు 40 ఏళ్లుగా అక్కడ ఉన్నాయని తెలిపారు. దీనిపై మేం పరిశీలిస్తామని సీజేఐ పేర్కొన్నారు. అయితే పిటిషన్‌ను ఏ తేదీన విచారణకు తీసుకుంటారనే విషయాన్ని ధర్మాసనం స్పష్టం చేయలేదు.ఇదే సమయంలో కూల్చివేత నోటీసులకు న్యాయవాదులు తమ సమాధానాలను దాఖలు చేసుకోవచ్చుని సీజేఐ సూచించారు. అయితే నోటీసులు జారీ చేయడం వెనుక ఉద్దేశం కూల్చివేత చర్యలను కొనసాగించడమేనని పిటిషనర్ల తరఫు న్యాయవాది తెలిపారు.



## ఇరాన్‌లో భారీ గ్యాస్ నిక్షేపాలు

**టెహ్రాన్, ఆగస్టు 24:** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితులు ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న చమురు డిమాండ్ నేపథ్యంలో తాజాగా ప్రపంచ దేశాలకు ఇరాన్‌నుంచి భారీ ఉపశమనం లభిస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో యుద్ధం కారణంగా తీవ్రంగా సతమతం అవుతున్న ఇరాన్‌కు భారీ ఉపశమనం కలిగించే వార్త ఒకటి వచ్చింది. అమెరికా ఆంక్షలతోపాటు. ఇంధన ఎగుమతులపై ఆంక్షలు, యుద్ధ పరిస్థితులతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న ఇరాన్‌కు భారీ గ్యాస్ నిక్షేపం వెలుగులోకి రావడం ఊరటనిచ్చే పరిణామంగా మారింది. దక్షిణ ఫార్స్ ప్రావిన్స్‌కు సమీపంలోని ఓ గ్యాస్ క్షేత్రంలో ఏకంగా 7.5 ట్రిలియన్ క్యూబిక్ ఫీట్లకు పైగా సహజ వాయువు ఉన్నట్లు గుర్తించినట్లు ఇరాన్ చమురు మంత్రి మొహ్సెన్ పక్నేజాద్ వెల్లడించారు. ఈ చమురు నిక్షేపాలను వాణిజ్యపరంగా వినియోగించుకోవడం ఇరాన్‌కు అంత సులభం కాదని నిపుణులు భావిస్తున్నారు.
ఇప్పటికే ప్రపంచంలోనే అత్యధిక సహజ వాయువు నిల్వలు కలిగిన దేశాల్లో ఇరాన్ ఒకటిగా కొనసాగుతోంది. దేశీయంగా గ్యాస్ వినియోగం అధికంగా ఉండటంతో పాటు పాతబడిన మౌలిక వసతులు, విదేశీ పెట్టుబడులపై ఆంక్షలు, ఆధునిక టెక్నాలజీ వంటి సమస్యలు ఇరాన్ ఇంధన రంగాన్ని తీవ్రంగా వేధిస్తున్నాయి. తాజాగా గుర్తించిన నిక్షేపం ఈ పరిస్థితుల్లో ఇరాన్‌కు దీర్ఘకాలికంగా కీలకంగా మారే అవకాశం ఉంది. ఆ గ్యాస్‌ను వెలికితీసి మార్కెట్‌కు తీసుకురావడానికి భారీ పెట్టుబడులు, ఆధునిక డ్రిల్లింగ్ టెక్నాలజీ కావాల్సి ఉంటుంది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో అంతర్జాతీయ సంస్థల నుంచి పెట్టుబడులు, టెక్నికల్ సహకారం పొందడం ప్రస్తుతం ఇరాన్‌కు సవాలుగా మారింది. తాజా ప్రకటనకు ముందు గతేడాది అక్టోబర్‌లో దక్షిణ ఇరాన్‌లోని పజాన్ గ్యాస్ ఫీల్డ్‌లో 10 ట్రిలియన్ క్యూబిక్ ఫీట్ల గ్యాస్ ఉన్నట్లు తేలింది. కనీసం 200 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు కూడా ఉన్నట్లు ఇరాన్ ప్రకటించింది. అందులో సుమారు 7 ట్రిలియన్ క్యూబిక్ ఫీట్ల గ్యాస్‌ను వెలికితీయగలమని అంచనా వేసింది. అక్కడ ఉత్పత్తి ప్రారంభించేందుకు దాదాపు 40 నెలలు పట్టవచ్చ అప్పట్లోనే ఇరాన్ అధికారులు తెలిపారు.

# గంట వర్షానికే గురుగ్రామ్ అతలాకుతలం

**గురుగ్రామ్, ఆగస్టు 24:** హర్యానాలోని గురుగ్రామ్‌లో భారీ వర్షం నగరాన్ని మరోసారి అతలాకుతలం చేసింది. కేవలం గంటపాటు కురిసిన వర్షంతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ఉద్యోగస్తులు, విద్యార్థులు నరకయాతన పడ్డారు. ఇళ్లకు చేరుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. కార్యాలయాల్లో ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హోమ్ చేసుకునేలా చూడాలని సూచించింది. అలాగే పాఠశాలల్లో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని ఆదేశించింది. గురుగ్రామ్‌లో మధ్యాహ్నం 1.30 గంటల వరకు సుమారు 70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది. రాజీవ్ చౌక్, ఇఫ్కో చౌక్, రైల్వే రోడ్, సెక్టార్5, ఓల్డ్ ఢిల్లీ రోడ్, మెహ్రౌలి రోడ్, బసాయ్ రోడ్ తదితర ప్రాంతాలు తీవ్రంగా ప్రభావిత మయ్యాయి. భారీ వర్షంతో నగరంలోని ప్రధాన రహదారులు నీటితో నిండిపోయాయి. వరద నీటిలో వాహనాలు చిక్కుకోవడంతో పలువురు వాహనదారులు వాటిని అక్కడే వదిలి వెళ్లాల్సి వచ్చింది. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పాఠశాలల నుంచి ఇళ్లకు తిరిగి వెళ్తున్న విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లపై భారీగా నీరు నిలవడంతో బురద నీటిలో కనిపించని ఓపెన్ మ్యాన్‌హోల్స్‌లో పడకుండా ఉండేందుకు ఎత్తైన బస్‌స్టాప్‌లు, ఇతర సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. వర్షం కారణంగా ఢిల్లీజైపూర్ ఎక్స్‌ప్రెస్‌వేపై కూడా ట్రాఫిక్ తీవ్రంగా ప్రభావితమైంది. రహదారి వెడల్పుగా ఉన్నప్పటికీ వాహనాలు నెమ్మదిగా కదిలాయి. సాధారణంగా సిగ్నేచర్ టవర్ నుంచి హీరో హోండా చౌక్ వరకు సుమారు 15 నిమిషాల్లో చేరుకునే ప్రయాణానికి కనీసం 50 నిమిషాలు పట్టిందని ప్రయాణికులు తెలిపారు. సైబర్ హబ్ సమీపంలో గేట్‌వే టవర్ మెట్రో స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ఎక్స్‌ప్రెస్‌వేలోని కొంత భాగం పూర్తిగా నీట మునిగిపోయింది. దీంతో నగరంలోని ప్రధాన రహదారుల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గురుగ్రామ్‌ను మిలీనియం సిటీగా పిలుస్తారు. భారీ అపార్ట్‌మెంట్లు, షాపింగ్ మాల్స్, ప్రముఖ కంపెనీల కార్యాలయాలకు ఈ నగరం ప్రసిద్ధి. అయితే కొద్దిసేపు భారీ వర్షం కురిసినా మౌలిక వసతులు దెబ్బతినడం, రోడ్లు జలమయం కావడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాకాలంలో ఇప్పటికే వరదలకు గురయ్యే ప్రాంతంగా మారిన శీత్లా మాతా రోడ్ కూడా తాజా వర్షాలతో తీవ్రంగా ప్రభావితమైంది. ప్రతి సారి కొంత ఎక్కువ సమయం వర్షం కురిసినప్పుడు నగర మౌలిక వసతులు కుప్పకూలుతున్నాయని గురుగ్రామ్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# ఆగస్టు సంక్షోభం కాంగ్రెస్ పార్టీకి పరిపాటే

### ఎంపి డికె అరుణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు24:** ఆగస్టు సంక్షోభం అనాదిగా కాంగ్రెస్ పార్టీకి ఆనవాయితీగా మారిందని బిజెపి ఎంపీ డికె అరుణ వ్యాఖ్యానించారు. ఫీజుల బకాయి బిజెపి లడాయి పేరిట బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి పార్టీ కార్యాలయంలో సోమవారం నలభై ఎనిమిది గంటల పాటు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీ డికె అరుణ మీడియా ప్రతినిధులతో కొంత సేపు ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ గతంలోనూ సంక్షోభాలు తలెత్తాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఎవరిని గద్దె దించుతారో ఎవరిని గెలిపిస్తారో చూడాలన్నారు. ఎవరి గద్దె ఎవరు కూల్చుతారో కూడా చూద్దామని ఆమె తెలిపారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ బిజెపిలో చేరనున్నట్లు జరుగుతున్న ప్రచారం గురించి ప్రశ్నించగా, ఆమెను తమ పార్టీలో తీసుకుంటారా? లేదా? అనే ప్రశ్నలకు తాను సమాధానం చెప్పలేనని, పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని దాట వేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అమెరికాకు వెళ్ళకుండా కేంద్రం అడ్డుకున్నదన్న విమర్శలను ఆమె తోసిపుచ్చారు. విదేశాలకు వెళ్ళే ముందు పాటించాల్సిన నియామల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అన్ని తెలుసునని, తమ పాస్ పోర్టు, వీసా క్లియరెన్స్ కావాలన్నా అందుకు సంబంధించిన సమాచారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేవలం ప్రచారం కావాలని ఆమె విమర్శించారు. మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ టిక్కెట్‌ను ఈ సారి స్థానికులకే ఇవ్వాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారని ఆమె చెప్పారు. చాలా కాలంగా అన్ని ఎన్నికల్లో పార్టీ కోసం పని చేస్తున్న పవన్ పేరును పార్టీ నాయకత్వానికి సూచించినట్లు ఆమె తెలిపారు. పార్టీ కోసం పవన్ అంకితమైనభావంతో పని చేస్తారు కాబట్టే తానూ నాయకత్వానికి సూచించానని ఆమె చెప్పారు. బిజెపి జాతీయ ఉపాధ్యక్ష పదవి నుంచి ఎందుకు తప్పించారని ప్రశ్నించగా, ఒక బాధ్యత నుంచి తప్పించారంటే అంతకంటే మంచి బాధ్యత ఇస్తారేమోనని అనుకుంటున్నట్లు ఆమె సమాధానమిచ్చారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవిలో లేరని, మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతోనే ఆ పదవి బాధ్యత ఉండదని ఆమె వివరించారు. తాను ఎంపీ అయ్యాక సమయం సరిపోవడం లేదని కర్నాటక రాష్ట్ర ఇన్‌చార్జి బాధ్యత నుంచి తప్పుకున్నానని డికె అరుణ తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి రావాలని అందరమూ ప్రయత్నిస్తున్నామని, పార్టీ జాతీయ నాయకత్వం దృష్టి సారించిందని అన్నారు. రాష్ట్రంపై ఎక్కువ దృష్టి సారించాల్సి ఉంది కాబట్టి తమ అందరికీ జాతీయ పదవులు కాకుండా రాష్ట్రంపైనే ఎక్కువ ఫోకస్ చేయమంటారేమోనని ఆమె అభిప్రాయపడ్డారు. తమ పార్టీ రాష్ట్ర ఎంపీలందరమూ కలిసే ఉన్నామని, ఎవరి మధ్య ఎటువంటి అభిప్రాయభేదాలు లేవని ఎంపీ అరుణ తెలిపారు.

# స్కిల్ వర్సిటీలో పాలిటెక్నిక్..

### కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు24:** పాలిటెక్నిక్‌ను స్కిల్ వర్సిటీలో చేర్చడంపై కె.కేశవరావు అధ్యక్షతన ఉన్నత స్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొదండరామ్,శాంతాసిన్హా,నవీన్ మిట్టల్ సభ్యులుగా పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. పాలిటెక్నిక్ ఆధునీకరణ, విద్యార్థులు,ఉద్యోగుల కెరీర్ పరిరక్షణ లక్ష్యమని తెలిపింది. ప్రభుత్వ లక్ష్యాలు, విద్యార్థులు, ఉద్యోగుల ఆందోళనలను అధ్యయనం చేసి నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని కమిటీని ప్రభుత్వం ఆదేశించింది.

# రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాటలకే పరిమితం: జీవన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు24:** కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగించకుండా తెలంగాణ ప్రభుత్వం నిరక్ష ్యం చేస్తోందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తుమ్మిడిహెట్టి విషయంలో కేసీఆర్ చొరవ చూపినా మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించకపోవడంతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించాల్సి వచ్చిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 33 నెలలుగా మాటలకే పరిమితమైందని, కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగించుకోవడం లేదని విమర్శించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు బాగున్నాయని కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా సంస్థ ఇచ్చిన నివేదిక ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదన్నారు.మేడిగడ్డలో ఒక పిల్లర్ కుంగినా ఇప్పటివరకు మరమ్మతులు చేయలేదని ఆరోపించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లను వెంటనే ఆన్ చేసి నీటిని ఎత్తిపోసుకోవాలని డిమాండ్ చేశారు. రెండు నెలల క్రితమే కేటీఆర్ నేతృత్వంలో అక్కడికి వెళ్లి ఇదే విషయాన్ని కోరామని తెలిపారు. రూ.200 కోట్లతో మేడిగడ్డ పియర్‌కు మరమ్మతులు చేసి, కాఫర్ డ్యామ్ ద్వారా నీటిని లిఫ్ట్ చేయవచ్చన్నారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే కారణంతోనే ప్రభుత్వం కాళేశ్వరం నీటిని వినియోగించడం లేదని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, కేసీఆర్ తిరిగి రావాలని కోరుకుంటున్నారని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.

# చిరుత గోర్లు, చర్మం అమ్మకానికి బేరం!

### డబ్బు కోసం వన్యప్రాణిని హతమార్చిన ముఠా.. నలుగురు అరెస్టు




**కొత్తగూడెం క్రైమ్, ప్రభాతవార్త, ఆగస్టు 24:** డబ్బు కోసం వన్యప్రాణిని హతమార్చి దాని చర్మం, గోర్లను అక్రమంగా విక్రయించేందుకు బేరసారాలకు దిగిన నలుగురు వ్యక్తులు పోలీసు లకు చిక్కారు. చింతూరు అటవీ ప్రాంతంలో గుంతలో చిక్కుకున్న చిరుతపులిని రాళ్లు, కర్రలతో కొట్టి, భాణాలు విసిరి చంపినట్లు నింది తులు పోలీసుల విచారణలో వెల్లడించినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. వారి వద్ద నుంచి చిరుతపులి చర్మం, 17 గోర్లు స్వాధీనం చేసుకున్నారు. తాళ్లగొ మ్మూరులోని ఓ ఇంటి వద్ద చిరుత చర్మం, గోర్లతో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురిపై విశ్వసనీయ సమాచారం అంద ్డడంతో బూర్గంపహాడ్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపుదాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. చిన్న బ్యాగ్‌లో దాచిన చిరుత చర్మం, గోర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గుంతలో చిక్కిన చిరుతకు మృత్యుశి! పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెలుగు లోకి వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. గత ఏడాది వేసవిలో చింతూరు మండలం గమ్మలకోట గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గుంతలో పడి బయటకు రాలేని స్థితిలో ఉన్న చిరుతను నిందితులు గుర్తించినట్లు తెలిపారు. దానిని రక్షి ంచే ప్రయ త్నం చేయకుండా రాళ్లు, కర్రలతో కొట్టి, భాణా లు విసిరి హతమార్చినట్లు విచారణలో వెల్లడై నట్లు పోలీసులు తెలిపారు.చర్మం ఎండబెట్టి.. గోర్లు దాచిపెట్టి.. చిరుతను హతమార్చిన అనం తరం దాని చర్మాన్ని తొలగించి ఎండబెట్టడంతో పాటు గోర్లను వేరు చేసి భద్రపరిచినట్లు పోలీ సులు తెలిపారు.
అనంతరం వాటిని విక్రయించి భారీగా డబ్బు సంపాదించేందుకు ప్రయత్నిం చినట్లు వెల్లడించారు. కొనుగోలుదారుల కోసం అన్వేషణ.. పోలీసుల వలలో ముఠాసారపాకకు చెందిన చల్లా అనిల్ కుమార్ కొనుగోలుదా రులను సంప్రదించి చిరుత చర్మం, గోర్ల విక్ర యానికి సహకరిస్తానని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. దీంతో కుంజ భద్రయ్య, కుంజా గంగరాజు, మడవి కన్నయ్యలు చిరుత చర్మం, 17 గోర్లను చిన్న బ్యాగ్‌లో పెట్టుకుని తాళ్ల గొమ్మూరులోని అనిల్ కుమార్ ఇంటికి తీసుకు వచ్చారు. విక్రయానికి ప్రయత్నిస్తున్న సమ యంలో పోలీసులు వారిని పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్నవిచిరుతపులి చర్మం - 1చిరుతపులి గోర్లు - 17చిన్న బ్యాగ్ - 1అరెస్టయిన నిందితులుచల్లా అనిల్ కుమార్ (తాళ్లగొమ్మూరు, సారపాక), కుంజ భద్రయ్య, కుంజా గంగరాజు, మడవి కన్నయ్య (గమ్మలకోట, చింతూరు మండలం, పోలవరం జిల్లా).ఈ ఆప ్రేషన్‌లో పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ సీఐ సతీష్, టాస్క్‌ఫోర్స్ సీఐ రమాకాంత్, ఎస్సైలు నాగబిక్షం, ప్రవీణ్, సుమన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సరికొత్త మొక్కజొన్న వంగడం

### ముసునూరులో ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ఎపి సిఎం చంద్రబాబు

### గోర్మే పాప్‌కారన్ విదేశాలకు ఎగుమతి

### 100 బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా

**ఏలూరు/ ముసునూరు, ఆగష్టు, 24 : ప్రభాతవార్త :** ఏలూరు జిల్లా ముసునూరులో గోర్మే పాప్‌కార్నికా సంస్థ ఆధ్వర్యంలో జన్యుపరంగా మార్పు చేయని (నాన్‌బిటీవీ) మొక్కజొన్న వంగడాన్ని భారత ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ గోర్మే పాప్‌కార్నికా సంస్థ ఆవరణలో సోమవారం పండుగ వాతావరణంలో జరిగిన కార్యక్రమంలో భారత ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబులతో కలిసి ఆవిష్కరించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ఉప రాష్ట్రపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి సి.పి రాధా కృష్ణన్ మాట్లాడుతూ విదేశీ హైబ్రిడ్ విత్తనాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వదేశీ పరిజ్ఞానంతో ఆహార భద్రత మరియు స్వయం సమృద్ధిని సాధించడం అత్యంత కీలకమైన అంశం అన్నారు. భారతదేశం భవిష్యత్తులో పాప్‌కార్న్ దిగుమతి చేసుకోకుండా ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతోందని ప్రశంసలు అందుతున్నాయన్నారు. దేశ జీడీపీ, స్థూల విలువ జోడింపు లో వ్యవసాయ రంగం సుమారు 1/5వ వంతు వాటాను కలిగి ఉండటమే కాకుండా, 46.1 మందికి ఉపాధిని, 55 జనాభాకు జీవనాధారాన్ని అందిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోంద న్నారు. ఈ క్రమంలో 8 రాష్ట్రాల్లో దాదాపు 17,500 మంది రైతులు 40,000 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తూ, ఎటువంటి అప్పుల ఊబిలో పడకుండా మంచి లాభాలు అర్జిస్తున్నారన్నారు. రైతు సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పిఎంకిసాన్, పిఎం ఫసల్ బీమా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డులతో పాటు మహిళా సంఘాలకు ఆధునిక సాంకేతికతను జోడించే నమో డ్రోన్ దీదీ వంటి పథకాలు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయన్నారు.

### అలంపూర్ నుండి నల్లగొండ వరకు జాతీయ రహదారి

# రహదారుల నిర్మాణానికి పెద్దపీట

### ఉమ్మడి జిల్లాకు మూడువేల కోట్ల రోడ్లు, కొల్లాపూర్‌కు రూ.600 కోట్లు: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**చిన్నంబావి, ఆగస్టు 24, ప్రభాతవార్త :** రాష్ట్రంలో రోడ్డు భవనాల శాఖ ద్వారా 36 వేల కోట్లతో రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని, అందులో భాగంగానే ఉమ్మడి పాలమూరు జిల్లాకు రూ.3 వేల కోట్లు, కొల్లాపూర్ నియోజక వర్గానికి సుమారు రూ.600 కోట్లు ఇవ్వబోతున్నామని రాష్ట్ర రోడ్డు భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం చిన్నంబావి మండలంలో పెద్ద దగడ నుండి వెలగొండ వరకు రూ.45 కోట్ల విలువైన రోడ్డు అభివృద్ధికి, చిన్నంబావి నుండి చెల్లపాడు వరకు రూ. 39 కోట్ల విలువైన హం రోడ్ల అభివృద్ధికి శంకుస్థాపన చేసిన అనంతరం మండల కేంద్రంలో ఏర్పా టు బహిరంగ సభలో నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లు రవి, మంత్రి జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి లు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వంలో 3.25 కోట్ల ప్రజలకు సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 3 లక్షల పైబడి ఇందిరమ్మ ఇండ్లు, రైతులకు 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ, భూమిలేని నిరు పేద లకు 6 వేల రూపాయల రైతు భరోసా!, భూమి కలిగిన వారికి సంవత్సరానికి 12 వేల రూపాయల రైతు భరోసా!, రైతులకు ఉచిత విద్యుత్, ప్రాజెక్టుల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను కొనసాగిస్తున్నామని వారు అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దక్షి ణ తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో అన్యాయం జరిగిందని, కాళేశ్వరం పేరుతో గత ప్రభుత్వం కృష్ణానది ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని అన్నారు.తన సహచర మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రజా విశ్వాసం వలన నాయకుడని, నిరంతరం ప్రజల కోసం పనిచేస్తూ... కొల్లాపూర్ నియోజక వర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. గ్రామం కూడా కానీ చిన్నంబావి మండలాన్ని మండల కేంద్రం చేసి, ప్రజల విశ్వాసం పొందారాని అన్నారు అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. సామాన్య మధ్యతరగతి వ్యవసాయ కుటుంబానికి చెందిన తాను క్రింది స్థాయి నుంచి ఎదిగానని తనపై తప్పుడు ఆరోపణలతో ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో లేనిపోని కథనాలు ప్రకటిస్తున్నారని, అది మంచి పద్ధతి కాదని మానుకోవాలని హితవు పలికారు. అలంపూర్ నుండి కొల్లాపూర్ మీదుగా నలగొండ వరకు 225 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి మంజూరుకు మంత్రి జూపల్లి ప్రతిపాదించగా, మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే ఇట్టి విషయంపై కేంద్రమంత్రి గడ్కరీని కలవడం జరిగిందని 1900 కోట్ల రూపాయలతో ప్రతిపాదన పంపించామని కృష్ణా నదిపై గుందిమల్ల వెల్టూరు బ్రిడ్జి కం రోడ్డు బ్రిడ్జి కం జాతీయ రహదారి నిర్మాణానికి తీపి కబురు వస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో రోడ్డు భవనాల శాఖ అధికారులు, రెవెన్యూ, పంచాయతీ రాజ్, అధికారులు, నాయకులు కొత్త కళ్యాణ్ రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రక్షణ రంగంలో సరికొత్త సాంకేతికత

- గగనతలంలోనే శత్రువును మట్టుబెట్టే వ్యవస్థకు శ్రీకారం
- రూ.27 వేలకోట్లు వ్యయంతో 2029 నాటికి సాకారం



**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** భారత రక్షణ రంగం సరికొత్త సాంకేతిక యుగంలోకి అడుగుపెడుతోంది. శత్రు దేశాల నుంచి ప్రయోగించే క్షిపణులను సెకన్ల వ్యవధిలోనే గుర్తించి, వాటిని గగనతలంలోనే ధ్వంసం చేసేందుకు వీలుగా అంతరిక్ష ఆధారిత ముందస్తు హెచ్చరిక వ్యవస్థను భారత్ వేగంగా అభివృద్ధి చేస్తోంది. రూ.27 వేల కోట్లతో ఈ వ్యవస్థ శరవేగంగా రూపుదిద్దుకుంటున్న ది. 2029 నాటికి 52 ఉపగ్రహాల (21 ఇస్రో, 31 ప్రైవేట్) సమూహాన్ని అంతరిక్షంలో మోహరించనున్నారు. ఈ నెట్‌వర్క్ నిరంతర నిఘా, శత్రువుల మొబైల్ లాంచర్ల ట్రాకింగ్, కమ్యూనికేషన్స్ వంటి బహుళ ప్రయోజనాలకు ఉపయోగపడుతుంది. ఈ బహుళ అంచెల రక్షణ వ్యూహం ద్వారా శత్రువు ఆకస్మిక దాడులు చేసే అవకాశాలను తగ్గించి, భారత రక్షణ సామర్థ్యాన్ని అసాధారణ స్థాయికి తీసుకెళ్లాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఈ కీలక పరిణామం వెలుగులోకి వచ్చింది. అంతరిక్షంలో కళ్లు గా పిలుస్తున్న ఈ వ్యవస్థ ద్వారా క్షిపణి ప్రయోగ సమయంలో దాని ఇంజిన్ల నుంచి వెలువడే అత్యధిక వేడిని (ఇన్‌ఫ్రారెడ్ సిగ్నేచర్) ఉపగ్రహాలు తక్షణమే పసిగడతాయి. దీంతో క్షిపణిని దాని ప్రయాణ మార్గంలోనే అడ్డగించి, నాశనం చేయడానికి భారత రక్షణ దళాలకు అమూల్యమైన సమయం లభిస్తుంది. గతంలో జరిగిన ఆపరేషన్ సిందూర్ ఈ కొత్త వ్యవస్థ ఆవశ్యకతను స్పష్టం చేసింది. ఆ సమయంలో పాకిస్థాన్ ప్రయోగించిన ఒక హైస్పీడ్ క్షిపణి ఢిల్లీ వైపు దూసుకొస్తుండగా, హర్యానాలోని సిర్సా వద్ద భారత వాయు రక్షణ వ్యవస్థ దానిని అడ్డగించింది. అయితే, క్షిపణి లక్ష్యాన్ని చేరడానికి కేవలం ఒకటి, రెండు నిమిషాల సమయం మాత్రమే ఉండగా ఈ అడ్డగింత సాధ్యమైంది. భూమిపై ఉన్న రాడార్లు భూమి వక్రత కారణంగా ఒక పరిమితి మేరకే పనిచేస్తాయి. దీంతో ముప్పును గుర్తించడానికి తక్కువ సమయం ఉంటుంది. ఈ సమస్యను అధిగమించి, శత్రువు దాడిని ముందుగానే పసిగట్టడమే అంతరిక్ష ఆధారిత సెన్సార్ల ప్రధాన లక్ష్యం. బాలిస్టిక్ క్షిపణులు ప్రధానంగా మూడు దశల్లో ప్రయాణిస్తాయి. మొదటిది బూస్ట్ దశ. ఈ సమయంలో ఇంజిన్లు మండి, తీవ్రమైన వేడిని విడుదల చేస్తాయి. అంతరిక్షంలోని ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్లు ఈ వేడిని ప్రయోగించిన సెకన్ల వ్యవధిలోనే గుర్తిస్తాయి. రెండోది మిడ్‌కోర్స్ దశ. ఈ దశలో క్షిపణి వాతావరణం బయట ప్రయాణిస్తుంది. ఇక మూడో దశలో క్షిపణి అత్యంత వేగంతో (మాక్ 15కు పైగా) లక్ష్యం వైపు దూసుకొస్తుంది. భూ ఉపరితలం రాడార్లు కేవలం టెర్మినల్ దశలోనే క్షిపణిని గుర్తించగలవు. అంతరిక్షంలోని ఉపగ్రహాలు బూస్ట్ దశలోనే గుర్తించి హెచ్చరికలు పంపుతాయి. దీనివల్ల కిల్ చైన్ ప్రక్రియ చాలా ముందుగా ప్రారంభమవుతుంది. దీంతో వాతావరణం లోపల, వెలుపల కూడా క్షిపణిని కూల్చివేసేందుకు అవకాశం లభిస్తుంది. డీఆర్‌డీఓ ఇప్పటికే ఇటువంటి క్షిపణి విధ్వంసక పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. ఈ అత్యాధునిక వ్యవస్థ రూపకల్పనలో భారత ప్రభుత్వం, ప్రైవేట్ స్టార్టప్‌లు కలిసి పనిచేస్తున్నాయి. బెంగళూరుకు చెందిన దిగంతర్ స్టార్టప్ ఆల్బట్రాస్ ఉపగ్రహాలతో బూస్ట్ దశలోనే క్షిపణులను గుర్తించే సాంకేతికతపై పనిచేస్తోంది. అహ్మదాబాద్‌కు చెందిన శాట్‌లియో ల్యాబ్స్ 15 ఉపగ్రహాలతో కూడిన థర్మల్ అబ్జర్వేషన్ వ్యవస్థను నిర్మిస్తోంది. ఇవి క్షిపణి ప్రయోగం వంటి అత్యధిక ఉష్ణోగ్రత ఘటనలను గుర్తించి, రియల్ టైమ్‌లో సమాచారం అందిస్తాయి. ఈ ప్రైవేట్ ప్రయత్నాలకు తోడుగా, కేంద్ర భద్రతా కేబినెట్ కమిటీ స్పేస్‌బేస్డ్ సర్వైలెన్స్ ఫేజ్3 అనే భారీ కార్యక్రమానికి ఆమోదం తెలిపింది.

## ప్రజా సమస్యలకు పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి పొంగూరు నారాయణ

**విజయవాడ,ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజా సమస్యలకు పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.ఈ సందర్భంగా పొంగూరు నారాయణ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారు.టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ, పోలీస్, భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులే అధికంగా వచ్చాయని మంత్రి తెలిపారు. ముఖ్యంగా భూ సమస్యలు, రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న అంశాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పార్టీ గ్రీవెన్స్ ద్వారా ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని చెప్పారు. వచ్చిన ప్రతి అర్జీని నమోదు చేసి.. సమస్య పరిష్కారమయ్యే వరకూ ఫాలోఅప్ చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని స్పష్టం చేశారు.గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత రెవెన్యూ మంత్రితో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చాం. టీడీపీ కార్యాలయం కేవలం పార్టీ కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజల సమస్యలు విని.. పరిష్కారం చూపించే వేదికగా పనిచేస్తోంది. ప్రజల సమస్యలను మంత్రులు.. ప్రజాప్రతినిధులు నేరుగా స్వీకరించి పరిష్కరించే విధంగా గ్రీవెన్స్ వ్యవస్థ కొనసాగుతోంది. మంత్రి నారా లోకేశ్ సైతం ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో ఏ మూలన సమస్య ఉన్నా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి తెలిపారు.

## సిజెపి దెబ్బకు దిగివచ్చిన రాజస్థాన్ సర్కార్

రూ.12,500 కోట్లతో రిపేర్లు, కొత్తభవనాలు



**జైపూర్,ఆగస్టు 24:** రాజస్థాన్ లోని స్కూళ్ల దీనావస్థపై కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులు చేపట్టిన ఉద్యమం విజయవంతమైంది. దారుణంగా ఉన్న స్కూళ్లను సందర్శిం చేందుకు కాక్రోచ్ పార్టీ ప్రతినిధులు చేసిన ప్రయత్నాలను ముందు బీజేపీ కార్యకర్తలు స్థానికులతో కలిసి అడ్డుకోవడమే కాకుండా దాడులు కూడా చేశారు. అయితే ఈ వ్యవహారం రాజస్థాన్ తో పాటు దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడంతో అక్కడి బీజేపీ ఆధ్వర్యంలోని భజన్ లాల్ శర్మ సర్కార్ పై ఒత్తిడి పెరిగింది. చివరికి బీజేపీ మిత్రపక్షాలు సైతం ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రారంభించాయి. దీంతో తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న రాజస్థాన్ సర్కార్ స్కూళ్ల రిపేర్లకు ముందుకొచ్చింది. ఇందుకోసం రూ.12 వేల 500 కోట్ల రూపాయలు కేటాయిస్తామని రాజస్థాన్ ప్రభుత్వం ప్రకటన చేసింది. ఇందులో భాగంగా 3587 స్కూలు భవనాలను రూ.2487 కోట్ల ఖర్చుతో కొత్తగా నిర్మిస్తారు. అలాగే 83,783 క్లాస్ రూమ్ లను కూడా రూ.8378 కోట్ల ఖర్చుతో నిర్మించబోతున్నారు. అలాగే 22589 స్కూళ్లలో మేజర్ రిపేర్ల కోసం రూ.1129 కోట్లు కేటాయించనున్నారు. దీంతో పాటు 340 కోట్ల ఖర్చుతో 13వేల 616 టాయిలెట్ కాంప్లెక్స్ లను కూడా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## ఫ్లోరిడా తీరంలో కృత్రిమ పగడపు దిబ్బ పర్యాటకం వృద్ధికి సర్కారు కొత్తప్రయోగం

**ఫ్లోరిడా, ఆగస్టు 24:** అమెరికాలోని ఫ్లోరిడా తీరంలో ఒక వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. గతంలో వ్యర్థాలను తరలించేందుకు వినియోగించిన 324 అడుగుల పొడవైన భారీ ట్యాంకర్‌ను ఉద్దేశపూర్వకంగా సముద్రంలో ముంచి, దానిని ఒక అద్భుతమైన కళాఖండంగా తీర్చిదిద్దారు. పొంపానో బీచ్ సమీపంలో మునిగిన ఈ నౌకకు లేడీ లక్ అని నామకరణం చేసి, నీటి అడుగున క్యాసినో థీమ్‌తో కూడిన ఒక కృత్రిమ పగడపు దిబ్బగా మార్చారు. స్థానిక కళాకారుడు డెన్నిస్ మెక్‌డొనాల్డ్ తన బృందంతో కలిసి కేవలం రెండు నెలల్లో స్వల్ప వ్యవధిలోనే ఈ నౌకకు సరికొత్త రూపునిచ్చారు. నౌక లోపల పోకర్ టేబుళ్లు, నకిలీ స్లాట్ మెషీన్లు, భారీ సొరచేపల విగ్రహాలు, ఒక జలకన్యతో పాటు పేకాట ఆడుతున్న ఆక్టోపస్ శిల్పాలను ఏర్పాటు చేశారు. నౌకలోని పాత వాల్వులు, స్ప్రింగులు వంటి విడిభాగాలనే ఈ శిల్పాల తయారీకి వినియోగించడం విశేషం. ఈ నౌక షిప్‌రెక్ పార్క్‌లో అంతర్భాగం కాగా, ఇక్కడ మొత్తం 15 నౌకలు ఉన్నాయి. పర్యాటకాన్ని ప్రోత్సహించడంతో పాటు సముద్ర జీవులకు కొత్త ఆవాసాన్ని కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. ఈ కృత్రిమ పగడపు దిబ్బ ఏర్పాటు ద్వారా సహజసిద్ధమైన పగడపు దిబ్బలపై పర్యాటకుల ఒత్తిడి తగ్గుతుందని నిపుణులు భావిస్తున్నారు. ఈ లేడీ లక్ నౌక ఏడాదికి సుమారు 35 వేలమంది డైవర్లను ఆకర్షిస్తుందని అంచనా వేస్తున్నారు. గుర్తింపు పొందిన డైవర్లు ఉచితంగానే ఈ నీటి అడుగున ఉన్న క్యాసినోను సందర్శించవచ్చు. నౌకను నియంత్రిత పద్ధతిలో ముంచేందుకు ముందుగానే రంధ్రాలు చేసి, తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

## ఉద్యాన వర్సిటీ, క్యాబ్ ఇంటర్నేషనల్ మధ్య అవగాహన ఒప్పందం

- వర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. డి. రాజి రెడ్డి



అవగాహన ఒప్పంద చేసుకుంటున్న వైస్ ఛాన్సలర్ డా. డి. రాజి రెడ్డి, ఇతర అధికారులు

**అత్తాపూర్ ఆగస్టు 24,ప్రభాతవార్త :** శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వ విద్యాలయం, క్యాబ్ ఇంటర్నేషనల్ మధ్య అవగాహన ఒప్పందం జరిగిందని వర్సిటీ వైస్ ఛాన్సలర్ డా.డి.రాజిరెడ్డి అన్నారు. విద్యార్థులకు ఆన్లైన్ కోర్సులు అందుబాటులో ఉండటం వల్ల ఏ సమయంలోనైనా ఆయా కోర్సులు పూర్తి చేసుకునే అవకాశం ఉందని, ఈ వెసులుబాటును ఉపయోగించుకోవాలని వర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ రాజిరెడ్డి అన్నారు. ఈ అవగాహన ఒప్పందంతో రెండు పక్షాల మధ్య ఉన్నతమైన పరిశోధన, విస్తరణ, శిక్షణ, సామర్థ్య నిర్మాణం, సాంకేతిక జోడింపు అవగాహన మరింత పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే రైతులు, విస్తరణ అధికారులకు కూడా ఈ ఆన్లైన్ కోర్సెస్ పై అవగాహన కల్పించి, అందుబాటులోకి తేనున్నట్లు, అలాగే విద్యార్థుల రెగ్యులర్ కోర్సెస్ కరికులం భాగంగా కూడా ఈ కోర్సులు చేసే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ... సైన్స్ ఆధారిత సమాచారాన్ని మాత్రమే రైతులు నమ్మాలని, సోషల్ మీడియాలో అశాస్త్రీయ సమాచ్రార ఎక్కువగా ఉందని, నిపుణులతో చర్చించి మాత్రమే పంటల సాగులో నిర్ణయాలు రైతులు తీసుకోవాలన్నారు. రియల్ టైమ్ ఆధారంగా ఉన్న డిజిటల్ టూల్స్ మాత్రమే వినియోగించాలని డాక్టర్ రాజి రెడ్డి కోరారు. పర్యావరణ మార్పులు, పెరుగుతున్న చీడ, పీడల సమస్య, విచక్షణా రహితంగా వాడుతున్న పురుగుమందుల నేపథ్యం లో ఆన్లైన్, ఆఫ్లైన్ టీచింగ్ హైబ్రిడ్ మోడ్ లో జరగాలని చెప్పారు.ప్రస్తుతం వ్యవసాయాన్ని ప్రభావితం చేస్తున్న ముఖ్య అంశాలైన చీడ, పీడల యాజమాన్యం, నేల సారవంతత, విత్తనాలు, బిజినెస్, డిజిటల్ ఫార్మింగ్ వంటి అంశాలపై ఆన్లైన్ కోర్సులు ఉన్నాయని దితితీ ఇంటర్నేషనల్ గ్లోబల్ టీం లీడర్ డా. మాళవిక చౌదరి అన్నారు. మూడు ఖండాలు, 48 దేశాలలో క్యాబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థ ఉందని తెలిపారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, పరిశోధన సంచాలకులు డా. లక్ష్మీ మ్మ నారాయణ, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం డైరెక్టర్ డా. సీనివాసన్, క్యాబి సౌత్ ఆసియా అగ్రికల్చర్ డిజిటల్ టూల్స్ కోఆర్డినేటర్ డా. మాధురి మంజరి, ప్లానింగ్ అండ్ మానిటరింగ్ సెల్ డైరెక్టర్ డా. డి. అనిత కుమారి, బోర్డు మెంబర్ డా. ప్రశాంత్, కన్సల్టెంట్ డాక్టర్ కే. వీరాంజనేయులు, టెక్నికల్ అడ్వైసర్ డా. సునందిని, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో ఎసిబి దాడులు.. ఇద్దరి అరెస్ట్

- వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు



**నిర్మల్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** నిర్మల్ జిల్లా కేంద్రంలో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. జిల్లా వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో ఓ వ్యాపారి నుంచి లంచం తీసుకుంటుండగా ఇద్దరు అధికారులను ఏసీబీ అధికారులు సోమవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటనతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, లంచగొండితనంపై మరోసారి చర్చ మొదలైంది.వివరాల ప్రకారం.. ఓ వ్యాపారి పన్ను మొత్తాన్ని తగ్గించుకునేందుకు ప్రయత్నించగా, అందుకు సంబంధించి జిల్లా పన్నుల శాఖ అధికారి గోదావరి, సీనియర్ అసిస్టెంట్ మంత్రి సాయికృష్ణ లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. లంచం ఇవ్వడం ఇష్టం లేని సదరు వ్యాపారి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు.. సదరు ఉద్యోగులు రూ.50 వేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్లు తెలిసింది. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని తదుపరి చర్యలు చేపట్టారు.వరుసగా నిర్మల్‌లో ఏసీబీ దాడులునిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఉన్న భూ సర్వే కార్యాలయం, పురపాలక సంఘ కార్యాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో గత ఏడాది కాలంలో పలుమార్లు ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. లంచం తీసుకుంటున్నట్లు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పలువురు అధికారులు, ఉద్యోగులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని న్యాయస్థానంలో హాజరుపరిచిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ వరుస ఘటనలు మరువకముందే సోమవారం వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో మరో లంచం కేసు వెలుగులోకి రావడంతో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## మహిళ హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

రంగారెడ్డి జిల్లా అదనపు జిల్లా సెషన్స్ కోర్టు సంచలన తీర్పు



హత్య కేసులో జీవిత ఖైదు శిక్ష పడ్డ నేరస్తుడు దొమ్మరి రాజు

**హైదరాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** ఓ మహిళతో వివాహేతర సంబంధం కలిగివుండి, ఆమెను అన్యాయంగా హత్య చేసిన వ్యక్తికి రంగారెడ్డి జిల్లా అదనపు సెషన్స్ కోర్టు కఠిన కారాగారంతో కూడిన జీవిత ఖైదు శిక్షను విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. సైబరాబాద్ క్రైం డిసిపి అన్నల అముత్యం రెడ్డి దీనికి సంబంధించిన వివరాలను సోమవారం మీడియాకు వెల్లడించారు. 2021 సెప్టెంబరు ఐదవ తేదీన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో మీదింటి సువర్ణ (32) అనే మహిళ అదే ప్రాంతంలోని విద్యుత్ వాలీ లే అవుట్ వద్ద హత్యకు గురయ్యింది. ఈ మహిళ ఇదే ప్రాంతంలో ఒక అపార్ట్‌మెంట్‌లో హౌస్ కీపర్‌గా పనిచేస్తుంది. ఈ క్రమంలో రాజుతో పరిచయం ఏర్పడి, వివాహేతర సంబంధం పెట్టుకుంది. కాగా సెప్టెంబరు నాలుగవ తేదీన ఉద్యోగం కోసం వెళ్లిన ఆ మహిళ తిరిగి ఇంటికి రాలేదు. దీనిపై హతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేబట్టిన పోలీసులు సువర్ణ హత్యకు గురైనట్లు తేల్చారు. ఆమె మృతదేహాన్ని విద్యుత్ వాలీ లే అ వుట్ ప్రాంతంలో గుర్తించారు. ఈ హత్యకు దొమ్మరి రాజు (35) అనే వ్యక్తి కారణమని గుర్తించారు. సువర్ణతో వివాహేతర సంబంధం కలిగివున్న రాజు ఈ విషయంలో తలెత్తిన వివాదం కారణంగా ఆమెను హత్య చేశాడు. ఈ కేసులో నిందితుడిని 2021 సెప్టెంబరు 22వ తేదీన అరెస్టు చేసిన పోలీసులు జైలుకు తరలించి కోర్టులో పక్కా ఆధారలతో ఛార్జిషీట్‌ను దాఖలు చేశారు. దీనిపై ఐదేళ్లుగా రాజేంద్రనగర్‌లోని రంగారెడ్డి జిల్లా అదనపు సెషన్స్ కోర్టులో వాదనలు జరుగుతున్నాయి. ఈ కేసుకు సంబంధించి న్యాయమూర్తి సోమవారం తీర్పు వెలువరిస్తూ నిందితుడు దొమ్మరి రాజుకు కఠిన కారాగారంతో కూడిన జీవిత ఖైదు శిక్షతో పాటు 20 వేల రూపాయల జరిమానాను విధించారు. ఈ కేసులో విచారణాధి కారిగా ఇన్‌స్పెక్టర్ శివకుమార్ వ్యవహరించారు. పిపిగా కృష్ణమూర్తి కోర్టులో వాదనలు వినిపించారు.

## కొలత్తూరు ఎన్నికపై కోర్టు మెట్లెక్కిన స్టాలిన్



**చెన్నై,ఆ గస్టు 24:** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌కు గత అసెంబ్లీ ఎన్నికల్లో భారీ షాక్ తగిలింది. సిట్టింగ్ ముఖ్యమంత్రిగా, ఓ పార్టీ అధినేతగా ఉంటూ గతంలో పలుమార్లు గెలిచిన కొలత్తూరు సీటులో ఆయన అనూహ్యంగా ఓటమిపాలయ్యారు. అదీ కొత్తగా పుట్టుకొచ్చిన విజయ్ పార్టీ టీవీకే అభ్యర్థి చేతిలో ఆయన ఓడిపోయారు. దీంతో తమిళనాడు ఎన్నికల ఫలితాల్లో ఇదో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో ఓటమిని జీర్ణించుకోలేకపోతున్న స్టాలిన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కొలత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు గెలుపుని సవాల్ చేస్తూ స్టాలిన్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. కొలత్తూరు సీటులో జరిగిన గత ఎన్నికల్లో ఓటింగ్ యంత్రాలు, వీవీప్యాట్ ప్రక్రియలలో లోపాలు ఉన్నాయని ఆయన న పిటిషన్ లో ఆరోపించారు. కాబట్టి ఇక్కడ ఓట్లను తిరిగి లెక్కించేలా ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టును కోరారు. అలాగే టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు ఎన్నికను రద్దు చేసి, తనను విజేతగా ప్రకటించాలని కూడా ఆయన కోర్టును అభ్యర్థించారు. గతంలో మూడుసార్లు కొలత్తూరు నియోజకవర్గం నుంచి విజయం సాధించిన ఎంకే స్టాలిన్ గత అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం అనూహ్యంగా టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు చేతిలో 9 వేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. 1996 తర్వాత తొలిసారి ఇలా ఓటమి పాలైన స్టాలిన్ అసెంబ్లీకి కూడా దూరమయ్యారు. దీంతో ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ విపక్ష నేతగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు హఠాత్తుగా స్టాలిన్ కొలత్తూరులో ఎన్నికల ఫలితాల్ని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించడంతో ఈ పరిణామం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలు ముగిసిన నెలలు కావస్తుండటంతో మద్రాస్ హైకోర్టు దీనిపై ఎలా స్పందిస్తున్నది కూడా ఉత్కంఠ రేపుతోంది.

## బాలివుడ్ నటులు, రాందేవ్‌పై కంగనా ఫైర్



**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ మరోసారి తన నోటికి పని చెప్పారు. సహచర బాలీవుడ్ నటులపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల యోగా గురువు బాబా రామ్‌దేవ్‌పై తీవ్రంగా స్పందించిన కంగనా ఇప్పుడు తోటి నటీనటులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాప్సీ, అశోతోష్ రాణా, సోనూ సూద్, రాఖీ సావంత్, బాబా రామ్‌దేవ్‌పై కంగనా విరుచుకుపడ్డారు. తన కంటే ఎక్కువ విజయం సాధించిన వారి నుంచే తాను సలహాలు తీసుకుంటాను గానీ విఫలమైన వారు, అసహ్యమైన వారి నుంచి సలహాలు తీసుకోను అని వ్యాఖ్యానించారు. తనను విమర్శించే స్థాయి వారికి లేదన్నారు. నేను ప్రతిరోజూ ఇలాంటి వాళ్లను చూస్తుంటాను. నేను కుక్కలా మొరుగుతానని చెప్పే అశుతోష్ రాణా అయినా నేను ఎలా ప్రవర్తించాలో నేర్చుకోవాలని చెప్పే సోనూ సూద్ అయినా నా వ్యక్తిత్వం గురించి అన్ని రకాల అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసే రాఖీ సావంత్ లాంటి వాళ్లైనా నా తల్లిదండ్రులను, నా పెంపకాన్ని, నా నేపథ్యాన్ని నిరంతరం అవమానిస్తూ ఉండే తాప్సీ లాంటి వాళ్లు కూడా ఉన్నారు. ఈ వ్యక్తులకు నేను చెప్పే సందేశం ఒక్కటే నా జీవితంలో నేను సాధించిన విజయంలో ఒక్క శాతం కూడా మీరు సాధించకపోతే నేను మీ సలహాలను అస్సలు వినను. ఈ పనికిమాలిన వ్యక్తులు కేవలం ప్రచారం కోసమే మీడియాలో నన్ను నిరంతరం దూషిస్తూ ఉంటారు. అని దుయ్యబట్టారు. పనిలో పనిగా మరోసారి బాబా రామ్‌దేవ్‌పై కూడా మండిపడ్డారు. ఆయన అన్ని హద్దులు దాటారని ఆరోపించారు. ఈ ఆకలితో ఉన్న నిస్సహాయులైన ప్రజలు నాపై విరుచుకుపడలేరు. వారు తల్లిదండ్రులను కూడా వదిలిపెట్టరు. అశుతోష్ రాణా లాంటి వాళ్లు నేను కుక్కలా మొరుగుతానని అంటారు. ముందు మీరే కంగనా రనౌత్ అవ్వండి. నేను నాకంటే ఎక్కువ విజయం సాధించిన వారి నుంచి సలహాలు తీసుకుంటాను. విఫలమైన, తెలివితక్కువ, అసహ్యకరమైన వ్యక్తుల నుండి నేను సలహాలు తీసుకోను., అని పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీ వేదికగా విద్యార్థులు ఆందోళన చేపట్టారు. అయితే ఈ ఉద్యమంపై కంగనా స్పందిస్తూ.. విద్యార్థులను మురికి తరం అంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలే తీవ్ర దుమారం రేపాయి. దీనిపై బాబా రామ్‌దేవ్ స్పందిస్తూ ఆమె గతంలో చేసిన పనులు ఎలా ఉండేవి. ఆమె యవ్వనం ఎలా ఉండేది, అయినా కలుషితమైన మనస్తత్వం కలిగిన గురించి మాట్లాడనని అన్నారు. దీనికి కంగనా కౌంటరిచ్చారు. బాబాజీ నా యవ్వనం లేదా పడకగది గురించి పగటి కలలు కనకండి. పుకార్లు, గాసిప్‌ల ఆధారంగా మాత్రమే ఊహించుకోవాల్సి అని రాశారు. ఇక తాప్సీ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తాను ఎప్పుడూ కంగనాను కలవలేదని తన అభిప్రాయం ప్రకారం ఆమె మాటలు వింటుంటే ఆమె పెంపకంలోనే ఏదో తేడా ఉందని వ్యాఖ్యానించారు.

## మాంసం ఉత్పత్తి పెంపుపై పరిశోధనలు

- తెలంగాణ మీట్‌కు వరల్డ్‌లోనే ఒక బ్రాండ్ కల్పించాలి

**హైదరాబాద్, అగస్టు 24, ప్రభాతవార్త:** మాంసం ఉత్పత్తుల దిగుబడిని పెంచడం, వాటి ద్వారా అదనపు ఉత్పత్తులను తయారు చేయడం వంటి అంశాలపై తమ సంస్థలో పరిశోధనలు జరుగుతున్నాయని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఆధ్వర్యంలో కొనసాగుతున్న హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రతిష్టాత్మక పరిశోధనా సంస్థ జాతీయ మాంస పరిశోధనా కేంద్రం డైరెక్టర్ ఎస్ బి బర్బుద్దీ వెల్లడించారు. తెలంగాణ మీట్‌కు ప్రపంచంలోనే ఒక బ్రాండ్ కల్పించాలన్నారు. మేలైన గొర్రెలు, మేకల రకాలను ఎంచుకుని మాంసం ఉత్పత్తిపై దృష్టి సారించాలని గొర్రెలు, మేకల పెంపకం దారులకు సూచించారు. హైదరాబాద్‌లో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ నిర్మాణంలో మాంసం ఉత్పత్తులు, ఎగుమతులు కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. అయిప్పటికీ స్థానిక అవసరాలకే అది సరిపోవడం లేదని తెలిపారు. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి మాంసం దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త పద్ధతుల్లో గొర్రెలు, మేకల పెంపకం చేపట్టాలని సూచించారు.

## తిరుపతి డిఎస్‌పి పేరిట అమాయకులకు టోకరా సిసిఎస్‌కు చిక్కిన కేటుగాడు



సిసిఎస్ పోలీసులు అరెస్టు చేసిన కేటుగాడు కొండూరు రెడ్డి వెంకట రాజు

**హైదరాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** ఎపిలోని తిరుపతి జిల్లాలో డిఎస్‌పిగా పనిచేస్తున్నట్లు అమాయకులను నమ్మిస్తూ తెలుగు రాష్ట్రాల్లో అనేకమందిని మోసం చేసి కోట్ల రూపాయలు దండుకుని పరారీలో వున్న కేటుగాడిని హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఇతని వద్ద నుంచి పోలీసు దుస్తులతో పాటు ఇంకొన్ని వస్తువులను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సిసిఎస్ డిసిపి చైత న్యకుమార్ సోమవారం మీడియాకు వెల్లడించారు. ఎపిలోని అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన కొండూరు రెడ్డి వెంకటరాజు అలియాస్ కె విపి రాజు ఉరఫ్ డిఎస్‌పి రాజు (40) 2020 నుంచి తనను తాను పోలీసు శాఖలో డిఎస్‌పిగా చెప్పుకుంటూ తెలుగు రాష్ట్రాల్లో అనేకచోట్ల అ మాయకులను నిండా ముంచాడు. తాను చెప్పిన కంపెనీల్లో పెట్టుబడులు పెడితే స్వల్ప వ్యవధిలో అధికలాభాలు వస్తాయని నమ్మించి అమాయకులను ఇతను ముంచాడు. లాభాలు రాకపోగా అసలు పెట్టుబడి గురించి ఎవరైనా అడిగితే తాను ఎన్‌కౌంటర్ స్పెషలిస్టునని, ఎక్కువగా మాట్లాడితే చంపేస్తానని బెదిరించేవాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి ఈ మోసగాడు కోటి 20 లక్షల రూపాయలు కాజేశాడు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం ఆరా తీయగా ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో పట్టుబడ్డాడు.

## బైక్‌లను ఢీకొట్టిన కారు..ఐదుగురికి గాయాలు



**ఘట్‌కేసర్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ కొండాపూర్ సమీపంలో సోమవారం రాత్రి ఓకారు భీభత్సం సృష్టించి ఐదుగురిని గాయపరచింది. హ్యూందాయ్ ఎక్స్‌యువి కారు (టిఎస్08కెఎఫ్-0652) డ్రైవర్ మద్యం మత్తులో కారు నడుపుతూ రెండు బైక్‌లను ఢీకొట్టాడు. కొండాపూర్ విజ్ఞాన్ కళాశాలలో పెయింటింగ్ పనిచేస్తున్న మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నలుగురు వ్యక్తులు బైక్‌పై ఘట్‌కేసర్ వెళ్లి కూరగాయాలు తీసుకొని తిరిగి కళాశాలకు వస్తుండగా బోగారం వైపు నుంచి ఎదురుగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో ఐదుగురికి తీవ్ర గాయాలై లేవలేని స్థితిలో పడిపోయారు. కాళ్లు విరిగి రక్తం మడుగులో ఏడుస్తూ కదలకుండా ఉండి పోయారు. ఒక బైక్‌పై నలుగురు పెయింటర్స్ వస్తుండగా వారి బైక్ వెనకాల హోండా యాక్టివాపై ఇద్దరు సంస్కృతి కళాశాల విద్యార్థులు వెళ్తుండగా వారి బైక్‌ను కూడా కారు ఢీకొట్టింది. ప్రమాదంలో నలుగురు పెయింటర్ల కాళ్లకు, విద్యార్థి అజయ్ కాలుకు గాయమైంది. స్థానికులు గమనించి అంబులెన్సుకు, పోలీసులలకు సమాచారం ఇచ్చారు. ఘట్‌కేసర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద స్థితిని పరిశీలించి గాయపడ్డ క్షతగ్రాలను అంబులెన్సులో గాంధీ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో వారి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ప్రమాదంలో కారు ముందు భాగం బాగా దెబ్బతినగా అతివేగంగా అజాగ్రత్తగా కారు డ్రైవింగ్ చేయడంతోనే ప్రమాదం జరిగిందని, కారు నడిపిన వ్యక్తి కోసం గాలిస్తున్నామని ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఎస్ఐ శేఖర్ తెలిపారు.

## పాక్ ఆర్మీచీఫ్ ఆసిమ్‌మునీర్‌పై మౌలానా ధ్వజం

**పెషావర్, ఆగస్టు 24:** పాకిస్థాన్ సైన్యంపై ఆ దేశంలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జమియత్ ఉలేమాఎఇస్లాం (జేయూఐఎఫ్) చీఫ్ మౌలానా ఫజ్లుర్ రెహ్మాన్, ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్‌పై ఘాటు విమర్శలు గుప్పించారు. 1971 యుద్ధంలో పాకిస్థాన్ ఎదుర్కొన్న పరాభవాన్ని గుర్తుచేస్తూ, సైన్యం తీరును ఆయన తూర్పారబట్టారు. పెషావర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఫజ్లుర్ రెహ్మాన్ మాట్లాడుతూ, దేశంలో నిరంతర అణచివేత, రక్తపాతం కొనసాగితే నూతన భౌగోళిక సరిహద్దులు ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సామాన్య ప్రజలు అష్టకష్టాలు పడుతుంటే, సైన్యం ప్రగల్భాలు పలకడం ఎంతమాత్రం సరికాదని ఆయన మండిపడ్డారు. 1971 యుద్ధానికి ముందు నాటి ఆర్మీ చీఫ్ యాహ్యా ఖాన్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. "మేము శత్రువులతో పర్వతాల్లో, ఎడారుల్లో, వీధుల్లో పోరాడతాం. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరని యాహ్యా ఖాన్ నాడు అన్నారని, కానీ చివరకు పాకిస్థాన్ సైన్యం ఘోర పరాజయాన్ని మూటగట్టుకుందని రెహ్మాన్ ఎద్దేవా చేశారు. భారత్‌తో కేవలం 13 రోజుల పాటు జరిగిన ఆ యుద్ధం ఫలితంగానే బంగ్లాదేశ్ ఆవిర్భవించిందని, 1971 డిసెంబర్ 16న సుమారు 93వేల మంది పాకిస్థాన్ సైనికులు భారత దళాల ఎదుట లొంగిపోయారని ఆయన గుర్తుచేశారు. నాటి పరిస్థితులకు, నేటికీ పెద్దగా వ్యత్యాసం లేదని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే సైన్యం సంబరాలు చేసుకోవడం భావ్యం కాదని ఫజ్లుర్ రెహ్మాన్ అభిప్రాయపడ్డారు.



## చిన్నారి సృజనకు స్క్రాచ్ బుక్

బుజ్జాయిల కలల ప్రపంచా న్నంతా కళ్ల ముందు ఆవిష్కరించేలా చేస్తుందీ 'స్క్రాచ్ బుక్' ఇందులో పేజీపై పాపాయి గీసే ప్రతి గీత రంగుల వారివిల్లుగా ఆరిపోతుంది. కళాప్రపంచాన్ని వారెదుట ప్రత్యక్షమయ్యేలా చేసే ఈ బుల్ల పుస్తకం గురించి తెలుసుకుందాం..

ఆర్ట్.. చిన్నా, పెద్ద సైజుల్లో మార్కెట్‌లో లభ్యమయ్యే 'ఆర్ట్ స్క్రాచ్ బుక్‌లోవన్నీ నల్లని పేజీలే. ఈ డ్రాయింగ్ బుక్‌పై చెక్క. పెన్సిల్‌నే ఉపయోగిం చాలి. కందేలు, ఏనుగు, ప్రకృతిదృశ్యం, సూర్య చంద్రులు, అంతరిక్ష మంటూ మనసు కు నచ్చిన వాటిని పెన్సిల్‌తో ఈ పేజీలపై గీస్తే చాలు. రంగురంగుల బొమ్మలు ప్రత్యక్షమవు తాయి. చిన్నారుల సృజన్నాత్మకతను వెలికి తీస్తాయి. పిల్లలు గీసే ఈ చిత్రలేఖనాలను జ్ఞాపకాలుగా ఫ్రేమ్స్ చేసివారి గదికి అలంకరణగా మార్చితే చాలు. వారి కళ్లల్లో ఆనందం ఇంటినంతటినీ కళకళలాడేలా చేస్తుంది. ప్రేమగా.. స్క్రాచ్ పేపర్‌నోట్ బుక్‌లో తమ మనసులోని మాటకు పిల్లలు రంగులద్దొచ్చు. ప్రత్యేక రోజుల్లో అమ్మానాన్నలకు, స్నేహితులకు ప్రేమగా ఈ పేజీలపై రంగురంగుల అక్షరాలతో శుభాకాంక్షలు రాయొచ్చు. ఆరి మనసులో భావాలను అందంగా తీర్చిదిద్ది మరీ కానుకగా అందించొచున.వీటిని తల్లిదండ్రులు ఫ్రేమ్‌లుగా మార్చి ఇంటి అలంకరణలోనూ భాగం చేసుకోవచ్చు. ఇంట్లోనే స్వయంగా.. చిన్నారుల ఆలోచన లను రంగులుగా మార్చే స్క్రాచ్ బుక్‌ను ఇంట్లోనూ తయారు చేసుకోవచ్చు. ముందుగా దళసరి షీట్‌ను సిద్ధం చేసుకొని దానిపై రంగురంగుల క్రేయాన్స్‌తో పేజి మొత్తంగా గీయాలి. రెండు చెంచాల సబ్బు నీటిలో నలుపు రంగు అక్రిలిక్ పెయింట్ గంటలు అరనిస్తేచాలు. ఆర్ట్ స్క్రాచ్ పేజీ సిద్ధమైనట్టే. □

## ఫేస్‌వాష్ వాడుతుంటే..

మీ చర్మ సౌందర్యానికి పేస్‌వాష్ ఎంతగానో ఉపయోగపడు తుంది. ఎవరినో గుడ్డిగా అనుసరించక.. మీకు అనువైనదేదో మీరే ఎంచుకోండిలా..



ముఖం శుభ్రం చేసుకోవడానికేగా.. ఏదైతేనేం చాలామంది ఇలాగే అనుకుని అశ్రద్ధ చేస్తారు. క్రీములపై పెట్టన శ్రద్ధ దీనిపై పెట్టరు. కానీ అదే తగదు. మీది జిడ్డుచర్మం, యాక్నే కూడా ఉంటే జెల్, క్లే రకాలను ఎంచుకోండి. ఇవి నూనెల విడుదలనుతగ్గించడమే కాదు..యాక్నేకి కారణ మయ్యే బ్యాక్టీ రియానూ దూరం చేస్తాయి. పొడి, సెన్సిటివ్ చర్మాల వాళ్లకి క్రీమ్ తరహావి నప్పు తాయి. ఫోమ్ క్లెన్సర్లు కాంబి నేషన్ చర్మం ఉన్నవారికి సరిపోతాయి. అదే మిసెల్లర్ రకాలనుకోండి.. ఏచర్మరకమైనా ఎంచుకోవచ్చు. ఇక యాక్నే, బ్లాక్, వైట్ హెడ్స్ ఇబ్బంది పెడుతోంటే సాల్సిలిక్ యాసిడ్, బెంజైల్ పెరాక్సైడ్ ఉండేలా చూసుకోవాలి. టీట్రీ ఆయిల్ రకాల్లోని యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలూ యాక్నేకి చెక్ పెడతాయి. చర్మం పొడిబారి ముడతలు, గీతలు వస్తోంటే హైలురోనిక్ యాసిడ్, సెరమైడ్ రకాలు కావాలి. ఇవైతే కావాల్సిన తేమను అందించి, స్కిన్ నిగనిగలాడేలా చేస్తాయి. చరనమం నునుపుగా కనిపించాలి. పిగ్మెంటేషన్ పోవాలంటే నియాసినమైడ్ చక్కని పరిష్కారం.. మీ ఫేస్‌వాష్‌లో దీనికి చోటివ్వాల్సిందే. చర్మం తీరేదైనా.. ఎంచుకున్నా క్లెన్సర్‌లో సల్ఫేట్స్, కృత్రిమ, సింథటిక్ సువాసనలు, ఆల్కహాల్, థాలేట్స్, పారాబెన్స్ వంటివి ఉండకుండా చూసుకోండి. ఇవి చర్మానికి హాని కలిగించడమే కాదు.. అప్పటికే ఉన్న సమస్యలనీ తీవ్రతరం చేయగలవు. కాబట్టి.. ఎంచుకునేప్పుడే సరిచూసుకోండి. □



## వాన జల్లు కురువగానే..

ఎన్ని సార్లు శుభ్రం చేసుకున్నా ముఖం జిడ్డుగా మారడం, ఎంత దువ్వుకున్నా జుట్టు పిచ్చుక గూడులా తయార వడం.. వర్షాకాలంలో అధిక హ్యుమిడిటీ వల్ల తలెత్తే సమస్యలివి! ఇలాంటి వాతావరణాన్ని ఎదుర్కొని అందాన్ని సంరక్షించుకోవడ మంటే సవాలనే చెప్పాలి. ముఖ్యంగా కుదుళ్ల జిడ్డుగా మారడం, జుట్టు రాలడం, గడ్డిలా తయారవడం.. వంటి కేశ సంబంధిత సమస్యలు ఈ కాలంలో అమ్మాయిలకు ఎక్కువగా ఎదురవు తుంటాయి. అయితే జుట్టు ఆరోగ్యాన్ని సంరక్షించుకునే క్రమంలో కొన్ని చిట్కాలు పాటిస్తే హ్యుమిడిటీలోనూ కేశాలపట్టులా మెరిపించ వచ్చని చెబుతున్నారు చిట్కాలేంటో తెలుసుకుందాం..

**వానలో తడిశారా? ...** వానలో తడవడమంటే అందరికీ ఇష్టమే.. ముఖ్యంగా అమ్మాయిలైతే వర్షాన్ని మరింతగా ఎంజాయ్ చేస్తారు. అయితే ఇలా తడిసిన తర్వాత జుట్టును అలాగే ఆరబెట్టుకోవడం మనలో చాలామందికి అలవాటుకానీ అలా చేయకుండాచల్లటి నీటితో ఓసారి తలస్నానంన చేసి జుట్టు ఆరబెట్టు కోవాలి.

**స్టైలింగా..? వద్దే వద్దు....** జుట్టుతో రోజుకో రకమైన కొప్పు వేసుకోవడం లేదంటే వివిధ హెయిర్‌స్టైల్స్ ప్రయత్నించడం మనకు అలావాటే! అయితే ఈ క్రమంలో వేడి ఉత్పత్తి చేసే హెయిర్ స్టైలింగ్ టూల్స్ వాడక తప్పదు. అలాగని వాడితే జుట్టు ఆరోగ్యందెబ్బతినడం ఖాయం. అసలే హ్యుమిడిలీ కారణంగా జుట్టు గడ్డిలా తయారవుతుంది. దానిపై నుంచి హెయిర్‌స్టైలింగ్ చేశామంటే అది పిచ్చుక గూడులా మారిపోతుంది. కాబట్టి స్టైల్ అంటూ జుట్టును అలాగే వదిలేయడం, వివిధ రకాల హెయిర్ స్టైల్స్ ప్రయత్నించడం, హెయిర్ స్టైలింగ్ టూల్స్ వాడడంకంటే.. చక్కగా పైకి ముడే సుకోవడం/బన్ వేసుకోవడం లేదంటే నీట్‌గా జడ వేసు కోవడం మంచిది.

**నూనె పెట్టుకోవద్దు !.....** జుట్టు, కుదుళ్ల ఆరోగ్యంగా ఉండానికి తరుచు నూనె పెట్టుకోవాలి.,వర్షాకాలంలో మాత్రం ఈ అలవాటును కాస్త తగ్గించు కోవడం మంచిదంటున్నారు. ఎందుకంటే నూనెకు వర్షాకాలంలో ఉండే హ్యుమిడిటీ కూడా తోడవడంతో జుట్టు మరింత జిడ్డుగా మారుతుంది. దీనివల్ల కుదుళ్లలో చుండ్రు, ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఎక్కువ మరి, జుట్టుకు నూనె లేకపోతే ఎలా? అనుకోకడి. నూనెకు బదులు నీటి ఆధారిత సీరమ్స్ వాడవచ్చు. తద్వారా జిట్టు జిడుడ్డగా మారకుండా జాగ్రత్త పడచ్చు. అయితే మరీ అంతగా నూనె పెట్టుకోవాలనుకునే వారు పడుకునే ముందు కుదుళ్ళుజిట్టుకు నూనె పట్టించి.. ఉదయాన్నే గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేసేయాలి.

**ఇలాంటప్పుడు సీరమ్ మంచిదే !..** కొంతమంది జుట్టు ఎంత దువ్వినా కాసేపటికే చెదిరిపోతుంది. దీంతో పదే పదే దువ్వుకోవడం, ఎక్కడికక్కడ హెయిర్ పిన్స్/క్లిప్స్ పెట్టేయడం.. వంటివి చేస్తుంటారు. నిజానికి దీనివల్ల జుట్టు చెదిరిపోకుండా ఉండడమేమో గానీ.. పిన్స్/క్లిప్స్ పెట్టేయడం.. వంటివి చేస్తుంటాయి నిజానికి దీనివల్ల జుట్టు చెదిరిపోకుండా ఉండడమేమో గానీ.. పిన్స్ తీసేశాక మరింత గడ్డిలాగా మారుతుంది. అందుకే అలాటి వారు జడ/హెయిర్‌స్టైల్ వేసుకోవడానికి ముందు కాస్త హెయిర్ సీరమ్‌ని అప్లై చేసుఎకుంటే ఫలితం ఉంటుందంట! □

## తులసి పవిత్రం

మహిళలు భక్తి శ్రద్ధలతో తులసి మాతను పూజిస్తారు. ఈ తులసి శ్రీ మహావిష్ణువుకు ప్రీతికరమైనది. అందుకే శ్రీ మహా విష్ణువును పూజించడానికి తులసిదళం ఉపయోగిస్తారు. దేవతారాధనలో తులసి ఎంతో విశిష్టమైన స్థానం వున్నది. తులసి మొక్కలు పెరటిలో పెంచుతారు. అక్కడ పవిత్రంగా ఉంచాలి. అపరి శుభ్రత ఉండరాదు. తులసి ఆకులను మాత్రమే తుంచాలి. కొమ్మలను విరువకూడదు. పవిత్రమైన మొక్క తులసి మొక్కగా భావించాలి. సమస్త తీర్థాలు, పవిత్ర నదులు, దేవతలు అందరూ తులసి దళాల్లోనే నివసిస్తారు. అనిపురాణాలు చెబుతున్నాయి. గోదాదేవి కళ్యాణం తులసి అలంకరణతోనే జరగడం విశేషం.



గంగానదిలో స్నానం చేస్తే ఎంత ఫలితం కలుగుతుందో అంతట ఫల తులసిని పూజిస్తే కలుగుతుంది. పెళ్లికాని యువతులు తులసికోటని ప్రతి నిత్యం పూజిస్తే చక్కటి ఫలితం లభిస్తుంది. తులసి పరిమళం పవిత్రంగా ఉంటుంది. భక్తి శ్రద్ధలతో తులసిని పూజిస్తే చేసిన పాపాలన్నీ పోతాయి ఓమ్‌నమో నారాయణాయ అని తలచి తులసి ఆకు తుంచాలి. 2తులసి కోట వద్ద సంధ్యా దీపం వెలిగిస్తే శివకేశవులు కొలువుంటారు. శ్రీ కృష్ణుడు, శ్రీ మహావిష్ణువు ఆరాధనలో తులసి దళం వాడకం విశిష్టమైనది. తులసి దళం ప్రాముఖ్యత గురించి విష్ణుపురాణంలో వివరించడం జరిగింది. అనవసరంగా ఎప్పుడు పడితే అప్పుడు తులసి దళాలు తుంచరాదు. పవిత్రమైన తులసి దళాలు తిరుమల శ్రీవారి అలంకారములలో తులసి దళం ఉపయోగిస్తాం. ఇంటి వాకిట తులసి కోట కళకళ లాడుతూ ఉండాలి. ప్రతి నిత్యంఅలికి ముగ్గు వేసి పరిశుభ్రత పాటించాలి. ఆయుర్వేదం లో తులసి ప్రాముఖ్యత అద్భుతంగా వివరించారు. రోజూ రెండు తలసి ఆకులనుతింటే మంచిది ఆరోగ్యకరం. □

## జ్ఞాపక వృద్ధికి..




ఒకప్పుడు పెద్దవాళ్ల మాత్రమే మతిమరపుతో బాధపడేవారు. ఇప్పుడలా కాదు. అందరికీ జ్ఞాపకశక్తి తగ్గిపోతోంది. దీనికి ఒత్తిడీ, ఆందోళనే ముఖ్య కారణం. యోగా, వ్యాయామాలతో చాలావరకూ ఒత్తిడి తగ్గుతుంది. మెదడు ఉత్సాహంగా పనిచేయాలంటే.. జీవనశైలి కూడా సరిగ్గా ఉండాలి. రాత్రి పదింటిలోపు పడుకుని ఉదయం ఐదింటికల్లా నిద్రలేవాలి. దాంతో పాటు ఈ ఆహార పదార్థాలనూ క్రమం తప్పకుండా తింటుండాలి. ✦ ఆకలి తీరితే చాలనుకుని అన్నంలో పచ్చడో, రసమో కలిపి తినడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. ప్రొటీన్లు ఉన్న పప్పుధాన్యాలు తినాలి. మంచి పోషకాహారం అందితే మెదడు చురుగ్గా పనిచేస్తుంది.

✦. ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్స్, యాటీ ఆక్సిడెంట్స్ ఉన్న బాదం, పిస్తా, వాల్‌నట్స్, జీడిపప్పు లాంటివి తినడం వల్లమెదడులో కణాలు పాడు కావు. దాని పనితీరూ మెరుగవు తుంది.

✦. బ్రొకోలీలో మెదడుకు చాలా అవసరమైన కె-విటమిన్ విస్తారంగా ఉంటుంది. ఇది జ్ఞాపకశక్తి తగ్గకుండా కాపాడుతుంది.

✦. నేరేడు, స్ట్రాబెర్రీస్, రేగుపండ్లు, ఉల్లి, వెల్లుల్లి, అవొకాడోల్లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇవి మెదడు పనితీరు బాగుండేలా చేస్తాయి. అప్పుడప్పుడూ డార్క్ చాక్లెట్ తిన్నా మెదడు పనితీరులో సమస్య రాదు. ✦ చివరగా మరో విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఏదో తప్పదన్నట్టుగా కాకుండా. ఆస్వాదిస్తూ తినడం వల్ల ఆహారం చక్కగా వంటబడుతుంది. □



## భావోద్వేగాల కలబోత

టాలీవుడ్‌లో కమెడియన్‌గా, విలక్షణ నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రంగస్థలం ఫేమ్ ఆచంట మహేష్ ఇప్పుడు కథానాయకుడిగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. ఆయన కథానాయకుడిగా, కాంచన దీప్తిరెడ్డి కథానాయికగా రూపొందుతున్న నూతన చిత్రం శివాలయం హైదరాబాద్‌లోని తెలుగు ఫిలిం ఛాంబర్‌లో పూజా కార్యక్రమాలతో సోమవారం ఘనం గా ప్రారంభమైంది. వెంకట్ రెడ్డి నంది స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న ఈ చిత్రం, ఆధ్యా త్మికతను, భక్తి భావాన్ని మానవ భావోద్వేగాలతో సమ్మిళితం చేస్తూ సాగనుంది. ముహూర్తపు సన్నివేశానికి దిల్ రమేష్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, నటుడు ఘర్షణ శ్రీనివాస్ తొలి క్లాప్ కొట్టారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యవసాయవేత్త కళ్లెం నరసింహారెడ్డితో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరై చిత్రయూనిట్‌కు అభినందనలు తెలిపారు. దేవుడి నేపథ్యంలో వచ్చే కథలకు ప్రేక్షకుల్లో ఎప్పుడూ ఆదరణ ఉంటుందని, ఈ సినిమాలో తాము ఒక మంచి భక్తిరస కథాంశంతో పాటు బలమైన భావోద్వేగాలను చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది. ఈ ప్రాజెక్ట్ కోసం గత ఆరు నెలలుగా ప్రీప్రొడక్షన్ పనులు వేగంగా సాగాయని, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిం చనున్నట్లు మేకర్స్ వెల్లడించారు.



## ప్రియురాలితో మూడు ముళ్లు

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో ప్రిన్స్ సెసిల్ వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు. తన సుదీర్ఘకాల ప్రియురాలు సాయి ప్రతిమను ఆయన పెళ్లి చేసుకున్నారు. న్యూజిలాండ్‌లోని అత్యంత రమణీయమైన వనాకా ప్రాంతంలో హిందూ సంప్రదాయ పద్ధతిలో వీరి వివాహ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ప్రకృతి ఒడిలో జరిగిన ఈ వేడుకకు ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ వేడుకలో వధువు సాయి ప్రతిమ ఎరుపు రంగు పట్టుచీర, సంప్రదాయ ఆభరణాలతో రాయల్ లుక్‌లో మెరిసిపోగా.. వరుడు ప్రిన్స్ ఐవరీ కలర్ ప్రింటెడ్ పైజామాలో రాజకుమారుడిలా కనిపించారు. వీరిద్దరి ప్రేమ ప్రయాణం ఒక ఆసక్తికర పరిణామంతో మొదలైంది. ప్రముఖ నటుడు ప్రియదర్శి ద్వారా ఒక కామన్ ఫ్రెండ్ పెళ్లిలో ప్రిన్స్, సాయి ప్రతిమలకు తొలిసారి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కొద్దిరోజుల్లోనే స్నేహంగా, ఆ తర్వాత ప్రేమగా మారి ఇప్పుడు పెళ్లి పీటల వరకు తీసుకెళ్లింది.

# తెర

## సూరి కోసం అప్సరసలు ఎందుకు వచ్చారు?



ఒకప్పుడు కామెడీ కింగ్‌గా వరుస విజయాలతో అలరించిన అల్లరి నరేష్, గత కొన్నేళ్లుగా సీరియస్ కథాంశాలు ఉన్న సినిమాలు చేస్తూ వస్తున్నారు. నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను సాధించలేకపోయారు. ఈ క్రమంలో మళ్లీ తనకు అలవాటైన సొంత జోనర్ వైపు అడుగులు వేస్తూ, అవుట్ అండ్ అవుట్ ఫన్ అండ్ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా రంభ ఊర్వశి మేనక చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ పతాకాలపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి చంద్రమోహన్ చింతడ దర్శకత్వం వహించారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్ ఆకట్టుకోగా, సెప్టెంబర్ 4న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో మేకర్స్ తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. చిన్నతనం నుంచి సూరి (అల్లరి నరేష్) దేవలోకం నుండి రంభ, ఊర్వశి, మేనక అనే ముగ్గురు అప్సరసలు భూమిపైకి వచ్చి తన కోరికలు తీరుస్తారని గట్టిగా నమ్ముతుంటాడు. అనుకోకుండా దేవేంద్రుడికి తెలియకుండా ఆ ముగ్గురు అప్సరసలు సూరి కోసం భూమిపైకి వస్తారు. ఈ విషయం తెలుసుకున్న దేవేంద్రుడు ఆగ్రహంతో వారి శక్తులను తీసివేస్తాడు. దీంతో సూరి ఆశలు ఆవిరైపోతాయి. అసలు సూరి కోసం వారు ఎందుకు వచ్చారు? ఆ తర్వాత ఎదురైన విచిత్రమైన, హాస్యభరితమైన పరిస్థితులు ఏంటి? దేవేంద్రుడికి సూరిపై ఉన్న కోపానికి కారణమేంటి? సూరి అసలు కోరికలు నెరవేరాయా లేదా? అనేదే ఈ చిత్ర ప్రధాన కథాంశం. అల్లరి నరేష్ తనదైన కామెడీ టైమింగ్, పంచ్ డైలాగులతో ట్రైలర్‌ను ఆద్యంతం వినోదాత్మకంగా నడిపించారు. దర్శకుడు బోయపాటి శ్రీను సిగ్నేచర్ హావభావాలను ఇమిటేట్ చేయడం, అలాగే చివర్లో ఓజీ సినిమాలోని వాషీ.. ఓ వాషీ డైలాగ్‌ను తన శైలిలో పలకడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సిద్ధార్థ్ మల్హోత్రా, తమన్నా భాటియా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న బాలీవుడ్ భారీ చిత్రం ది వీవాన్ నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. దీపక్ మిశ్రా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా టీజర్ విడుదల తేదీని నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఈ నెల 25న టీజర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు వెల్లడించారు. తాజాగా సూర్యాస్తమయం తర్వాత ఎక్కడికి వెళ్లడం నిషిద్ధమో.. కథ అక్కడి నుంచే మొదలవుతుంది.

## చీకటి పడ్డాక నిషిద్ధ ప్రాంతం నుంచే..

సెప్టెంబర్ 25న ఆ గర్జన వినిపించబోతోంది అనే శక్తివంతమైన డైలాగ్‌తో మేకర్స్ కొత్త వీడియో గ్లింప్స్‌ను విడుదల చేశారు. శతాబ్దాలుగా ఎదురుచూస్తున్న ది వీవాన్ ఎవరు? అతడి రహస్యమేంటి? అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ కథనం సాగనుందని తెలుస్తోంది. సిద్ధార్థ్ మల్హోత్రాను ఇప్పటివరకు చూడని విభిన్నమైన అవతార్‌లో చూపించబోతుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అరుణాభ్ కుమార్ కథను అందించిన ఈ చిత్రాన్ని బాలాజీ మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై శోభా కపూర్, ఏక్తా ఆర్. కపూర్, అరుణాభ్ కుమార్, నీరజ్ కొఠారి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో సునీల్ గ్రోవర్, మనీష్ పాల్, శ్వేతా తివారీ, సోనియా అన్ను కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 25న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

## ధర్మాధర్మాల మధ్య పోరు



హనుమాన్ ప్రపంచవ్యాప్త విజయం తర్వాత ప్రశాంత్ వర్మ క్రియేటివ్ యూనివర్స్ నుంచి రాబోతున్న అత్యంత ప్రతిష్టాత్మక పౌరాణిక ఫాంటసీ చిత్రం మహాకాళి. పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి మేకర్స్ తాజాగా విడుదల చేసిన శుక్రాచార్య వార్ క్రై గ్లింప్స్ ఇప్పుడు సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇటీవల ధురంధర్ చిత్రంతో ఆకట్టుకున్న బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా, ఈ సినిమా ద్వారా తెలుగులోకి అరంగేట్రం చేస్తూ అసుర గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. పొడవైన తాపసి గడ్డం, రుద్రాక్షలు, జటాజూటంతో గుర్తు పట్టలేనంత తీవ్రమైన విలనిజం నిండిన అక్షయ్ ఖన్నా లుక్ ఈ గ్లింప్స్‌కి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. గ్లింప్స్‌లో శంకరాచార్య గొంతుతో సాగే ఏది ధర్మం.. ఏది అధర్మం? అనే ప్రశ్నలు దేవతలు, అసురుల మధ్య ఉన్న వైరాన్ని లోతుగా విశ్లేషించేలా ఉన్నాయి. క్షీ రసాగర మథనంలో అమృతం కేవలం దేవతలకే దక్కడం, అసురులకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ సాగే డైలాగ్స్ ధర్మాధర్మాల గీతను ప్రశ్నించేలా రూపొందించారు. వీడియో ముగింపులో నటి శ్రియా రెడ్డి పెద్దమ్మ చూస్తుంది రా!... అంటూ పవర్‌ఫుల్ అవతారంలో మెరిసి సర్‌ప్రైజ్ చేశారు. భూమి శెట్టి, రోహిత్ సరాఫ్, సముద్రఖని తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని 2027 జనవరి 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ఆర్కేడీ స్టూడియోస్ అధికారికంగా ప్రకటించింది.



## 1500 మందితో డబ్బింగ్

దర్శధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబుల క్రేజీ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ పాన్ వరల్డ్ మూవీ వారణాసి. గ్లోబల్ ప్రేక్షకులను రీచ్ అవ్వడం కోసం ఈ చిత్రాన్ని 50 కంటే ఎక్కువ భాషల్లో డబ్బింగ్ చేయాలని జక్కన్న నిర్ణయించారు. ప్రస్తుత ట్రెండ్ ప్రకారం సింథటిక్ వాయిస్ ఉపయోగించి సులభంగా డబ్బింగ్ చేసే వెసులుబాటు ఉన్నప్పటికీ, రాజమౌళి మాత్రం నాణ్యత, సహజత్వంకే ప్రాధాన్యతనిస్తున్నారు. ఏ దేశ ప్రేక్షకుడు చూసినా ఆ పాత్రలోని భావోద్వేగాలు నేరుగా కనెక్ట్ అవ్వాలనే ఉద్దేశంతో ఒరిజినల్ వాయిస్ ఆర్టిస్టులనే ఎంపిక చేస్తున్నారు. దీని కోసం దాదాపు 1500 మందికి పైగా డబ్బింగ్ ఆర్టిస్టులతో ఆడిషన్లు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

## సబ్‌స్క్రిప్షన్ లేకుండా ఓటీటీ ప్లాట్‌ఫామ్

సామాజిక సేవా సంస్థ యువర్ బ్యాకర్స్ ఫౌండేషన్ డిజిటల్ వినోద రంగంలోకి అడుగుపెడుతూ యువర్ బ్యాకర్స్ ప్లే పేరుతో ప్రపంచంలోనే మొట్టమొదటి లాభాపేక్ష లేని డిజిటల్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించింది. నగరంలో జరిగిన ఈ ప్రారంభోత్సవ వేడుకకు తమిళ చిత్రసీమకు చెందిన ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, సీనియర్ నటుడు ఎస్వీ శేఖర్ తదితర ప్రముఖులు హాజరై యాప్‌ను ప్రారంభించారు. ఈ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో సినిమాలు చూసేందుకు ఎలాంటి సబ్‌స్క్రిప్షన్ లేదా నెలవారీ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. వీక్షకులు ఉచితంగానే సినిమాలు తిలకించవచ్చని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కిశోర్ ఆదిత్య తెలిపారు.

## పుస్తక రూపంలో రజనీకాంత్ జీవితకథ

సూపర్ స్టార్ రజనీకాంత్ తన సుదీర్ఘ సినీ ప్రయాణాన్ని, వ్యక్తిగత అనుభవాలను పుస్తక రూపంలో అభిమానులకు అందించబోతున్నారు. ఈ విషయాన్ని ఆయన కుమార్తె సౌందర్య రజనీకాంత్ ఒక ఇంటర్వ్యూలో అధికారికంగా వెల్లడించారు. ఐదు దశాబ్దాల సినీ ప్రయాణంలో రజనీ సాధించిన విజయాలు, ఎదుర్కొన్న సవాళ్లతో ఈ పుస్తకం ప్రత్యేకంగా రూపుదిద్దుకుంటోంది. పరమహంస యోగానంద రాసిన ఒక యోగి ఆత్మకథలాగే ఈ పుస్తకం కూడా తరతరాలకు స్ఫూర్తినిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.



మూవింగ్ డ్రీమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై మేరుం భాస్కర్ నిర్మాణంలో, జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ధర్మస్థల నియోజకవర్గం.

## మైసూరు ప్యాలెస్‌లోన ఉండాల్సిందాన్ని..

తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన న్యాయం చేయరా దేవుడా థియేట్రికల్ ఎక్స్‌టెండెడ్ వీడియో సాంగ్ సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటూ ట్రెండ్ అవుతోంది. ఆస్కార్ అవార్డ్ గ్రహీత, ప్రముఖ గేయ రచయిత చంద్రబోస్ ఈ పాటకు శక్తివంతమైన సాహిత్యాన్ని అందించగా, ఆయన చేతుల మీదుగానే ఈ సాంగ్‌ను విడుదల చేశారు. స్టార్ సింగర్ సునీత ఉపద్రష్ట తన మధురమైన, హుషారైన గాత్రంతో ఆలపించగా, సంగీత దర్శకుడు మహావీర్ యేలేందర్ అదిరిపోయే మాస్ బీట్‌ను సమకూర్చారు. ఈ పాటకు శ్రష్టి వర్మ అద్భుతంగా డ్యాన్స్ చేయడంతో పాటు, స్వయంగా కొరియోగ్రఫీ కూడా చేయడం విశేషం.



# వరల్డ్ కప్ సెమీఫైనల్స్‌కు.. భారత్ పురుషుల హాకీ జట్టు అగ్నిపరీక్ష

**న్యూఢిల్లీ:** వర్డ్ కప్ సెమీఫైనల్స్ అర్హత సాధించడం భారత పురుషుల హాకీ జట్టుకు అగ్నిపరీక్ష అయింది. ప్రస్తుతం బెల్జియంలోని వావ్రే, నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టెల్వీన్‌లలో సంయుక్తంగా నిర్వహిస్తున్న 2026 ఎఫ్ఐహెచ్ హాకీ ప్రపంచ కప్‌లో పోటీపడుతోంది. తమ గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచిన భారత్, ఫేజ్ 2కు చేరుకుంది. వేల్స్‌పై 3-1 తేడాతో గెలుపుతో ప్రారంభించిన భారత్, ఆ తర్వాత ఇంగ్లాండ్ చేతిలో 2-4 తేడాతో ఓటమి చవిచూసింది. అనంతరం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 5-3 తేడాతో విజయం సాధించి పుంజుకున్న భారత్, ఫేజ్ 2లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఫేజ్ 2లో భారత్ ఇప్పుడు నెదర్లాండ్స్, అర్జెంటీనా, ఇంగ్లాండ్‌లతో పూల్ ఈ లో ఉంది. రెండో రౌండ్‌ను భారత్ నెదర్లాండ్స్‌తో 1-3 తేడాతో ఓటమితో ప్రారంభించింది. ఈ ఓటమి సెమీఫైనల్స్‌కు మరింత కష్టతరం చేసినా, అవకాశాలు ఇంకా సజీవంగా ఉన్నాయి. సెమీఫైనల్స్‌కు అర్హత సాధించడానికి భారత్ ముందు మూడు అవకాశాలు ఉన్నాయి. వీటిలో భారత్ ముందుగా అర్జెంటీనాను ఓడించి, వీలైనన్ని ఎక్కువ గోల్స్ చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలి. ఒకవేళ భారత్ అర్జెంటీనాను 2 గోల్స్ తేడాతో ఓడించి, సెమీఫైనల్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే నెదర్లాండ్స్ ఇంగ్లాండ్‌ను 3 గోల్స్ తేడాతో ఓడించాల్సి ఉంటుంది. భారత్ అర్జెంటీనాను 3 గోల్స్ తేడాతో ఓడిస్తే, నెదర్లాండ్స్ ఇంగ్లండ్‌ను 2 గోల్స్ తేడాతో, 4 గోల్స్ తేడాతో ఓడిస్తే, నెదర్లాండ్స్ ఇంగ్లండ్‌ను ఒక గోల్ తేడాతో ఓడించాల్సి ఉంటుంది. అర్జెంటీనాపై భారత్ సాధించే విజయ మార్జిన్ ఎంత ఎక్కువగా ఉంటే, ఇంగ్లాండ్‌పై నెదర్లాండ్స్‌కు అవసరమయ్యే మార్జిన్ అంత తక్కువగా ఉంటుంది. జట్టు ఇప్పుడు నెదర్లాండ్స్ ఇంగ్లాండ్ మ్యాచ్‌పై దృష్టి సారిస్తూనే, అర్జెంటీనాపై అవసరమైన ఫలితాన్ని సాధించడంపై దృష్టి పెట్టాలి. ఫలితంతో పాటు, గెలుపు అంతరం కూడా అంతే ముఖ్యం. ఇవన్నీ జరిగితేనే పురుషుల జట్టు హాకీ ప్రపంచ కప్ సెమీఫైనల్స్‌కు చేరుకునే అవకాశం ఇంకా ఉంది.



# వరల్డ్ బ్యాడ్మింటన్ క్వీన్‌గా అన్‌సే యంగ్

**న్యూఢిల్లీ:** దక్షిణ కొరియాకు చెందిన ప్రపంచ నంబర్ 1 క్రీడాకారిణి ఆన్ సేయంగ్ న్యూఢిల్లీలో జరిగి బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుని ప్రపంచ బ్యాడ్మింటన్ క్వీన్‌గా నిలిచింది. ఆమె జపాన్‌కు చెందిన అకానె యమగుచిని ఫైనల్‌లో కేవలం 49 నిమిషాల్లోనే 21-17, 21-14 తేడాతో ఓడించింది. పాదపు గాయంతో బాధపడుతూ ఆడినప్పటికీ, ఒక్క గేమ్ కూడా కోల్పోకుండా ఆరు మ్యాచ్‌లనూ గెలిచి, (2023 విజయం తర్వాత) తన రెండవ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఆరంభ పోరు తర్వాత, 7-7తో సమంగా ఉన్న స్కోరు నుండి సేయంగ్ ఊపు అందుకుని, వరుసగా పాయింట్లు సాధిస్తూ విరామ సమయానికి 11-8 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే, యమగుచి ఆమెను అంత సులభంగా గెలవనివ్వలేదు. 15-15 స్కోరు వద్ద, జపనీస్ క్రీడాకారిణి కొద్దిసేపు ఊపుతో ఆడించి. అయితే 17-17 స్కోరుతో ఆట సమంగా ఉన్నప్పుడు, కొరియన్ నిర్ణయాత్మక విజృంభణ చేసి వరుసగా నాలుగు పాయింట్లుతో 21-17తో ఆధిక్యంకి వచ్చింది. రెండవ సెట్‌లో, యమగుచి 6-5 ఆధిక్యంతో ప్రారంభించినప్పటికీ, సేయంగ్ నిలకడగా ఆడి 7-7తో సమం చేసింది. తర్వాత 8-7 స్కోరు వద్ద, సేయంగ్ వేగంగా డౌన్‌దిలైన్ స్మాష్‌ను కొట్టింది. యమగుచి తన రాకెట్‌ను షటిల్‌కు తగిలించగలిగింది, కానీ తేరుకునే ప్రయత్నంలో ఆమె కోర్టులో కుప్పకూలిపోయింది. సేయంగ్ మళ్ళీ డౌన్ ది లైన్ స్మాష్‌కు ప్రయత్నించి విరామ సమయానికి, ఆమె 11-7 ఆధిక్యంలో ఉంది. అదృష్టవశాత్తూ నెట్ కార్డ్ తగలడంతో యమగుచి స్కోరు అంతరాన్ని 11-9కి, ఆపై 11-10కి తగ్గించగలిగింది. 13-11 వద్ద సేయంగ్ తడబడినా 16-11 స్కోరు వద్ద యమగుచి కొట్టిన షాట్ గురితప్పింది. సేయంగ్ ఆ తర్వాతి మూడు పాయింట్లను 18-14. 19-14. 20-14తో విజయాన్ని కైవసం చేసుకుంది.

# మహిళల ఛాంపియన్స్.. గ్రూప్‌స్టేజ్‌కు అర్హత సాధించిన బెంగాల్

**న్యూఢిల్లీ:** వరుసగా రెండుసార్లు ఏఎఫ్‌సి మహిళల ఛాంపియన్స్ లీగ్ గ్రూప్ స్టేజ్‌కు అర్హత సాధించి ఈస్ట్ బెంగాల్ చరిత్ర సృష్టించింది. మ్యాచ్‌లో మలేషియా క్లబ్ సబాను 2-0 తేడాతో ఓడించిన ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సి, ఎఎఫ్‌సి మహిళల ఛాంపియన్స్ లీగ్ గ్రూప్ దశలో వరుసగా రెండుసార్లు ఆడిన తొలి భారతీయ క్లబ్‌గా నిలిచింది. కోట కినాబాలులోని లికాస్ స్టేడియంలో రెండవ అర్ధభాగంలో ఒలివియా అనోక్యే (67వ నిమిషం) మరియు సౌమ్య గుగులోత్ (87) చేసిన గోల్స్‌తో హోరాహోరీగా సాగిన పోరు ముగిసింది. దీంతో ఈస్ట్ బెంగాల్ గరిష్ట పాయింట్లతో గ్రూప్ ఎ లో అగ్రస్థానంలో నిలిచింది. ఐడబ్ల్యూఎల్ ఛాంపియన్లు అంతకుముందు రాజ్‌షాహి స్టార్స్ (బంగ్లాదేశ్)ను 4-0తోను, రోవర్స్ (గ్వామ్)ను 12-0తో ఓడించారు. ఆట ఉత్కంఠభరితంగా ప్రారంభమైన తర్వాత, 21వ నిమిషంలో మిసాకి నకయామా కొట్టిన హాఫ్‌వాలీ గోల్ పోస్ట్ పైనుంచి వెళ్ళిపోవడంతో సబా అవకాశాలను



సృష్టించడం మొదలుపెట్టింది. మైలిసా అటిస్ ఫస్ట్‌టైమ్ క్రాస్‌ను అందించగా, ఎంజీ బ్రౌసార్డ్ ప్రయత్నాన్ని విఫలం చేసింది. రెండవ అర్ధభాగంలో ఆట మరింత సమంగా సాగింది. జూలియానా బారెక్ స్లాలోమింగ్ చేస్తూ బాక్స్‌లోకి దూసుకెళ్లింది, కానీ అది విఫలమైంది. 55వ నిమిషంలో సౌమ్య దూసుకెళ్లి బంతిని అందించగా, సులంజనా రౌల్ బలంగా హెడర్ చేయగా, సబా గోల్ కీపర్ జునైదీ దానిని అడ్డుకున్నాడు. ఈస్ట్ బెంగాల్ ఊపందుకుంటున్న తరుణంలో, స్టెఫీ నుండి తప్పించుకుంటూ ముందుకు దూసుకెళ్తున్న ఒలివియాకు తర్వాతి అవకాశం లభించగా, జునైదీ చేసిన ధైర్యమైన బ్లాక్ ఆమెను అడ్డుకుంది.
సులంజన ఇచ్చిన త్రూ పాస్‌ను అందుకున్న ఒలివియా వేగంతో సితి నుర్ఫైజాను అధిగమించి, రెండవ ప్రయత్నంలో గోల్ చేసింది. సబ్స్టిట్యూట్ రింపా హాల్దార్ అందించిన క్రాస్‌ను సౌమ్యగోల్‌గా మలచడంతో మోషల్‌గర్ల్స్ విజయాన్ని ఖాయం చేసుకుంది.







# తొలి రెండు టెస్టుల తర్వాత.. అత్యధిక వికెట్లు తీసిన భారత్ బౌలర్లు

## టాప్ 5లో నరేంద్ర హిర్వానీ

**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో టెస్ట్ కెరీర్‌ను ఘనంగా ప్రారంభించడం చాలా అరుదు. తొలి రెండు మ్యాచ్‌లలోనే అత్యధిక వికెట్లు తీయడం మరింత అరుదు. గత కొన్నేళ్లుగా భారత బౌలర్లు కొన్ని అద్భుతమైన ఆరంభ ప్రదర్శనలు కనబరిచారు. కేవలం రెండు టెస్టుల తర్వాత అత్యధిక వికెట్లు తీసిన వారి జాబితాలో 1980ల చివర్లో ఆడిన ఒక లెగ్ స్పిన్నర్ అగ్రస్థానంలో ఉండగా, ఇటీవలి స్టార్లు కూడా ఈ జాబితాలో ఉన్నారు. భారత్ స్టార్ ప్లేయర్ నరేంద్ర హిర్వానీ 24 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ యువ లెగ్ స్పిన్నర్ 1988 జనవరిలో చెన్నైలో వెస్టిండీస్ మ్యాచ్‌లో టెస్ట్ చరిత్రలోనే అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనలలో ఒకటి కనబరిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో 61 పరుగులు ఇచ్చి 8 వికెట్లు, ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో 75 పరుగులకు 8 వికెట్లు పడగొట్టాడు. దీంతో అరంగేట్రంలోనే ఒకే టెస్టులో 16 వికెట్లు తీసిన అతని రికార్డు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. ఆ ఏడాది చివర్లో బెంగళూరులో న్యూజిలాండ్‌తో జరిగిన రెండవ టెస్టులో, హిర్వానీ మరో 8 వికెట్లు పడగొట్టాడు. ఇందులో రెండవ ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్ల ప్రదర్శన కూడా ఉంది. రెండు మ్యాచ్‌ల తర్వాత అతను తీసిన మొత్తం 24 వికెట్లు అత్యధికంగా నిలిచింది. ఇక అక్షర్ పటేల్ 18 వికెట్లతో ఈ జాబితాలో రెండవ స్థానంలో ఉన్నాడు. ఈ ఎడమచేతి వాటం స్పిన్నర్ 2021 ప్రారంభంలో ఇంగ్లాండ్‌తో స్వదేశంలో జరిగిన టెస్ట్ సిరీస్‌లో 11 వికెట్లు పడగొట్టాడు. ఇందులో మొదటి ఇన్నింగ్స్‌లో 38 పరుగులకు 6 వికెట్లు, ఆ తర్వాత రెండవ ఇన్నింగ్స్‌లో 32 పరుగులకు 5 వికెట్లు ఉన్నాయి. తదుపరి ఇంగ్లాండ్ టెస్టులో అతను మరో 9 వికెట్లు పడగొట్టాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను అతను 27 వికెట్లతో ముగించాడు. అలాగే 17 వికెట్లతో ఎడమచేతి వాటం స్పిన్నర్ మానవ్ సుతార్ జూన్ 2026లో ముల్లన్‌పూర్‌లో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు, రెండవ ఇన్నింగ్స్‌లో మరో వికెట్ పడగొట్టాడు. 2026 ఆగస్టులో గాలేలో శ్రీలంక రెండవ టెస్టులో, అతను మొదటి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు, రెండవ ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు తీసి, మ్యాచ్ గణాంకాలను 131 పరుగులకు 10 వికెట్లతో ముగించాడు. 1980 లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆఫ్ స్పిన్నర్ నందలాల్ యాదవ్ తన మొదటి రెండు మ్యాచ్‌లలో 13 వికెట్లు పడగొట్టాడు. పొడగరి అయిన కుడిచేతి మీడియం పేసర్ వెంకటేష్ ప్రసాద్ తన తొలి రెండు టెస్ట్ మ్యాచ్‌ల తర్వాత 13 వికెట్లు కూడా పడగొట్టాడు. బంతిని స్వింగ్ చేయగల సామర్థ్యానికి, క్రమశిక్షణతో కూడిన లైన్ అండ్ లెంగ్త్‌ను పాటించగలగడానికి అతను గుర్తింపు పొందాడు.

# శ్రీలంకతో 2వ టెస్ట్: భారీస్కోర్ 503 వద్ద భారత్ డిక్లేర్డ్!

**కొలంబో:** శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా భారీ స్కోర్ చేసింది. ధ్రువ్ జురెల్(115 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 503/9 భారీ స్కోర్ వద్ద డిక్లేర్డ్ చేసింది. రిషభ్ పంత్(63) హాఫ్ సెంచరీతో రాణించాడు. 300/5 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు సోమవారం ఓవర్‌నైట్ బ్యాటర్ సారాన్ష్ జైన్(6) రెండు పరుగులు మాత్రమే చేసి అసితా ఫెర్నాండో బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. దాంతో రిషభ్ పంత్ బ్యాటింగ్‌కు దిగి



ధ్రువ్ జురెల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ముఖ్యంగా పంత్ భారీ షాట్లతో లంకబౌలర్లపై విరుచుకుపడి 81 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకోగా, ధ్రువ్ జురెల్ 97 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. దాంతో భారత్ 419/6 స్కోర్ వద్ద లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. తర్వాత పంత్ భారీ సిక్సర్లతో విరుచుకుపడగా, అతన్ని కుశార నువాంత క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో 7వ వికెట్‌కు నమోదైన 112 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి మానవ్ సుతార్ రాగా జురెల్ తన జోరును కొనసాగించాడు. మానవ్ (18)ను ప్రభాత్ జయసూర్య పెవిలియన్ చేర్చగా, సిరాజ్‌తో కలిసి ధ్రువ్ రెండో సెషన్‌ను ముగించాడు. ఆఖరి సెషన్‌లో ధ్రువ్ 171 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకోగా, సిరాజ్(3) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. దూకుడుగా ఆడిన ధ్రువ్ వేగంగా పరుగులు రాబట్టి స్కోర్‌ను 500 దాటించడంతో భారత్ తమ ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. అనంతరం శ్రీలంక బ్యాటింగ్‌కు దిగగా 2 బంతులు పడగానే వర్షం అంతరాయం కలిగించింది. ఆ తర్వాత ఆట తిరిగి ప్రారంభం కాగా, శ్రీలంక 3 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 8 పరుగులు చేసింది. లాహిరు ఉడారా(1) ప్రసిధ్ కృష్ణ ఔట్ చేయగా, ప్రభాత్ జయసూర్య(2)ను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. వర్షం కారణంగా రెండో రోజు 56 ఓవర్ల ఆటనే సాధ్యమైంది.



వాణిజ్యం

# మరో 9దేశాలతో వాణిజ్య ఒప్పందాలకు చర్చలు!

## 75% ప్రపంచ వాణిజ్యంలో భారత్‌కు వాటా

## జపాన్‌లో కేంద్ర మంత్రి పియూష్ గోయల్

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** ప్రపంచ వాణిజ్యంలో భారత్ తన భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు కృషి చేస్తోందని మరో 8-9 దేశాల సమూహాలు, వ్యక్తిగత దేశాలతో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల కోసం చర్చలు జరుపుతోందనికేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు.15 ట్రిలియన్ డాలర్ల జీడీపీ కలిగిన ఆర్థిక వ్యవస్థలతో మార్కెట్ ప్రాప్యత లభిస్తుందని చెప్పారు.భారత్ గత నాలుగేళ్లలో 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని గోయల్ పేర్కొన్నారు. ఈ ఒప్పందాలు కలిపి సుమారు 60 ట్రిలియన్ డాలర్ల జీడీపీ కలిగిన 38 అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలను కవర్ చేస్తున్నాయని వివరించారు. జపాన్, కొరియా, ఆసియాన్ ప్రాంతంతో గతంలో కుదిరిన వాణిజ్య ఒప్పందాలను కలుపుకుంటే మరో 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలకు భారత్ ప్రాధాన్య మార్కెట్ లభిస్తోందన్నారు.దీంతో ప్రస్తుతం భారత్ సుమారు 70 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలకు ప్రాధాన్య మార్కెట్ ప్రాప్యత కల్పించే ఒప్పందాలను కలిగి ఉందని గోయల్ చెప్పారు. కొత్తగా చర్చలు జరుగుతున్న ఒప్పందాలు పూర్తయితే ప్రపంచ వాణిజ్యంలో దాదాపు 75 శాతం భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల పరిధిలోకి వస్తుందని తెలిపారు. జపాన్ పర్యటనలో భాగంగా భారత్, జపాన్ వ్యాపార ప్రతినిధులను ఉద్దేశించి గోయల్ మాట్లాడుతూ, భారత్‌కు భారీ దేశీయ మార్కెట్ ఉందని, అదే సమయంలో ప్రపంచానికి తన మార్కెట్లను తెరిచి ఉంచుతోందని అన్నారు. పీయూష్ గోయల్ 27 వరకు జపాన్‌లో పర్యటిస్తున్నారు. భారత్ నుంచి ఇప్పటివరకు వెళ్లిన అతిపెద్ద వ్యాపార ప్రతినిధి బృందానికి ఆయన నేతృత్వం వహిస్తున్నారు. టోక్యో, నాగోయా, ఒసాకా నగరాల్లో ఆయన పర్యటన కొనసాగనుంది.ఈ ప్రతినిధి బృందంలో 200 మందికి పైగా వ్యాపార ప్రతినిధులు పాల్గొంటున్నారు. తయారీ, సెమీకండక్టర్లు, క్లీన్ ఎనర్జీ, ఉక్కు, ఆటోమొబైల్, ఆర్థిక సేవలు, ఆరోగ్య సంరక్షణ, స్టార్టప్‌లు తదితర రంగాలకు చెందిన ప్రతినిధులు ఇందులో ఉన్నారు.భారత్‌లో వచ్చే పదేళ్లలో జపాన్ నుంచి 10 ట్రిలియన్ యెన్‌ల పెట్టుబడులు వచ్చేలా ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గోయల్ తెలిపారు.2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత్-జపాన్ ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 27.5 బిలియన్ డాలర్లుగా ఉందని, అయితే ఇరు దేశాల మధ్య ఉన్న వాణిజ్య సామర్థంతో పోలిస్తే ఇది చాలా తక్కువేనని ఆయన పేర్కొన్నారు. జపాన్ నుంచి భారత్‌కు వచ్చిన సమీకృత పెట్టుబడులు 48 బిలియన్ డాలర్లను మించాయి. ప్రస్తుతం భారత్‌లోని వివిధ పారిశ్రామిక కేంద్రాల్లో 1,400కు పైగా జపాన్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.



# గోధుమ పిండి ఉత్పత్తుల ఎగుమతులపై నిషేధం ఎత్తివేత

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** గోధుమ పిండి, దానికి సంబంధించిన ఉత్పత్తుల ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం విధించిన నిషేధాన్ని సోమవారం తక్షణమే ఎత్తివేసింది. ఈ మేరకు గోధుమ పిండి ఎగుమతి విధానంలో సవరణలు చేసినట్లు కేంద్రం అధికారిక ప్రకటనలో వెల్లడించింది. గతంలో నిషేధిత కేటగిరీలో ఉన్న గోధుమ పిండి, సంబంధిత ఉత్పత్తులను ఇకపై స్వేచ్ఛా ఎగుమతి కేటగిరీలోకి మార్చినట్లు విదేశీ వాణిజ్య విధానాల డైరెక్టరేట్ జనరల్ నోటిఫికేషన్ జారీ చేసింది.
ఈ మార్పులు వెంటనే అమల్లోకి వస్తాయి. సవరించిన విధానం కింద మైదా, సేమోలినా రవ్వ/సూజీ, సంపూర్ణ గోధుమ పిండి హోల్‌మీల్/ఆట్టా, రిజల్టెంట్ ఆట్టా తదితర ఉత్పత్తులు ఎగుమతి చేసుకోవచ్చు. అయితే సాధారణ ఎగుమతి నిబంధనలు వర్తిస్తాయి. నాలుగేళ్ల తర్వాత పూర్తి స్థాయిలో అనుమతిదేశంలో గోధుమ, ఆట్టా ధరలు భారీగా పెరగడంతో కేంద్ర ప్రభుత్వం 2022 జూలై 12న గోధుమ ఎగుమతులపై నిషేధం విధించింది. రష్యాఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లలో గోధుమ ధరలు దాదాపు 40 శాతం పెరగడంతో భారత్ నుంచి ఎగుమతులు కూడా భారీగా పెరిగాయి. దీంతో దేశీయంగా గోధుమ, పిండి ధరలు పెరగకుండా ఎగుమతులపై ఆంక్షలు విధించారు.

# రూ.19,400 కోట్లతో జిఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ భారీ విస్తరణ

**న్యూఢిల్లీ,ఆగస్టు 24:** దేశీయ విమానయాన రంగంలో ప్రయాణికుల సంఖ్య వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ భారీ విస్తరణ ప్రణాళికలను చేపడుతోంది. న్యూఢిల్లీ, హైదరాబాద్ విమానాశ్రయాల విస్తరణ, ఆధునికీకరణ కోసం రాబోయే ఐదేళ్ల నుంచి ఏడేళ్లలో సుమారు రూ.19,400 కోట్లు పెట్టుబడి పెట్టాలని సంస్థ నిర్ణయించిందని సంస్థ ఫైనాన్స్, స్ట్రాటజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సౌరభ్ చావ్లా వెల్లడించారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా విమానాశ్రయాల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు మౌలిక వసతులను ఆధునికీకరించేందుకు ఈ పెట్టుబడులు వినియోగించనున్నట్లు ఆయన తెలిపారు.హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం విస్తరణకు సుమారు రూ.13,800 కోట్లు, న్యూఢిల్లీ విమానాశ్రయానికి రూ.5,600 కోట్లు కేటాయిస్తున్నట్లు చావ్లా చెప్పారు. ఆయా విమానాశ్రయ సంస్థలు రుణం, ఈక్విటీ కలయికతో ఈ పెట్టుబడులను సమకూర్చుకుంటాయని, ఇవి జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్ కంపెనీకి నేరుగా సంబంధించిన పెట్టుబడులు కావని వివరించారు.ప్రస్తుతం అమెరికా, చైనా తర్వాత ప్రపంచంలోనే మూడో అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌గా



భారత్ ఉంది. ప్రభుత్వ అంచనాల ప్రకారం వచ్చే 14 ఏళ్లలో దేశంలో విమాన ప్రయాణికుల సంఖ్య ఆరు రెట్లు పెరిగి సుమారు 110 కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. వాణిజ్య విమానాల సంఖ్య కూడా 2014లో ఉన్న 400 నుంచి 2040 నాటికి 2,350కి పైగా పెరుగుతుందని అంచనా. విస్తరణ పూర్తయిన తర్వాత హైదరాబాద్ విమానాశ్రయం ఏడాదికి సుమారు 8 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని చావ్లా తెలిపారు. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ పరిధిలో ప్రస్తుతం భారత్‌లో ఆరు విమానాశ్రయాలు, ఫిలిప్పీన్స్‌లో ఒక విమానాశ్రయం ఉన్నాయి. గ్రీస్‌లో మరో విమానాశ్రయం నిర్మాణంలో ఉంది. ఈ నేపథ్యంలో న్యూఢిల్లీ, హైదరాబాద్‌లో చేపడుతున్న విస్తరణ సంస్థ ఆధునికీకరణ కార్యక్రమాలకు ఆరంభం మాత్రమే కావచ్చని చావ్లా పేర్కొన్నారు.



# రివ్వున ఎగసిన పసిడి, వెండి ధరలు!


## బంగారం రూ.880, వెండి రూ.5వేలు పెరుగుదల

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** దేశీయంగా బంగారం ధరలు సోమవారం స్వల్పంగా పెరిగాయి.మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో బంగారం ధర 0.4 శాతం లాభపడి, 10 గ్రాములకు రూ.1.62 లక్షల స్థాయిలో ప్రారం భమైంది.మార్కెట్ గణాంకాల ప్రకారం 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1. 62-1.64 లక్షల పరిధిలో కొనసాగుతోంది. దేశీయ మార్కెట్లో 24 క్యారెట్ల (99.9 శాతం స్వచ్ఛత) బంగారం గ్రాము ధర రూ.16,397గా, 22 క్యారెట్ల (91.6 శాతం స్వచ్ఛత) బంగారం గ్రాము ధర రూ.15,030గా ఉంది. 18 క్యారెట్ల (75%స్వచ్ఛత) బంగారం గ్రాము ధర రూ.12,293గా నమోదైంది.అంతర్జాతీయ మార్కెట్లోనూ బంగారం ధరలు మూడు నెలలకు పైగా గరిష్ఠ స్థాయికి చేరాయి. బలహీనంగా ఉన్న అమెరికా డాలర్, కీలకమైన అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలపై మార్కెట్ దృష్టి, ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ కెవిన్ వార్ష్ ఈ వారం చేయనున్న ప్రసంగం వంటి అంశాలు పసిడి ధరలకు మద్దతునిస్తున్నాయి. సోమవారం అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ఔన్స్ ధర 4,649.08 డాలర్లకు చేరింది. దేశంలోని ముంబయిలో పదిగ్రాముల 24 కేరట్ల బంగారా రూ.1,63.397గాను, 22కేరట్లు రూ.1,50, 030 గాను, 18 కేరట్లు రూ.1,22,930గానున నడుస్తోంది. అదే హైదరాబాద్‌లో రూ.163. 970, 22 కేరెట్లు రూ.1, 50,030, 18 కేరట్లు రూ.1,22,930గాను ఉన్నాయి.

# స్టాక్ మార్కెట్లకు గ్లోబల్ ఎఫెక్ట్!

## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఆగస్టు 24:** బలహీనమైన అంతర్జాతీయ సంకేతాల నేపథ్యంలో దేశీయ ఈక్విటీ సూచీలు సోమవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. దీంతో వరుసగా రెండు సెషన్ల లాభాలకు బ్రేక్ పడింది. నిఫ్టీ 24,250 మార్క్ దిగువన ముగిసింది. పీఎస్‌యూ బ్యాంక్, మీడియా, బ్యాంకింగ్ షేర్లు నష్టపోగా మెటల్, రియల్టీ, ఐటీ షేర్లు లాభపడ్డాయి. సెన్సెక్స్ 171.72 పాయింట్లు నష్టపోయి 77,369.11 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ 32.95 పాయింట్లు తగ్గి 24,219.05 వద్ద ముగిసింది. గత రెండు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 0.82 శాతం, నిఫ్టీ 0.72 శాతం చొప్పున లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.01 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.17 శాతం క్షీణించాయి. బీఎస్ఈలో మొత్తం 2,041 షేర్లు లాభపడగా, 2,393 షేర్లు నష్టపోయాయి. మరో 254 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీ 0.93 శాతం తగ్గి 8,539.75 వద్ద ముగిసింది. పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లలో బ్యాంక్ ఆఫ్ బరోడా 2.55 శాతం, కెనరా బ్యాంక్ 2.29 శాతం, ఎస్‌బీఐ 1.20 శాతం, బ్యాంక్ ఆఫ్



ఇండియా 1.18 శాతం, ఇండియన్ బ్యాంక్ 1.17 శాతం, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 1 శాతం చొప్పున నష్టపోయాయి. పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ 0.90 శాతం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 0.39 శాతం, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 0.26 శాతం తగ్గాయి. హెరాన్బా ఇండస్ట్రీస్ షేరు 8.99 శాతం దూసుకెళ్లింది.అర్బన్ కంపెనీ 6.05 శాతం లాభపడింది.విశాల్ మెగా మార్ట్ 9.31 శాతం పెరిగింది.కెల్టన్ టెక్ సొల్యూషన్స్ 1.18 శాతం ఎగిసింది.మరోవైపు క్యాప్లిన్ పాయింట్ ల్యాబొరేటరీస్ 2.70 శాతం పడిపోయింది. టాటా పవర్ 0.76 శాతం తగ్గింది. సీగల్ ఇండియా 2.69 శాతం లాభపడింది. లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్అండ్‌టీ) 0.07 శాతం నష్టపోయింది.ఎల్అండ్‌టీకి సంబంధించి ‘అల్ట్రామెగ్గా’ కేటగిరీ కింద వచ్చిన కాంట్రాక్ట్ విలువ రూ.15,000 కోట్లకు పైగా ఉన్నట్లు పేర్కొంది.డాలరుతో రూపాయి మారకం విలువలు 97.74వద్ద ముగిసింది.




# పదేళ్లలో 13 వేల రెట్లు పెరిగిన యుపిఐ లావాదేవీలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** దేశంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ యుపిఐ లావాదేవీలు గత పదేళ్లలో భారీగా పెరిగింది. పదేళ్లక్రితం 1.78 కోట్లుగా ఉన్న వార్షిక యూపీఐ లావాదేవీలు.. ప్రస్తుతం 24,162 కోట్లకు పైగా చేరుకున్నాయని కేంద్ర ఆర్థిక శాఖ సోమవారం వెల్లడించింది. దాదాపు 13 వేల రెట్లు పెరిగినట్లు తెలిపింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 2016 ఆగస్టు 25న యూపీఐని ప్రారంభించింది. అప్పటి నుంచి ఇది దేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థకు వెన్నెముకగా మారడంతో పాటు ఆర్థిక సేవలను మరింత విస్తృత ప్రజలకు చేరువ చేయడంలో కీలక పాత్ర పోషిస్తోంది. యూపీఐ ద్వారా జరిగే లావాదేవీల విలువ కూడా గణనీయంగా పెరిగింది. పదేళ్ల క్రిందట రూ.0.07 లక్షల కోట్లుగా ఉన్న మొత్తం లావాదేవీల విలువ ప్రస్తుతం రూ.314 లక్షల కోట్లకు చేరుకుంది. దశాబ్ద కాలంలో 4,000 రెట్లకు పైగా పెరిగింది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో యూపీఐ కీలకంగా మారింది. వివిధ బ్యాంకులు, చెల్లింపు సంస్థల మధ్య అనుసంధానాన్ని కల్పిస్తూ తక్షణ చెల్లింపులకు అవకాశం కల్పిస్తోంది. వ్యక్తి నుంచి వ్యక్తికి (పి2పి), వ్యక్తి నుంచి వ్యాపారికి సులభంగా చెల్లింపులు చేసే వెసులుబాటు కల్పిస్తోంది. లావాదేవీల పరంగా ప్రపంచంలోనే అతిపెద్ద రియల్‌టైమ్ పేమెంట్ వ్యవస్థగా యూపీఐని అంతర్జాతీయ ద్రవ్య నిధి గుర్తించింది. ఒక్క మే నెలలో తొలిసారిగా నెలవారీ లావాదేవీల సంఖ్య 2,300 కోట్ల మార్కును దాటింది. ఆ నెలలో 2,320 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. జూలైలో ఈ సంఖ్య మరో రికార్డును సృష్టించి 2,366 కోట్లకు చేరింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.